# పోతిరెడ్డిపాడు వివాదం

(పుట్టుక - పరిణామక్రమం - పర్యవసానాలు)




శ్రీధర్‌రావు దేశ్‌పాండే
సల్లా విజయ్ కుమార్



ప్రచురణ
తెలంగాణ విశ్రాంత ఇంజనీర్ల సంఘం
TELANGANA RETIRED ENGINEERS ASSOCIATION
హైదరాబాద్




# పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ఉపగ్రహ చిత్రం



# పోతిరెడ్డిపాడు వివాదం

(పుట్టుక - పరిణామక్రమం - పర్యవసానాలు)


శ్రీధర్‌రావు దేశ్‌పాండే

సల్లా విజయ్ కుమార్



ప్రచురణ

తెలంగాణ విశ్రాంత ఇంజనీర్ల సంఘం

TELANGANA RETIRED ENGINEERS ASSOCIATION

హైదరాబాద్




# పోతిరెడ్డిపాడు వివాదం

**పుట్టుక - పరిణామక్రమం - పర్యవసానాలు)**

ప్రచురణ :
**విశ్రాంత ఇంజనీర్ల సంఘం**
**ఆర్. విద్యాసాగర్ రావు ఇంజనీర్స్ భవన్,**
**మెట్రో పిల్లర్ నెం. ఎ-1143 దగ్గర,**
**ఎర్రంమంజిల్, హైదరాబాద్ - 500082.**

మొదటి ప్రచురణ : సెప్టెంబర్ 2020

వెల : 100/-
నవోదయ బుక్ హౌజ్ (సోల్ డిస్ట్రిబ్యూటర్)

ప్రింటింగ్ :
**శ్రీ దత్తసాయి గ్రాఫిక్స్ ,**
1-1-651/8, గాంధీనగర్, హైదరాబాద్-500 080.
సెల్: 9866381116

**కాపీ రైట్: © సర్వ హక్కులు రచయితలవే**

**శ్రీధర్‌రావు దేశ్‌పాండే (9491060585)**
OSD to CM (Irrigation)

**సల్లా విజయ్ కుమార్ (9440699249)**
Executive Engineer, ISWR

# ముందుమాట

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె సి ఆర్ గారు మొదటి నుండి పొరుగు రాష్ట్రాలతో స్నేహ పూర్వక ధోరణిని అవలంబించి నీటి పారుదల రంగ అభివృద్ధికై కృషి చేస్తున్నారు. ఇచ్చి పుచ్చుకునే ధోరణిని పాటించి పెన్ గంగా, ప్రాణహిత, గోదావరి నదులపై ప్రాజెక్టుల నిర్మాణానికి మహారాష్ట్రతో ఒక చారిత్రక ఒప్పందాన్ని కుదుర్చుకొని కొత్త ఒరవడికి నాంది పలికారు. ఈ ఒప్పందం దేశం దృష్టిని ఆకర్షించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ జగన్ మోహన్ రెడ్డి గారికి కూడా తన స్నేహ హస్తాన్ని అందించారు ముఖ్యమంత్రి కె సి ఆర్ గారు. ఇరు రాష్ట్రాలు బేసిన్ల బేషజాలు లేకుండా గోదావరి, కృష్ణా జలాలను ప్రజలందరి బాగుకై వాడుకుందామని ఆకాంక్షించారు. కానీ, కారణాలు ఏవైతేనేమి గతంలో లాగానే ఆంధ్రప్రదేశ్ ఘర్షణాత్మక వైఖరిని ప్రదర్శిస్తున్నది. కృష్ణా నది జలాలను.. ముఖ్యంగా శ్రీశైలం రిజర్వాయర్ గానీ, అక్కడకు పైనుండి వచ్చే నీళ్లపై గానీ పూర్తిగా తమకే హక్కు ఉంది అని భావిస్తున్నది. పోతిరెడ్డిపాడు విస్తరణ, రాయలసీమ ఎత్తిపోతల పథకం తదితర అంశాలతో జీఓ 203, జీఓ 388 లాంటివి వెలువరించింది. వాటి అమలుకై కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు సైతం ధిక్కరించి ముందుకు సాగుతున్నది.

ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం తమ రాష్ట్ర ప్రయోజనాలు కాపాడుకొనేందుకు పలు చర్యలు చేపట్టింది. కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖను, కృష్ణా బోర్డును రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టును వెంటనే ఆపించాలని కోరింది. సుప్రీం కోర్టులో కేసు వేసింది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ వద్ద నిపుణుల కమిటీ ఇచ్చిన తప్పుడు ఏకపక్ష పక్షపాత నివేదికలను అడ్డుకుంది.

ఇదే సందర్భంలో, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ వ్యవస్థ గురించి ప్రజల్లో ఆందోళన, నిజాలు తెలుసుకోవాలన్న ఆసక్తి నెలకొన్నది. ఈ అంశాలపై సరియైన అవగాహన లేనందువల్ల తప్పుడు సమాచారాలు విస్తృతమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో శ్రీశైలం ప్రాజెక్టు మరియు పోతిరెడ్డిపాడు వ్యవస్థ గురించి, వాటి పుట్టు పూర్వోత్తరాలు, పరిణామ క్రమం, వాటి ప్రభావాల గురించి సాధికారిక సమాచారాన్ని క్రోడీకరించి అందించే ప్రయత్నం చేశారు రచయితలు శ్రీధర్‌రావు దేశ్ పాండే మరియు సల్లా విజయకుమార్. ఇది హర్షణీయం అయిన పని. ఈ విషయాలపై ఆసక్తి గల ఇంజనీర్లకు, ఇంజనీర్లు కాని ఆలోచనాపరులకు, పత్రికా విలేఖరులకు, అందరికీ ఒక రిఫరెన్స్ పుస్తకంగా ఉపయోగపడ్తుంది.

ఇంత మంచి పుస్తకాన్ని రచించిన రచయితలకు తెలంగాణ విశ్రాంత ఇంజనీర్ల సంఘం తరపున అభినందనలు తెలియజేస్తున్నాము. మా ఇతర ప్రచురణలను ఆదరించినట్టుగానే ఈ పుస్తకాన్ని కూడా ఆదరిస్తారని ఆశిస్తున్నాము.

**సంగెం చంద్రమౌళి** — అధ్యక్షులు,

**మేరెడ్డి శ్యామ్ ప్రసాద్ రెడ్డి** — ప్రధాన కార్యదర్శి,

**తెలంగాణ విశ్రాంత ఇంజనీర్ల సంఘం**

# మా మాట ..

ఈ పుస్తకాన్ని ఎందుకు రాసాము? ఆ నేపథ్యాన్ని వివరించాల్సిన అవసరం ఉందని భావించి ఈ కొన్ని మాటలు మీతో పంచుకుంటున్నాము. కృష్ణా జలాల లభ్యతపై, వినియోగంపై మేధావుల్లో, సామాన్య ప్రజల్లో కొన్ని అపోహలు ఉన్నట్టు, కొన్ని అవాస్తవాలు ప్రజల్లో ప్రచారంలో ఉన్నట్టు అనిపించింది. ఇవి ఆంధ్రా మేధావుల్లో మరింత ఎక్కువ. "కృష్ణా నది పరీవాహక ప్రాంతంలో భౌగోళికంగా ప్రతికూల పరిస్థితులు ఉండడం తెలంగాణ దురదృష్టం", "కృష్ణా నది నీటిపై ఆంధ్ర, రాయలసీమలకే ప్రధానమైన హక్కు ఉంది", "కృష్ణా ఒక లోటు బేసిన్ కాబట్టి కొత్తగా తెలంగాణ ఎలాంటి ప్రాజెక్టులు చేపట్టలేదు".. లాంటివి ముమ్మరంగా ప్రచారంలో ఉన్నాయి. వాటిని విస్తృతంగా ప్రచారం చేసి తెలంగాణ ప్రజలను కూడా చాలావరకు నమ్మించాయి నాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు, పత్రికలు, మేధావి వర్గాలు. ఈ అపోహలను బద్దలు కొట్టడం, కృష్ణా నది, శ్రీశైలం రిజర్వాయర్, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ వ్యవస్థలకు సంబంధించిన నిజానిజాలను ప్రజలందరికీ తెలియజేయడమే ఈ పుస్తకం లక్ష్యం. కృష్ణా నది జలాలపై తెలంగాణనే ప్రథమ హక్కుదారు అనే విషయాన్ని కూడా ఈ పుస్తకంలో ఆధారాలతో స్పష్టం చేశాం.

హైదరాబాదు రాష్ట్రంలో నీటి పారుదల సదుపాయాలు సాధ్యమైనంతగా కల్పించడం పైన, అంతర్రాష్ట్ర నదీ జలాలపై హక్కులు సుస్థిరపరుచుకోవడంపైన నాటి హైదరాబాద్ నిజాం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. రాష్ట్రాల పునర్విభజన తరువాత హైదరాబాదు రాష్ట్రంలో ప్రతిపాదించిన అప్పర్ కృష్ణా ప్రాజెక్టు (ఆల్మట్టి), తుంగభద్ర ప్రాజెక్టులున్న ప్రాంతాలు కర్ణాటక రాష్ట్రంలో చేర్చారు. అయితే, ఆ ప్రాజెక్టులకు కేంద్రం వద్ద మరియు కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ల వద్ద ఆ రెండు రాష్ట్రాలు నీటి వాటాలు పట్టుబట్టి సాధించుకొన్నాయి. అదే సమయంలో కృష్ణా ప్రధాన నదిపై తెలంగాణ ప్రాంతాలకు నీరందించే పలు ప్రాజెక్టులు నాటి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వాల వైఖరి వల్ల నిర్మాణానికి, నీటి కేటాయింపులకు నోచుకోలేదు.

మహబూబ్ జిల్లాకు దాదాపు 200 టీఎంసీలను మళ్లించే నీటి పారుదల ప్రాజెక్టులను తెలంగాణ కోల్పోయింది. అదే సమయంలో, హైదరాబాదు రాష్ట్రం అన్ని విధాల ఇన్వెస్టిగేషన్ తదితరాలు పూర్తి చేసి నిర్మాణానికి సిద్ధం చేసుకున్న కేవలం తెలంగాణ ప్రాంతానికై ఎడమ కాలువ మాత్రమే కలిగిన లోయర్ కృష్ణా (నందికొండ, నాగార్జునసాగర్) ప్రాజెక్టుకు ఆంధ్ర ప్రాంతానికి నీళ్ళు మళ్లించే కుడి కాలువ కొత్తగా చేర్చబడింది. చారిత్రక వినియోగాల పరంగా ప్రకాశం బ్యారేజీ నుండి కృష్ణా డెల్టా సిస్టంకు 220 టీఎంసీలకు మొదట ప్రాధాన్యత ఇవ్వాలని పట్టుబట్టిన ఆంధ్ర ప్రభుత్వం, జూరాల డ్యాం వద్ద జూరాల గ్రావిటీ స్కీం, లిఫ్ట్ స్కీం లకు ప్రాధాన్యత కోరలేదు.

నీటి పారుదల రంగంలో ఇట్లాంటి వివక్షకు భవిష్యత్తులో గురవుతామనే ఆనాడు హైదరాబాదు రాష్ట్ర ప్రజలు ఆంధ్ర రాష్ట్రంతో కలపవద్దని రాష్ట్ర పునర్విభజన కమిషన్ (1955) ముందు ప్రాధేయపడ్డారు. అయితే, కమిషన్ సిఫార్సులకు విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం తెలంగాణను ఆంధ్రతో కలిపిన నాటి నుండి ప్రత్యేక తెలంగాణకై ఉద్యమం సాగుతూనే ఉంది. ఆచార్య జయశంకర్ తదితరుల కృషి, తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భావం, కె సి ఆర్ నాయకత్వంలో రాజీలేని వ్యూహాత్మక పోరాటం, ఆర్ విద్యాసాగర్ రావు వంటి మేధావుల రచనలు, ఉపన్యాసాలు రగిలించిన చైతన్యం, అనేక మంది ఇతర నాయకులు, సంఘాలు, తెలంగాణ ప్రజలందరి ప్రతిఘటనతో 2014 లో తెలంగాణ రాష్ట్రం సాకారమైంది.

తెలంగాణ ఏర్పడ్డ నాటి నుండి తెలంగాణ ప్రభుత్వం నీటి పారుదల రంగ అభివృద్ధికై నిరంతరంగా శ్రమిస్తున్నది. అదే సమయంలో కృష్ణా నది జలాలపై తమకే మొదటి హక్కున్నదని భావించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మొత్తంగా కృష్ణా నదినే బేసిన్ ఆవల ఉన్న తమ ప్రాంతాలకు మళ్లించే విధంగా ప్రయత్నాలు చేస్తూ వచ్చింది. దానికి పరాకాష్టగా 2020, మే నెలలో జీ ఓ 203 ను విడుదల చేసింది. అది అన్యాయమని తెలంగాణ ప్రభుత్వమంటే, తెలంగాణ కడుతున్న ప్రాజెక్టులను, తాగునీటి పథకం మిషన్ భగీరథ, తుమ్మిళ్ల లిఫ్ట్ స్కీమ్, కాళేశ్వరం ప్రాజెక్టు, పాలమూరు–రంగారెడ్డి లిఫ్ట్ స్కీం, డిండి లిఫ్ట్ స్కీంలను ఆపాలని ప్రతి ఫిర్యాదు చేసి కయ్యానికి కాలు దువ్వింది.

తెలంగాణ నీటి పారుదల వ్యవస్థ భౌగోళిక కారణాల వల్ల కాదు, రాజకీయ కారణాల వల్ల వెనుకబడింది. ఈ సంగతి తెలంగాణ ముఖ్యమంత్రి కె సి ఆర్ గారికి బాగా తెలుసు. బేసిన్లోని ప్రాంతాలకే ఆ నదీ జలాలలై ప్రథమ హక్కుంటుంది. కాబట్టి కృష్ణా జలాలపై మొదటి హక్కు తెలంగాణదే. కృష్ణా బేసిన్ ఒక లోటు బేసిన్ అయితే, లోటు బేసిన్ ఆవలకు నీళ్ళు మళ్లించడం ఏ విధంగా సమర్థనీయం. మొదట బేసిన్ లోని అవసరాలు తీర్చకుండా బేసిన్ ఆవలకు మళ్లించడం సహజన్యాయ సూత్రాలకు, బచావత్ ట్రిబ్యునల్ మూల సూత్రాలకు విరుద్ధం. బేసిన్ ఆవలకు మళ్లించే చారిత్రక రక్షణలు ఇచ్చిన నీటిని శాస్త్రీయంగా గణించి, ప్రత్యామ్నాయ వనరుల ద్వారా నీటిని సరఫరా చేయగలిగే వీలును పరిగణించి, అట్లా మిగిలిన నీటిని తెలంగాణకు కేటాయించాలి. ఈ సంగతులన్నీ తొమ్మిది అధ్యాయాల్లో కూలంకషంగా వివరించే ప్రయత్నం ఈ పుస్తకంలో చేశాము. వీటికి అనుబంధంగా మరికొంత సమాచారాన్ని కూడా జతపరచినాము.

ఈ పుస్తకం ప్రచురించేకంటే ముందు ఇవి వ్యాసాల రూపంలో పత్రికల్లో అచ్చు అయినాయి. ఈ వ్యాసాలను ప్రచురించిన నమస్తే తెలంగాణ పూర్వ సంపాదకులు శ్రీ కట్టా శేఖర్ రెడ్డి గారికి , ఆంధ్రజ్యోతి సంపాదకులు శ్రీ కె శ్రీనివాస్ గారికి , మన తెలంగాణ సంపాదకులు శ్రీ మిట్టపల్లి శ్రీనివాస్ గారికి, తెలంగాణ మాస పత్రిక సంపాదకులు శ్రీ అష్టకాల రామ్మోహన్ గారికి, తెలంగాణ టుడే సంపాదకులు శ్రీ శ్రీనివాస్ రెడ్డి గారికి, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ రెసిడెంట్ ఎడిటర్ శ్రీ చిర్రావూరి కృష్ణారావు గారికి, హన్స్ ఇండియా సంపాదకులు శ్రీ రాము శర్మ గారికి నమస్సులు.

పుస్తక రచనకు ప్రోత్సాహం ఇచ్చి ప్రచురిస్తున్న తెలంగాణ విశ్రాంత ఇంజనీర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీయుతులు సంగెం చంద్రమౌళి, శ్యాంప్రసాద్ రెడ్డి గార్లకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. ఈ వ్యాసాలు పత్రికల్లో అచ్చు అయినప్పుడు చదివి మమ్ములను అభినందించిన పాఠకులు, సహచర ఇంజనీర్లు, పత్రికా మిత్రులు, ఫేస్ బుక్ మిత్రులు .. అందరికీ ధన్యవాదాలు.

మమ్ములను నిరంతరం ప్రోత్సహిస్తున్న సాగునీటిశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరి శ్రీ రజత్ కుమార్ గారికి, ఇంజనీర్–ఇన్–చీఫ్‌లు శ్రీయుతులు మురళీధర్, నాగేందర్ రావు, అనిల్ కుమార్, నల్లా వెంకటేశ్వర్లు, బి. హరిరాం గార్లకు, సహచర చీఫ్ ఇంజనీర్లు అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు.

శ్రీ వి. ప్రకాశ్‌గారు ఉద్యమకాలం నుంచి కూడా సాగునీటి రంగంలో తన వ్యాసాల ద్వారా ఉపన్యాసాల ద్వారా ప్రజలను చైతన్యపరిచినారు. వారు జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ అయ్యాక ఆయనతోపాటు పనిచేసే అవకాశం మాకు లభించింది. పోతిరెడ్డిపాడుతో పాటు అనేక అంశాలు చర్చించే అవకాశం కలిగింది. వారికి కూడా ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాము.

పోతిరెడ్డిపాడు విస్తరణకు వ్యతిరేకంగా అధికార పక్ష శాసన సభ్యుడిగా ఉంటూ కూడా రాజశేఖర రెడ్డి ప్రభుత్వంతో ఒంటరిగా ధీరోదాత్తమైన పోరాటం చేసిన స్వర్గీయ పి జనార్ధన్ రెడ్డి గారిని పోతిరెడ్డిపాడు విస్తరణను వ్యతిరేకిస్తూ పార్టీ అధ్యక్షులు కె సి ఆర్ ఆదేశాల మేరకు మంత్రి పదవులను గడ్డిపోచలా త్యజించి ప్రభుత్వం నుండి బయటపడి అసెంబ్లీ వేదికగా పోరాడిన టిఆర్ఎస్ ఎంఎల్ఏ లు శ్రీయుతులు తన్నీరు హరీష్ రావు, నాయని నరసింహారెడ్డి, కెప్టెన్ వి. లక్ష్మి కాంతరావు, ఏ. చంద్రశేఖర్, సంతోష్ రెడ్డి, జి. విజయరామారావు గార్లను ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటున్నాము.

అపెక్స్ కౌన్సిల్ సమావేశం కోసం తయారీలో భాగంగా గౌరవ ముఖ్యమంత్రి కెసిఆర్ గారితో సుధీర్ఘమైన సమావేశాల్లో పాల్గొనే అవకాశం మాకు వచ్చింది. ఆ సమావేశాల్లో మంచి intellectual debate జరిగింది. ఆ సమావేశాల్లో గౌరవ ముఖ్యమంత్రి గారు వెలుబుచ్చిన విలువైన అభిప్రాయాలు ఈ పుస్తక రచనకు దోహదపడినాయి. వారికి కూడా హృదయపూర్వక నమస్సులు.

ఈ పుస్తకాన్ని పాఠకులు ఆదరిస్తారని ఆశిస్తున్నాము. ఈ పుస్తకంలోని భావాలకు మొత్తంగా బాధ్యత మాదే. వీటిపై ఎవరినీ బాద్యులను చేయనవసరం లేదని మనవి చేస్తున్నాము. ఈ పుస్తకంపై ఆరోగ్యకరమైన చర్చను ఆహ్వానిస్తున్నాము.

14.09.2020,
హైదారాబాద్

**శ్రీధర్‌రావ్ దేశ్‌పాండే**

**నల్లా విజయ కుమార్**

# విషయసూచిక

అధ్యాయం-1
పోతిరెడ్డిపాడు వివాదం : ప్రస్తుత స్థితి ... 11

అధ్యాయం-2
పోతిరెడ్డిపాడు పూర్వరంగ చరిత్ర ... 15

అధ్యాయం-3
పోతిరెడ్డిపాడు పుట్టుక - పరిణామ క్రమం ... 22

అధ్యాయం-4
జి.ఓ. 203 పర్యవసానాలు - ప్రభావాలు ... 31

అధ్యాయం-5
కృష్ణానదీ జలాల కేటాయింపులు ... 35

అధ్యాయం-6
నదీ జలాల పంపిణీ :
జాతీయ, అంతర్జాతీయ న్యాయ సూత్రాలు ... 39

అధ్యాయం-7
బచావత్ ట్రిబ్యునల్ మూల సూత్రాలు :
కృష్ణ జలాలపై తెలంగాణకు హక్కులు ... 47

అధ్యాయం-8
చర్చ - కృష్ణా జలవివాదాలు :
ఘనీభవించిన మూస భావనలు ... 50

అధ్యాయం-9
చర్చ - కృష్ణా జలాల పున:పంపిణీ సదస్సు
అమరావతిలో జరగాలి ... 54

అనుబంధాలు ... 59

రిఫరెన్సులు ... 87

అధ్యాయం-1

# పోతిరెడ్డిపాడు వివాదం : ప్రస్తుత స్థితి

పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ల వ్యవస్థ సామర్థ్యాన్ని అనూహ్యంగా 80,000 క్యూసెక్కులకు పెంచుతూ మే 5, 2020 తేదీ నాడు, జి ఓ 203 ద్వారా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన పరిపాలనా ఉత్తర్వులు తెలంగాణ ప్రజలలో ఒక భయాన్ని నింపింది. ప్రతి రోజూ గరిష్టంగా 8 టీఎంసీల కృష్ణా నది నీటిని శ్రీశైలం రిజర్వాయర్ నుండి పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ వ్యవస్థ ద్వారా ఆంధ్ర ప్రదేశ్ కు తరలించడం ఆ జీఓ లక్ష్యం.

ఒకవైపు తెలంగాణ ప్రభుత్వం స్నేహపూర్వక వాతావరణంలో ఇరు రాష్ట్రాలకు లాభించే విధంగా కృష్ణా, గోదావరి జలాలను వాడుకునేందుకు ప్రయత్నిస్తుంటే ఈ పరిణామం దురదృష్టకరం. మాకు హక్కుగా ఉన్న నీళ్ళనే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ వ్యవస్థ ద్వారా వాడుకుంటున్నామనీ, అయితే సరిగా వాడుకోలేక పోతున్నాం కాబట్టి ఇంకా సామర్థ్యాన్ని పెంచుకుంటున్నాం అని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం చెబుతున్నది. అసలు నిజంగా వారికి హక్కు ఉందా? ఇప్పుడున్న సామర్థ్యానికే అసలు అనుమతులున్నాయా? శ్రీశైలం ప్రాజెక్టు, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్? శ్రీశైలం కుడి ప్రధాన కాలువ వ్యవస్థల పూర్వాపరాలేమిటి? వాటి నిజమైన నీటి కేటాయింపులేమిటి? తెలంగాణ రాష్ట్రం ఎందుకు వ్యతిరేకిస్తున్నది? మొదలైన సందేహాలకు సమాధానాలు తెలియజేసే ప్రయత్నం ఈ పుస్తకంలో చేశాం.

**పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ వ్యవస్థ:**

శ్రీశైలం రిజర్వాయర్ నుండి నీటిని విడుదల చేసేందుకు నిర్మించిన పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ మరియు దాని దిగువన గల శ్రీశైలం కుడి ప్రధాన కాలువ (SRMC) కలిపి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ వ్యవస్థగా చెప్పవచ్చు. SRMC పొడవు 16.4 కిలోమీటర్లు ఉంటుంది. దాని చివరన బనకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ల సమూహం ఉంటుంది.

**జి ఓ 203 లో కీలక అంశాలు :**

మొదట జి ఓ నంబరు 203 లో ఉన్న కీలక అంశాలు ఏమిటో తెలుసుకుందాం.

- శ్రీశైలం జలాశయం నుండి రోజుకు 3 టిఎంసిల నీటిని ఎత్తిపోసి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ దిగువన శ్రీశైలం కుడి ప్రధానకాలువ (ఎస్.ఆర్.ఎమ్.సి.) లో జారవిడిచేందుకు సంగమేశ్వరం వద్ద రాయలసీమ లిఫ్ట్ పథకం యొక్క పంపింగ్ స్టేషన్ నిర్మాణం. దీని అంచనా విలువ రూ. 3825.00 కోట్లు. ఈ పంప్ హౌజ్‌లో పంపులను +797 అడుగుల లెవెల్ వద్ద బిగిస్తారు.
- పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, దాని కింద శ్రీశైలం కుడి ప్రధాన కాలువను బనకచర్ల కాంప్లెక్స్ వరకు ప్రవాహ సామర్థ్యాన్ని 80 వేల క్యూసెక్కులకు పెంచడానికి లైనింగ్, తదితర ఇంప్రూవ్ మెంట్ పనులు చేయడం. ఈ పనుల అంచనా విలువ : రూ. 570.45 కోట్లు
- బనకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ల కాంప్లెక్స్ వద్ద నుండి బయలుదేరే శ్రీశైలం కుడి బ్రాంచి కాలువ (ఎస్.ఆర్.బి.సి.)/ గాలేరు నగరి సుజల స్రవంతి (జి.ఎన్.ఎస్.ఎస్.) కాలువను లైనింగ్ చేసి దాని ప్రవాహ సామర్థ్యాన్ని 30 వేల క్యూసెక్కులకు పెంచడం. వీటి అంచనా విలువ రూ. 2,433.70 కోట్లు.

- 203 జి ఓ లో పేర్కొన్న పనుల మొత్తం అంచనా విలువ రూ. 6,829.15 కోట్లు. **(అనుబంధం-10)**

**శ్రీశైలం జలాశయం వివరాలు:**

- ప్రదేశం : క్రిష్ణా నదిపై, ఎడమ వైపు నాగర్ కర్నూల్ జిల్లా (పాత మహబూబ్ నగర్ జిల్లా) తెలంగాణ; కుడివైపు కర్నూల్ జిల్లా, ఆంధ్ర ప్రదేశ్
- డ్యాం స్పిల్ వే మట్టం (Crest Level) : +830 అడుగులు
- గరిష్ట జలాశయం నీటి మట్టం (MWL) : +892 అడుగులు (271.88 మీ)
- జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం (FRL) : +885 అడుగులు (+269.75 మీ)
- జలాశయం కనీస నీటి మట్టం (MDDL) : +834 అడుగులు
  (1965 రిపోర్టు ప్రకారం శ్రీశైలం జలాశయంలో విద్యుతుత్పాదనకు కనిష్ట నీటి మట్టం: +803 అడుగులు)
- శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వ:

| | |
|---|---|
| +885 అడుగుల వద్ద | : 216 టిఎంసిలు |
| +880 అడుగుల వద్ద | : 188 టిఎంసిలు |
| +854 అడుగుల వద్ద | : 89 టిఎంసిలు |
| +834 అడుగుల వద్ద | : 54 టిఎంసిలు |
| +803 అడుగుల వద్ద | : 30 టిఎంసిలు |

**పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్:**

- ఒక్కో గేటు కొలతలు: వెడల్పు 10 మీ (32.81 అడుగులు), ఎత్తు 8.57 మీ (28.12 అడుగులు)
- అన్నీ గేట్లు ఒకే కొలతలు గలిగి ఉంటాయి
- గేట్ల సంఖ్య 1984 సంవత్సరంలో : 4 గేట్లు (3 + 1 స్టాండ్-బై)
- 2006 సంవత్సరంలో : 10 గేట్లు (9 + 1 స్టాండ్-బై)
- మొత్తం : 14 గేట్లు
- పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ గేట్ అడుగుభాగం మట్టం (Sill Level) :+841 అడుగులు
- పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ డిజైన్ చేసిన శ్రీశైలం నీటి మట్టం :+880 అడుగులు
- డిజైన్డ్ డిశ్చార్జ్ ఒక్కో గేట్ ద్వారా : 4,890 క్యూసెక్కులు(9 గేట్ల ద్వారా 44,000 క్యూసెక్కులు)
- వాస్తవంగా ఒక్కో గేట్ ద్వారా : 5,140 క్యూసెక్కులు (9 గేట్ల ద్వారా 46,260 క్యూసెక్కులు)
  : (14 గేట్ల ద్వారా 71,960 క్యూసెక్కులు)
- గేట్ల ప్రక్కన గల పవర్ స్లూయిస్ డిశ్చార్జ్ : 5,500 క్యూసెక్కులు

**పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ దిగువన శ్రీశైలం కుడి ప్రధాన కాలువ (SRMC):**

- నీటి మట్టం (FSL) : +879 అడుగులు
- బెడ్ లెవెల్ (CBL) : +840 అడుగులు
- బెడ్ వెడల్పు : 78 మీ (256 అడుగులు)
- కాలువ లోతు : 11.89 మీ (39 అడుగులు)
- Side slopes : 1 : 1
- Surface fall : 1 in 12,000

- కాలువ లోని ప్రవాహమార్గం గరుకుదనం 'n' value : 0.035 (లైనింగ్ చేయని ప్రస్తుతమున్న కాలువ )
- కాలువ లోని ప్రవాహమార్గం గరుకుదనం 'n' value : 0.018 (జీఓ 203 ప్రకారం కాంక్రీట్ లైనింగ్ చేసిన తరువాత)
- బర్మ్ వెడల్పు : 3 మీ (ప్రతి 5 మీ ఎత్తు తరువాత, ఇరువైపులా)
- గరిష్ట ప్రవాహ సామర్థ్యం : 45,672 క్యూసెక్కులు (ప్రస్తుతమన్నది)
  : 88,800 క్యూసెక్కులు (జీఓ 203 ప్రకారం కాంక్రీట్ లైనింగ్ చేసిన తరువాత)
- కాలువ పొడవు : 16.4 కిమీ (పోతిరెడ్డిపాడు నుండి బనక చెర్ల వరకు)
- ఎస్.ఆర్.ఎమ్.సి ప్రవాహసామర్థ్యాలు అనుబంధం-3 లో ఉన్నాయి.

**పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం:**

| వరుస సంఖ్య | శ్రీశైలం జలాశయం నీటి మట్టం (అడుగులు) | విద్యుత్ తూము సామర్థం (క్యూసెక్కులు) | పోతిరెడ్డిపాడు 14 హెడ్ రెగ్యులేటర్ గేట్ల ద్వారా నీటి విడుదల సామర్థ్యం (క్యూసెక్కులు) | మొత్తం విడుదల సామర్థ్యం (క్యూసెక్కులు) |
|---|---|---|---|---|
| 1 | +880 | 5,500 | 71,960 (ఒక్కో గేట్ ద్వారా 5,140) | 77,460 |
| 2 | +880.32 | 5,500 | 83,300 (ఒక్కో గేట్ ద్వారా 5,950) | 88,800 |
| 3 | +881 | 5,500 | 1,02,494 (ఒక్కో గేట్ ద్వారా 7,322) | 1,07,994 |
| 4 | +882 | 5,500 | 1,25,566 (ఒక్కో గేట్ ద్వారా 8,969) | 1,31,066 |
| 5 | +883 | 5,500 | 1,44,998 (ఒక్కో గేట్ ద్వారా 10,358) | 1,50,448 |
| 6 | +884 | 5,500 | 1,62,134 (ఒక్కో గేట్ ద్వారా 11,581) | 1,67,634 |
| 7 | +885 (శ్రీశైలం గరిష్ట నీటి మట్టం, ఎఫ్ఆర్ఎల్) | 5,500 | 1,77,716 (ఒక్కో గేట్ ద్వారా 12,694) | 1,83,216 |

**పై పట్టికకు సంబంధించిన నోట్స్:**

1. పైన ఇచ్చిన పట్టికలో ఎస్ఆర్ఎంసి గరిష్ట కాలువ మట్టం +879 వద్ద ఉంటుంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ డిజైన్ చేసింది శ్రీశైలం రిజర్వాయర్ మట్టం +880 అడుగుల వద్ద మరియు SRMC కాలువ నీటి మట్టం +879 అడుగుల వద్ద ఉన్నప్పుడు డ్రైవింగ్ హెడ్ 1 అడుగు అవుతుంది. శ్రీశైలం రిజర్వాయర్ లో ఇంకా పై లెవెల్లో ఉన్నప్పుడు డ్రైవింగ్ హెడ్ కూడా పెరుగుతుంది కాబట్టి హెడ్ రెగ్యులేటర్ డిశ్చార్జ్ అదే విధంగా పెరుగుతుంది.

2. శ్రీశైలం రిజర్వాయర్ మట్టం +880.32 అడుగులు ఉన్నపుడు SRMC గరిష్ట మట్టం +879 అడుగుల వద్ద 88,800 క్యూసెక్కుల డిశ్చార్జ్ ఉంటుంది

3. శ్రీశైలం కుడి ప్రధాన కాలువ (SRMC) కాలువ గరిష్ట మట్టం +879 అడుగుల వద్ద కాలువ సామర్థ్యం 88,800 క్యూసెక్కుల కంటే ఎక్కువ కావాలంటే, కాలువ బెడ్ విడ్త్ అవసరమైనంత పెంచాల్సి ఉంటుంది.

4. 3 లో చెప్పిన విధంగా కాకుండా సహజంగానే కాలువలో ఎక్కువ డిశ్చార్జ్ వెళ్ళే అవకాశం ఉంది. కాలువ అంతా డీప్ కట్ లో ఉంటుంది కాబట్టి కాలువ గరిష్ట నీటి మట్టం కంటే పైన ఫ్రీ బోర్డ్ లో కూడా నీటి ప్రవాహం సాధ్యమవుతుంది. కాబట్టి కాలువ నుండి నీళ్ళు పొంగి పొర్లకుండానే, కాలువలో +879 ఫీట్ల కంటే ఎక్కువ మట్టం సాధ్యమవుతుంది. అంటే కాలువ వెడల్పు చేయకుండానే 88,800 క్యూసెక్కుల కంటే ఎక్కువ డిశ్చార్జ్ ఇంకా ఎక్కువ డిశ్చార్జ్ వెళ్లే అవకాశం ఉంది.

**బనకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ కాంప్లెక్స్:**

మొత్తం మూడు క్రాస్ రెగ్యులేటర్లు ఒక్కొక్కటి 11,150 క్యూసెక్కుల కెపాసిటీతో 1980 వ దశకంలో పూర్తి చేశారు. ఒకటి శ్రీశైలం కుడి బ్రాంచి కెనాల్ (SRBC) సామర్థ్యం 11,150 క్యూసెక్కులు. రెండోది చెన్నై తాగునీటి సరఫరా కు (శ్రీశైలం ఎడమ బ్రాంచి కెనాల్) దానికి తెలుగు గంగా ప్రాజెక్టు అని తరువాత పేరు పెట్టారు. సామర్థ్యం 11,150 క్యూసెక్కులు. మూడోది ఎస్కేప్ రెగ్యులేటర్. సామర్థ్యం 11,150 క్యూసెక్కులు. ఎస్కేప్ రెగ్యులేటర్ అని పేరు చెప్పినా కేవలం కేసి కెనాల్‌కు నీరందించేందుకే. తరువాత 2006 సంవత్సరంలో మరొక క్రాస్ రెగ్యులేటర్ 21,700 క్యూసెక్కుల కెపాసిటీ గలది GNSS పేరున మరో ప్రాజెక్టుకై SRBC ప్రక్కన కట్టారు. మొత్తం బనకచెర్ల వద్ద ప్రస్తుతానికి, 11,150 X 3 + 21,700 = 55,150 క్యూసెక్కుల కెపాసిటీ క్రాస్ రెగ్యులేటర్లున్నాయి. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ వద్ద 10 గేట్ల నిర్మాణం కాగానే 4 గేట్లను తొలగిస్తామని మొదట చెప్పినా నేటి వరకు తొలగించలేదు. ప్రస్తుతం మొత్తం 14 గేట్లున్నాయి. అట్లాగే బనకచెర్ల వద్ద GNSS 21,700 క్యూసెక్కుల రెగ్యులేటర్ కట్టగానే SRBC క్రాస్ రెగ్యులేటర్ ను తొలగిస్తామని చెప్పినా ఇప్పటివరకు తొలగించలేదు.

* * *

అధ్యాయం-2

# పోతిరెడ్డిపాడు పూర్వ రంగ చరిత్ర

శ్రీశైలం ప్రాజెక్టుకు కృష్ణా పెన్నార్ ప్రాజెక్టు గల సంబంధం గురించి ఈ అధ్యాయంలో చర్చిద్దాము.

**కృష్ణా - పెన్నార్ ప్రాజెక్టు :**

కృష్ణా నదిపై అనువైన ప్రదేశాల వద్ద రిజర్వాయర్లు కట్టాలని 1930 నాటికే ఇన్వెస్టిగేషన్ మొదలుపెట్టింది హైదారాబాద్ రాష్ట్ర ప్రభుత్వం. 1933 నాటికి, కృష్ణా నది ఎగువ ప్రాంతంలో "అప్పర్ కృష్ణా ప్రాజెక్ట్" (UKP) ను కమలదిన్నె, లింగసూగూర్ తాలూకా, రాయచూర్ జిల్లా వద్ద కట్టడానికి డీటైల్డ్ సర్వే పూర్తి చేసి ప్రాజెక్టు కట్టడానికి సిద్ధం చేసింది. నాడు కృష్ణా నదిపై దిగువ భాగంలో ఇరిగేషన్ కొరకు డ్యాంలు కట్టాలని హైదరాబాదు మరియు మద్రాసు రాష్ట్ర ప్రభుత్వాలు తమ రాష్ట్రాల్లో ఇన్వెస్టిగేషన్ చేస్తున్నాయి. ఆగస్ట్, 1930 లో ఇరు రాష్ట్రాల సమావేశంలో ఎలేశ్వరం గ్రామం, దేవరకొండ తాలూకా, నల్గొండ జిల్లా సమీపంలో ఒక ఉమ్మడి డ్యాం కట్టినట్లైతే ఇరు రాష్ట్రాలు కృష్ణా నది జలాలను వినియోగించుకోవచ్చుని, ఇన్వెస్టిగేషన్ చేయాలని అంగీకారానికి వచ్చాయి. దాని ప్రకారం హైదారాబాద్ రాష్ట్రం నదిపై డ్యాం కట్టడానికి అనుకూలమైన ప్రదేశం కొరకు ఇన్వెస్టిగేషన్ చేపట్టింది. ఎలేశ్వరం కు 3 కిలోమీటర్ల ఎగువన అనువైన ప్రదేశాన్ని ఎంపిక చేసింది. మంచి రాతి పునాది ఉండి చుట్టూ ఎత్తైన కొండలు ఉన్న ప్రదేశమది. రిజర్వాయర్ నుండి మొదటి 30 కిలోమీటర్ల కాలువ తీయడానికి ఖర్చు ఎక్కువవుతుందన్న ఒక సమస్య ఉండింది. అయితే రిజర్వాయర్ పూర్తి నీటి మట్టం +725 అడుగులు మరియు కాలువ మొదలయ్యే లెవెల్ +615 అడుగులు కాబట్టి చాలా ఎక్కువ భూమి సాగులోకి వచ్చే అవకాశం ఉండింది. అయితే, మద్రాసు రాష్ట్రం వైపు కాలువ తవ్వడం సాధ్యం కాక పోయేది. ఒక ఉమ్మడి ప్రాజెక్టుగా కట్టాలంటే ఎలేశ్వరం వద్ద కుదరదు కాబట్టి, హైదరాబాదు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత పరిశీలన చేసి 1933 నాటికి నందికొండ వద్ద "లోయర్ కృష్ణా ప్రాజెక్టు" (LKP) ను ఎంపిక చేసింది. ఉమ్మడి ప్రాజెక్టుగా కట్టుకుందామని మద్రాసు ప్రభుత్వానికి ప్రతిపాదించింది. అయితే, మద్రాసు ప్రభుత్వం హైదరాబాదు రాష్టం చేసిన ఉమ్మడి ప్రాజెక్టు ప్రతిపాదనలను పట్టించుకోలేదు. దానితో హైదరాబాదు ప్రభుత్వం, కేవలం ఎడమవైపు తమ ప్రాంతానికి ఇరిగేషన్ సౌకర్యాలు కల్పించే విధంగా నందికొండ వద్ద డ్యాం మరియు ఎడమకాలువ ఇన్వెష్టిగేషన్ చేపట్టింది. ఫిబ్రవరి, 1952 నాటికి హైదరాబాదు రాష్ట్రం తమ తెలంగాణ ప్రాంత సాగునీటికై కేవలం ఎడమ కాలువ కలిగి ఉన్న, బారీగా విద్యుత్తును కూడా ఉత్పత్తి చేసే లోయర్ క్రిష్ణా ప్రాజెక్టు (నందికొండ వద్ద, నేటి నాగార్జునసాగర్ ప్రాజెక్టు) పూర్తి రిపోర్టు సవివరంగా తయారుచేసింది. రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి మొదటి పంచ వర్ష ప్రణాళికలో చేర్చాలని, ప్రాజెక్టుకై 1952–53 సంవత్సరానికి 116 లక్షల రూపాయల బడ్జెట్ సత్వరమే శాంక్షన్ చేయాలని సిఫార్సు చేసింది.

ఇక హైదరాబాదు రాష్ట్ర ఉమ్మడి ప్రాజెక్టు ప్రతిపాదనలను కాదన్న మద్రాసు ప్రభుత్వం 1946 నాటికి "కృష్ణా పెన్నార్ ప్రాజెక్టు"ను తయారు చేసుకుంది. 1951 నాటికి సవివరమైన "కృష్ణా పెన్నార్ ప్రాజెక్టు" రిపోర్టు తయారైంది. అది కేవలం మద్రాసు రాష్ట్రానికి మాత్రమే నీటిని మరల్చే ప్రతిపాదన. దాని ద్వారా కృష్ణా నదిపై సిద్దేశ్వరం వద్ద (నేటి శ్రీశైలం డ్యాం కు 87 కిలోమీటర్ల ఎగువన) ఎక్కువ ఎత్తు గల డ్యాం కట్టి, కృష్ణా నది నుండి పెన్నాకు నీటిని మరల్చే కృష్ణా – పెన్నా లింక్ కెనాల్‌ను, ఆ నీటిని నిలువ చేసేందుకు పెన్నా నదిపై సోమశిల వద్ద చాలా పెద్ద

డ్యాంను, దాని నుండి పెన్నా ఉత్తర కెనాల్, పెన్నా దక్షిణ కెనాల్ ను ప్రతిపాదించారు. ప్రాజెక్టు రిపోర్టులో 90% కృష్ణా నది జలాలు వృధాగా సముద్రంలో కలుస్తున్నాయి కాబట్టి వాటిని ఈ స్కీమ్ ద్వారా నిలువ చేసుకొని వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. (నాడు పై రాష్ట్రాల్లో ప్రాజెక్టులు ఇంకా కట్టలేదు కాబట్టి సముద్రంలో కలిసేవి)

ఈ కృష్ణా పెన్నార్ ప్రాజెక్టుపై మద్రాసు రాష్ట్రంలోని ఆంధ్ర ప్రాంతాల్లో పెద్ద వివాదం చెలరేగింది. ప్రధానమైన అభ్యంతరం ఏమంటే... కృష్ణా నదికి దగ్గరగా ఉన్న ఎన్నో ప్రాంతాలను ఈ ప్రాజెక్టు పరిధిలోంచి మినహాయించి, అదే సమయంలో కృష్ణా నీటిని సుదూర ప్రాంతాలకు మద్రాసు నగరం ఆవల వరకు తీసుకు వెళ్లడానికి ప్రతిపాదించారనేది. 16, ఏప్రిల్ 1952 న ఆంధ్ర రాష్ట్ర బిల్లు రాజ్యసభలో చర్చిస్తున్నపుడు పి. సుందరయ్య గారు "కృష్ణా పెన్నార్ ప్రాజెక్టు ప్రతిపాదనలో మీరు నీటిని రాయలసీమ కరువు ప్రాంతాలకు మాత్రమే తీసుకు వెళ్లడంలేదు; మొదట రాయలసీమకు తీసుకువెళ్ళి ఆ పైన మిగులు జలాలు ఉంటే మీకెక్కడికి కావాలంటే అక్కడికి తీసుకు వెళ్ళాలి. కానీ మీరు మొదట తమిళనాడుకు తీసుకు వెళ్లాలనుకుంటున్నారు. ఇది ఒక విచిత్రమైన పరిస్థితి. ఇది అంతర్జాతీయ సూత్రాలకు విరుద్ధం. ఇది కామన్ సెన్స్ కు విరుద్ధం. ఈ విషయంలో ప్రజల మనోభావాలు మరింత కుంగి పోవడానికి దోహదం చేస్తాయి." అన్నారు. ఆయనకు తోడుగా శ్రీ కేవీల్ నరసింహం గారు "ఆ వైపున ఉన్న మిత్రుడొకాయన ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటును మరో 10 సంవత్సరాలు వాయిదా వేయండి, మనం సోదరుల్లాగా కలిసి జీవిస్తున్నాం అన్నారు. మనం సోదరుల్లాగా జీవిస్తున్నాం, సందేహం లేదు. కానీ ఎట్లా? సోదరులం అనే పేరు మీద కృష్ణా పెన్నా నదుల నీటిని తీసుకెళ్లిపోతున్నారు. ఇది ఒక సోదరుడు ఇంకో సోదరుడి పట్ల చూపించే సానుభూతి కాదు.... ఇవన్నీ ఆంధ్ర ప్రజలకు నష్టం చేస్తున్న విషయాలు."[1]

నేడు కృష్ణానది ప్రక్కనే ఉన్న తెలంగాణ కరువు ప్రాంతాలకు నీళ్ళు ఇవ్వద్దని అంటూ ఆరు ఏడు వందల ఆవల వేరే నదీ బెసిన్‌లకు నీటిని మళ్ళించుకు పోతామని ఆంధ్ర పోరళ్ళనడాన్ని తెలంగాణ ప్రజలు ఆవేదనతో ప్రశ్నిస్తున్నారు.

### ఖోస్లా కమిటి సిఫారసులు :

కేంద్ర ప్లానింగ్ కమిషన్ మద్రాసు రాష్ట్రం ప్రతిపాదించిన కృష్ణా పెన్నార్ ప్రాజెక్టు యొక్క సాంకేతిక, ఆర్థిక అంశాలను పరిశీలించి మొదటి పంచవర్ష ప్రణాళికలో చేర్చవచ్చా లేదా అని తేల్చడానికి ఒక సాంకేతిక కమిటీని (ఖోస్లా కమిటీ) డిసెంబర్,1951 లో నియమించింది. ఇది హైదరాబాదు రాష్ట్ర పరంగా, తెలంగాణ పరంగా వినియోగాలను పరిశీలించడానికి వేయబడ్డ కమిటీ కాదు. ఆ కమిటీ ప్రధాన ఉద్దేశ్యం మద్రాసు రాష్ట్రానికి 1951 ప్లానింగ్ కమిషన్ ఆధ్వర్యంలోని సమావేశంలో రాష్ట్రాలకు కేటాయించిన క్రిష్ణా జలాలను ఎట్లా వినియోగించాలో పరిశీలించడం. అది కేవలం మద్రాసు రాష్ట్రం పరంగా కృష్ణా జలాల వినియోగాన్ని నిర్ధారించడానికి ఉద్దేశించిన కమిటీ. అందుకే కేవలం మద్రాసు రాష్ట్రానికి చెందిన కృష్ణా పెన్నార్ ప్రాజెక్టు మరియు పులిచింతల ప్రాజెక్టు, మరియు హైదరాబాదు రాష్ట్రానికి చెందిన లోయర్ కృష్ణా ప్రాజెక్టుల అధ్యయనానికి మాత్రమే ఖోస్లా కమిటి పరిమితమయ్యింది.

ఖోస్లా కమిటీ కృష్ణా పెన్నార్ ప్రాజెక్టులో తీవ్ర లోపాలున్నాయని అభిప్రాయం వ్యక్తం చేసింది. అట్లాగే మద్రాసు రాష్ట్రం తమ ప్రాంతాల సాగునీటికై ప్రతిపాదించిన పులిచింతల ప్రాజెక్టును కూడా పరిశీలించింది. ఆ రెండు ప్రాజెక్టుల కింది దాదాపుగా మొత్తం ఆయకట్టును నందికొండ ప్రాజెక్టుకు కుడి కాలువను ప్రతిపాదించి దాని కిందకు చేర్చింది. నందికొండ ప్రాజెక్టు రిజర్వాయర్ లెవెల్ ను +540 నుండి +590 ఫీట్లకు పెంచింది. కృష్ణా పెన్నార్ లింక్ కెనాల్

1. (Council of State Debates; Vol. I part I, 13th May 23rd July 1952, p 1259 and 1321;Noted in Page No. 190, Eminent Engineer N.D. Gulhati's Book 'Development of Inter-State Rivers Law and practice in India' 1972).

సామర్థ్యం 75,000 క్యూసెక్కులు అవసరం లేదని, 10,000 క్యూసెక్కులు ఉంటే చాలని సిఫార్సు చేసింది. ఆ 10,000 క్యూసెక్కులలో 4,000 క్యూసెక్కులు తుంగభద్ర నుండి కర్నూల్-కడప కెనాల్ (KC Canal) ద్వారా ఇవ్వాలని అందువల్ల కేవలం 6,000 క్యూసెక్కుల సామర్థ్యం తో కృష్ణా పెన్నా లింక్ కెనాల్ సరిపోతుందని పేర్కొంది. ఆ కృష్ణా పెన్నా లింక్ కెనాల్ సామర్థ్యంలోనివి అయినట్టి కృష్ణా పశ్చిమ కాలువ మరియు కృష్ణా తూర్పు కాలువల సామర్థ్యాలు 1,560 క్యూసెక్కులు, మరియు 1,390 క్యూసెక్కులుగా ఖోస్లా కమిటీ నిర్ధారించింది. ఇక పులిచింతల డ్యాం ను కేవలం నాగార్జునసాగర్ దిగువన పులిచింతల వరకు గల క్రిష్ణా నదిలో కలిసే నీటిని వినియోగించడానికి మాత్రమే నిర్మిచాలని సిఫార్సు చేసింది. మొదట నందికొండ ప్రాజెక్టును చేపట్టాలని సిఫార్సు చేసింది. ఖోస్లా కమిటీ రిపోర్టులోని మ్యాప్‌లు అనుబంధం-8 లో ఉన్నాయి.

సిఫార్సులపై చర్చించడానికి ప్లానింగ్ కమిషన్ డిసెంబర్,1952 లో సమావేశమై రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కింది ఇన్వెస్టిగేషన్లు చేసి తనకు నివేదించాలి అని నిర్ణయించింది:

(1) కర్నూల్-కడప కెనాల్ (కేసి కెనాల్) రిమోడలింగ్ ఎంత వరకు అవసరమో మద్రాసు ప్రభుత్వం నివేదించాలి.

(2) నందికొండ ప్రాజెక్టు డ్యాంకు సంబంధించిన పూర్తి సమాచారం హైదరాబాదు ప్రభుత్వం ప్లానింగ్ కమిషన్ కు వెంటనే ఇవ్వాలి. ఎడమ కెనాల్ ఇన్వెస్టిగేషన్ ను అప్-డేట్ చేసి హైదరాబాదు ప్రభుత్వం మూడు నెలల్లోగా ఇవ్వాలి. నందికొండ ప్రాజెక్టుకు కొత్తగా చేర్చిన కుడి కాలువ ఇన్వెసిగేషన్ ను మద్రాసు ప్రభుత్వం 10 నెలల్లో ఇవ్వాలి.

(3) పెన్నా నదిపై పెన్నా డ్యాం (సోమశిల) ను రివైజ్ చేయడం, క్రిష్ణా నదిపై పులిచింతల డ్యాం అవసరమా లేక బ్యారేజీ అవసరమా అని ఇన్వెస్టిగేట్ చేయడం మద్రాసు ప్రభుత్వం చేయాలి.

(4) మద్రాసు, హైదరాబాదు ప్రభుత్వాలు నందికొండ ప్రాజెక్టు ఎఫ్ఆర్ఎల్ +475 అడుగుల వరకు క్రిష్ణా డెల్టా రెండవ పంట కొరకు ఒక ఉమ్మడి నోట్ ను నివేదించాలి.

పైన పేర్కొన్న అంశాలలో ఎక్కడా క్రిష్ణా-పెన్నా ప్రాజెక్టులోని సిద్దేశ్వరం ప్రాజెక్టు, క్రిష్ణా పెన్నార్ లింక్ కెనాల్ ప్రస్తావనే లేదు అనే విషయం గమనించాలి. పైనున్న అంశాలలో (2) మరియు (4) అంశాలకు సమాధానంగా 1954లో హైదరాబాదు రాష్ట్రం మరియు ఆంధ్ర రాష్ట్రాలు (1953లో మద్రాసు నుండి విడివడి ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది) నందికొండ ప్రాజెక్టు రిపోర్టు తయారు చేశాయి, ఫిబ్రవరి 1956 లో ప్రాజెక్టు పని ప్రారంభమయ్యింది.

## కృష్ణా - గోదావరి కమీషన్ :

రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ జరిగినాక రాష్ట్రాలకు కృష్ణా పరీవాహక ప్రాంతంలోని పలు ప్రాంతాలపై రాజకీయ బదిలీలు జరిగాయి కాబట్టి 1957 నుండి కేంద్ర జల మరియు విద్యుత్ సంఘం 1951 లో జరిగిన కేటాయింపులను పునఃసమీక్షించుకోవాలని రాష్ట్రాలను కోరుతూ ఉంది. ఆంధ్రప్రదేశ్ మినహా మిగిలిన రెండు పరీవాహక ప్రాంత రాష్ట్రాలు కర్ణాటక, మహారాష్ట్ర 1951 కేటాయింపులు చెల్లవు అన్నాయి. మళ్ళీ కొత్తగా కేటాయింపులు జరగాల్సిందే అని పట్టుబట్టాయి. ఆంధ్ర ప్రదేశ్ ఆ కేటాయింపులు కొనసాగాలి అని కోరింది. ఆ పరిస్థితుల్లో, కేంద్ర ప్రభుత్వం మే 1961 లో కృష్ణా మరియు గోదావరి నదుల్లో నీటి లభ్యత ఎంత అనే విషయాన్ని తేల్చడానికి ప్రముఖ ఇంజనీర్ ఎన్.డి గుల్హాటి అధ్యక్షతన క్రిష్ణా-గోదావరి కమిషన్ ను నియమించింది.

కేజి కమీషన్ ఎంతో శ్రమించి సమాచారాన్ని సేకరించింది. 1951 వరకు ఉన్న ప్రాజెక్టులు, 1951 నుండి మార్చి 1961 మొదలు పెట్టిన ప్రాజెక్టులు, ప్రతిపాదనలో ఉన్న ప్రాజెక్టుల సమాచారాన్ని రాష్ట్రాల నుండి కోరింది. శాశ్వత ప్రాతిపదికన గేజింగ్ స్టేషన్లను తక్షణమే నెలకొల్పాలని, ప్రాజెక్టుల్లోని నిలువ, మళ్లింపులు రోజువారీగా సేకరించి, మదింపు చేసి ప్రచురించాలని సిఫార్సు చేసింది. బేసిన్లో ఉన్న వేరే ప్రాజెక్టుల అవసరాలను, ప్రాజెక్టులకు కావాల్సిన ఖర్చులను పట్టించుకోకుండా తమ ప్రాజెక్టుల డిమాండ్లను రాష్ట్రాలు నివేదించాయి అని కమిషన్ అభిప్రాయపడింది. సౌలభ్యం కోసం కృష్ణా బేసిన్ ను 12 సబ్ బేసిన్లుగా విభజించింది. రెండు బేసిన్లలో ఉన్న నీటి లభ్యతను, డిమాండ్సును అన్నీ క్రమ పద్ధతిలో క్రోడీకరించి, కేంద్రం అడిగిన మరో రిఫరెన్స్ ప్రకారం గోదావరి నుండి క్రిష్ణా నదికి తరలించే అవకాశాలను కూడా చేర్చి రిపోర్టును 1962 లో కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. రాష్ట్రాలు నివేదించిన అన్ని డిమాండ్సుకు కృష్ణా నదిలో ఉన్న నీళ్ళు సరిపోవు అని స్పష్టం చేసింది. కృష్ణా ఒక లోటు బేసిన్ అని ఒక ప్రామాణికమైన స్పష్టత వచ్చింది.

ముఖ్యంగా, కృష్ణా నదిలో నీరు ఒక "కొరతైన సహజ వనరు" అన్న విషయాన్ని, "ఇరిగేషన్ అనేది ఒక ఖరీదైన వస్తువు" అన్న విషయాన్ని గుర్తించిన ఒక పాలసీ అవసరం ఉంది అని కె.జి. కమీషన్ చెప్పింది. తప్పనిసరిగా ఒక సహకార ధోరణి గల ఒక రివర్ బోర్డు గానీ మరేదైనా పేరుతో ఒక అంతర్రాష్ట్ర సంస్థ తక్షణమే ఏర్పాటు చేసి ప్లానింగ్ మరియు ఆపరేషన్ చేపట్టాలి అని నొక్కి చెప్పింది. కానీ వాటికి నాడు ఆచరణ రూపం ఇవ్వలేదు కేంద్ర ప్రభుత్వం. రివర్ బోర్డుల కంటే, ట్రిబ్యునల్లకు ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. నేడు ట్రిబ్యునల్లు రాష్ట్ర ప్రభుత్వాల అభ్యర్థనల మేరకు కేటాయింపులన్నీ చేశాక, ఇప్పుడు రివర్ బోర్డులు ఏర్పాటు చేస్తామని ప్రయత్నిస్తున్నది కేంద్ర ప్రభుత్వం. తెలంగాణ రాష్ట్రాన్ని ప్రత్యేకంగా పరిగణించకుండా ట్రిబ్యునల్ కేటాయింపులు చేశాక ఈ రివర్ బోర్డుల ఏర్పాటు మనకు ఏ విధంగా లాభం?

సెప్టెంబర్,1962 లో కేంద్ర ప్రభుత్వం కేజి కమిషన్ రిపోర్టును రాష్ట్రాలకు పంపించి వారితో సంప్రదించాక మార్చి,1963 లో పార్లమెంట్లో కేంద్ర ఇరిగేషన్ మరియు విద్యుత్ శాఖ మంత్రి ఒక ప్రకటన చేశారు. 1951 ఒప్పందం చెల్లదని ఆ నీటి కేటాయింపులు చెల్లవని ప్రకటించి రాష్ట్రాల వారీగా పూర్తి కృష్ణా నీటి వినియోగాలు ఆయిదవ పంచవర్ష ప్రణాళిక వరకు పరిమితులు నిర్దేశించింది. అయితే ఈ కేంద్ర మంత్రి ప్రకటన ఏ రాష్ట్రానికీ వారి వారి స్వంత కారణాల వల్ల ఆమోదయోగ్యం కాలేదు. దాంతో, మహారాష్ట్ర, కర్ణాటకలు ట్రిబ్యూనల్ ఏర్పాటు చేయాలని గట్టిగా కోరాయి. తరువాత ఆంధ్ర ప్రదేశ్ కూడా కోరింది. కేజి కమిషన్ చేసిన మరొక ముఖ్యమైన పరిశీలన. "కోర్టు పరిధికి ఆవల ఒప్పందానికై ప్రయత్నాలు అప్పుడప్పుడు (spasmodically) చేస్తూనే ఉన్నప్పటికీ, అదే సమయంలో ఎన్నో కొత్త ప్రాజెక్టులకు అనుమతులిచ్చింది కేంద్ర ప్రభుత్వం".

నాడు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ 3వ పంచ వర్ష ప్రణాళికలో చేర్చిన ప్రాజెక్టుల జాబితాలో శ్రీశైలం జల విద్యుత్ ప్రాజెక్టును కేజి కమిషన్‌కు నివేదిస్తూ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ప్రతిపాదించి చేపట్టాల్సిన ప్రాజెక్టుల జాబితాలో సంగమేశ్వరం కెనాల్స్‌ను చూపించింది. అవి కృష్ణా పెన్నార్ ప్రాజెక్టులో ప్రతిపాదించబడ్డ కృష్ణా పశ్చిమ కాలువ, కృష్ణా తూర్పు కాలువలను సంగమేశ్వరం కెనాల్స్‌గా పేరు మార్చినవే అని చెప్పవచ్చు. ఈ కృష్ణా పశ్చిమ కాలువ మరియు కృష్ణా తూర్పు కాలువల సామర్థ్యాలు 1,560 క్యూసెక్కులు, మరియు 1,390 క్యూసెక్కులుగా ఖోస్లా కమిటీ నిర్ధారించినవే. హెడ్ రెగ్యులేటర్ మరియు కెనాల్ అలైన్ మెంట్ కృష్ణా పెన్నార్ ప్రాజెక్టు లోని కృష్ణా పెన్నార్ లింక్ కెనాల్ అలైన్ మెంటే. మిట్టకొండల రిడ్జ్ కట్ చేస్తూ తీసిన అలైన్ మెంటే. ఇంకా ఇది కాకుండా కృష్ణా పెన్నార్ ప్రాజెక్టు రిపోర్టులో కూడా లేనివి కొత్తగా చూపిస్తూ సంగమేశ్వరం కెనాల్ స్టేజ్-II కింద 120 టీఎంసీల

వినియోగాన్ని చేర్చింది. దీనితో పాటుగా మద్రాసు కెనాల్ ప్రాజెక్టు (తమిళనాడు లోకి) 206 టీఎంసీలు వినియోగించే ప్రాజెక్టు కూడా చేర్చింది.

### కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ (బచావత్ ట్రిబ్యునల్ -1) :

అంతర్రాష్ట్ర జల వివాదాలకు సంబంధించినంతవరకు అంతర్రాష్ట్ర నదీ జల వివాదాల చట్టం, 1956 (ISRWD Act) లోని సెక్షన్–3 కింద ఏదైనా రాష్ట్రం కేంద్రానికి ఫిర్యాదు చేస్తే, ఆ వివాద పరిష్కారానికి కేంద్రం ఒక జల వివాదాల ట్రిబ్యునల్ ను ఏర్పాటు చేస్తుంది. అంతే తప్ప సుప్రీం కోర్టు గాని మరే ఇతర సంస్థ గానీ అంతర్రాష్ట్ర జల వివాదాన్ని స్వీకరించదు. ఈ విధంగా కృష్ణా నది జల వివాదాలను మహారాష్ట్ర, కర్ణాటక మరియు ఆంధ్ర ప్రదేశ్ ల మధ్య పరిష్కరించడానికి కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ (బచావత్ ట్రిబ్యునల్, KWDT-I) 1969లో ఏర్పాటు చేయబడింది.

నవంబర్ 1, 1956 నాడు రాష్ట్రాల పునర్విభజన జరిగి హైదరాబాదు రాష్ట్రం ఉనికిలో లేకుండా పోయి, మైసూరు (కర్ణాటక) రాష్ట్రం కృష్ణా పరీవాహక ప్రాంతం ఎక్కువగా గల అతి పెద్ద రాష్ట్రంగా ఆవతరించింది. తెలంగాణ ప్రాంతాన్ని ఆంధ్ర రాష్ట్రంలో విలీనం చేశారు. బొంబాయి (మహారాష్ట్ర) కు తుంగభద్ర నదితో ఏ విధమైన సంబంధం లేకుండా అయ్యింది. ఈ రాష్ట్రాల పునర్విభజన నేపథ్యంలో, 1957లో కేంద్ర జల సంఘం 1951 లో జరిగిన కృష్ణా నది జలాల కేటాయింపులను సర్దుబాటు చేసుకోవాలని రాష్ట్రాలను కోరింది. ఫిబ్రవరి 1959 లో తనవైపు నుంచి కొన్ని ప్రతిపాదనలు ముందుంచింది. 1951 కేటాయింపులలో బేసిన్లోని తమకు అన్యాయం జరిగిందని, వాటికి చట్టబద్ధతలేదని మహారాష్ట్ర, కర్ణాటకలు ఆ ప్రతిపాదనలను తోసిపుచ్చాయి, కొత్తగా కేటాయింపులు చేయాలని కోరాయి. ఆ పరిస్థితుల్లో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిద్దేశ్వరం ప్రాజెక్టును శ్రీశైలం ప్రాజెక్టుగా మార్చి ఒక జల విద్యుత్ ప్రాజెక్టుగా మాత్రమే రూపొందించింది.

నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నవంబర్ 1959 లో శ్రీశైలం జల విద్యుత్ ప్రాజెక్టు రిపోర్టును కేంద్ర జల మరియు విద్యుత్ సంస్థకు నివేదించింది. మే, 1960 లో కర్ణాటక మరియు అక్టోబర్,1960 లో మహారాష్ట్ర ప్రభుత్వాలు కృష్ణా నది జలాల కేటాయింపులు జరిగే వరకు శ్రీశైలం జల విధ్యుత్ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపివేయాలని కోరాయి. శ్రీశైలం ప్రాజెక్టు కేవలం జల విధ్యుత్ కేంద్రం మాత్రమే అని ఆంధ్ర ప్రదేశ్ వాదించింది. కర్ణాటక 1962 లో, మహారాష్ట్ర 1963 లో అంతర్రాష్ట్ర నదీ జల వివాదాల చట్టం,1956 లోని సెక్షన్–3 కింద తమ అభ్యంతరాలన్నీ పొందు పరుస్తూ పరుస్తూ కేంద్రానికి ఫిర్యాదు చేశాయి. 1969 లో కేంద్ర ప్రభుత్వం కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ ను జస్టిస్ బచావత్ అధ్యక్షతన ఏర్పాటు చేసి మూడు రాష్ట్రాల సమస్యలను దానికి రిఫర్ చేసింది. మహారాష్ట్ర, కర్ణాటకలు శ్రీశైలం జల విద్యుత్ కేంద్రానికి ఆవిరి నష్టాలు 33 టీఎంసీలు కూడా కేటాయించవద్దని, ఇంతకు ముందు రక్షణల రూపేణా నాగార్జునసాగర్, ప్రకాశం బ్యారేజీలకు చాలా ఎక్కువ ఇచ్చారు కాబట్టి వాటిలోనే వాడుకోవాలని కోరాయి. నాడు టిబ్యునల్ శ్రీశైలం రిజర్వాయర్ నుండి ఏ విధమైన సాగునీటి పరమైన కేటాయింపులు చేయలేదు.

1951 కేంద్ర ప్లానింగ్ కమిషన్ జరిపిన కేటాయింపులు చెల్లుబాటు కావు అని బచావత్ ట్రిబ్యునల్ నిర్ణయించింది. మొత్తం కృష్ణా నది జలాల పునఃకేటాయింపు ప్రక్రియను చేపట్టింది. నాడు ఆంధ్ర ప్రదేశ్ శ్రీశైలం ప్రాజెక్టును జలవిద్యుత్ ప్రాజెక్టుగానే బచావత్ ట్రిబ్యునల్‌కు నివేదించింది కాబట్టి కేవలం 33 టీఎంసీల ఆవిరి నష్టాలు మాత్రమే కేటాయించాలి అని అడిగింది. కర్ణాటక, మహారాష్ట్రలు ఏ విధమైన కేటాయింపులు చేయరాదని వాదించాయి.

న్యాయబద్ధంగా ఆ 33 టీఎంసీలు తనకు చెందాలని కర్నాటక వాదించింది. ఇప్పటికే అధిక మొత్తంలో కేటాయింపులు ఆంధ్ర ప్రదేశ్ పొందింది కాబట్టి వాటిలో నుండే ఈ ఆవిరి నష్టాలను కూడా సర్దుబాటు చేసుకోవాలని బలంగా వాదించింది. అప్పటికే ప్లానింగ్ కమిషన్ సాంక్షన్ చేసినప్పటికీ, ట్రిబ్యునల్ ఆంధ్రప్రదేశ్ కు రక్షణల (Protections) కింద ఇవ్వడానికి నిరాకరించింది. తరువాత equitable apportionment సూత్రం కింద మిగిలిన నీటిని కేటాయించే క్రమంలో శ్రీశైలం రిజర్వాయర్ విద్యుత్ ఉత్పాదనతో పాటుగా క్యారీ ఓవర్ స్టోరేజీగా కూడా ఉపయోగపడి సముద్రంలోకి నీరు వృధాగా పోకుండా కాపాడుతుంది కాబట్టి, ఈపాటికే ఎంతో వ్యయం చేసి ప్రాజెక్టు నిర్మించి ఉన్నారు కాబట్టి 33 టీఎంసీ ల నీటిని కేటాయిస్తున్నామని పేర్కొంది. భవిష్యత్తులో ఖచ్చితమైన ఆవిరి నష్టాలు లెక్కించబడి రివ్యూ ట్రిబ్యునల్‌కు నివేదించాలని వాటి ఆధారంగా ఏమైనా ఈ 33 టీఎంసీలల్లో మిగిలితే పున:కేటాయింపులకు అవకాశం ఉంటుందని స్పష్టం చేసింది. తెలంగాణ ప్రభుత్వం నేడున్న ట్రిబ్యునల్ ఎదుట నిజంగా కేవలం 22 టీఎంసీలే ఆవిరి నష్టాలున్నాయి అని ఆధారాలతో చూపించి ఆ మిగిలిన 11 టీఎంసీల నీటిని తమకు కేటాయించాలని కోరుతున్నది.

బచావత్ ట్రిబ్యునల్ ప్రొసీడింగ్స్ మొదలయ్యే నాటికే అప్పటి ఆంధ్రప్రదేశ్ కు శ్రీశైలం ప్రాజెక్టును ట్రిబ్యునల్ కేవలం జల విద్యుత్ ప్రాజెక్టుగానే చూస్తుందనే స్పష్టత వచ్చినా, జూలై 1973 నాటికి నిర్దిష్టంగా తెలిసిపోయింది. శ్రీశైలం జల విద్యుత్ ప్రాజెక్టుకు 33 టీఎంసీలు ఆవిరి నష్టాలు కేటాయించాలా వద్దా అన్న విషయమూ, ఆ ప్రాజెక్టు నుంచి ఏమైనా క్యారీ ఓవర్ స్టోరేజీ ఉంటుందా అన్న అంశమే తప్ప నేరుగా అక్కడి నుండి సాగునీటి కేటాయింపులు చేయాలనే అంశం మీద బచావత్ ట్రిబ్యునల్ ఎదుట అసలు చర్చ జరగనే లేదు. చారిత్రక వినియోగాల పేరుపై ఏ విధమైన శాస్త్రీయ నిర్ధారణ(Scientific Assessment) లేకుండా అవసరానికి మించి చాలా ఎక్కువ నీటిని కోస్తాంధ్రకు ప్రకాశం బ్యారేజీ ద్వారా రక్షణలు సాధ్యం చేసుకుంది ఆంధ్రప్రదేశ్. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో 1952 లో ఖోస్లా కమిటీ పరిశీలించేవరకు అసలు కుడి కాలువ అనేదే లేకున్నా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టు పేరుపై ఆ కాలువ కింద ఆయకట్టుకు కూడా నీటి డిమాండును ట్రిబ్యునల్ ఆమోదించేలా చూసుకుంది. అట్లాగే కేసీ కెనాల్ కు 1951 లో చూపించిన వినియోగం కంటే నాలుగు రెట్లు ఎక్కువ కేటాయిపుల రూపంలో రక్షణలుగా పొందింది. ఇట్లా తమ కోస్తాంధ్ర ప్రయోజనాలకై ప్రధాన కృష్ణా నది జలాల నీటిని అత్యధికంగా సాధించుకున్నది ఆంధ్రప్రదేశ్. అట్లాగే తుంగభద్ర డ్యాం నుండి కూడా రక్షణలు పొందింది.

ఇట్లా ప్రాజెక్టులకు ట్రిబ్యునల్ కేటాయింపులు చేసిన వాటిలో దాదాపు 70% క్రిష్ణా బేసిన్ ఆవలకు మళ్లించేవే. ఒక లోటు బేసిన్ నుంచి ఇట్లా మళ్ళిస్తూ తమ బేసిన్లోని న్యాయబద్ధమైన డిమాండ్సుకు నీళ్ళు లేవనడాన్ని తీవ్రంగా వ్యతిరేకించాయి మహారాష్ట్ర కర్ణాటకలు. కృష్ణా బేసిన్లో నీటి కొరత ఏర్పడ్డానికి కారణం ఆంధ్ర ప్రదేశ్ అతి వినియోగమే కారణమని దానికి కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన సహాయం చేసిందని ఆ రెండు రాష్ట్రాలు ధ్వజమెత్తాయి.

అప్పుడు జరిగిన ఒక వాదోపవాదాన్ని చూద్దాం. ఆంధ్ర ప్రదేశ్ తమ కోస్తాంధ్ర ప్రాంతాలు దేశానికి ధాన్యాగారమని తమకు నీటి కేటాయింపులు అధికంగా ఉండాల్సిందేననే వాదనకు సమాధానమిస్తూ, కర్ణాటక మహారాష్ట్రాలు అది సరికాదని, తమకు కృష్ణా బేసిన్లోనే వ్యవసాయానికి అనువైన భూములు చాలా ఉన్నాయని సాగునీరందిస్తే తమ భూముల్లో కూడా పంటలు పుష్కలంగా లాభసాటిగా పండిస్తామని, ఎల్లప్పుడూ ఆంధ్ర ప్రాంతం పంటలు పండిస్తే వాటిని రవాణా ఖర్చులు అదనంగా భరిస్తూ మేము కొనుక్కోవాలనడం సరికాదని, మేమే పండించుకుంటే తక్కువ ధరకు మాకు ధాన్యం లభిస్తుంది మా ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందుతాయి అని జవాబిచ్చాయి.

1973 నాటికి స్పష్టంగా ట్రిబ్యునల్ శ్రీశైలం ఒక జల విద్యుత్ ప్రాజెక్టు గానే చూస్తుందని, దాని నుండి ఏ విధమైన ఇరిగేషన్ కేటాయింపులు నేరుగా చేయదని ఆంధ్రప్రదేశ్ కు అర్థమయ్యింది. అప్పటికే కృష్ణా పెన్నార్ ప్రాజెక్టు ద్వారా ఇవ్వాల్సిన ఆయకట్టును నాగార్జునసాగర్ కుడికాలువకు బదలాయించారు. నాడు మద్రాసు నగరానికి మంచినీరు కృష్ణా నది నుండి కానీ, తుంగభద్ర నది నుండి కానీ ఇవ్వాలని మద్రాసు రాష్ట్రంలో ప్రతిపాదనలు ఉండేవి. కృష్ణా పెన్నార్ ప్రాజెక్టు ద్వారా ఇవ్వాలని ప్రతిపాదించడము, ఆ ప్రాజెక్టునే దాదాపుగా మొత్తంగా ఖోస్లా కమిటీ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు కుడి కాలువను అదనంగా చేర్చి బదలాయించడం జరిగినాక మద్రాసు మంచినీటి ప్రతిపాదన లాంటివి కూడా నిజానికి నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుండి జరగాలి. (తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుత ట్రిబ్యునల్ ఎదుట నాగార్జునసాగర్ దిగువన గల కృష్ణా బేసిన్లో ఉత్పత్తి అయ్యే నీటిలో నుండి ప్రకాశం బ్యారేజీ వద్ద నుండి చెన్నై నగరానికి నీటి సరఫరా చేయాలని విన్నవించింది.) కానీ శ్రీశైలం ప్రాజెక్టు నుండే చేయాలని 1973 నుండి బలమైన ప్రయత్నాలు కొనసాగుతూ వచ్చాయి. దాని వెనుకాల గల ముఖ్య కారణం శ్రీశైలం ప్రాజెక్టు నుండి మిట్టకొండల రిడ్జ్ ను కట్ చేసి ఒక కెనాల్ ను ఆంధ్ర ప్రాంతానికి తీసుకు వెళ్లడానికి ఒక ప్రబలమైన హేతువు ఉండాల్సిన అవసరం ఏర్పడింది.

బచావత్ ట్రిబ్యునల్ (1973) అసలు ఏ విధమైన ఇరిగేషన్ కేటాయింపులు శ్రీశైలం ప్రాజెక్టు నుండి కేటాయించలేదు. ఆ తరువాత 1973 నుండి ఆంధ్ర ప్రభుత్వాలు మిట్టకొండల రిడ్జ్ కట్ చేసి ఒక 75,000 క్యూసెక్కుల కెనాల్ లక్ష్యంగా, తమ కోస్తాంధ్ర ప్రయోజనాలకు ఏ విధమైన భంగం కలుగకుండానే, ప్రయత్నాలు చేస్తూ వచ్చాయి. 5,మే 2020 న ఆంధ్రప్రదేశ్ జారీ చేసిన జీఓ 203 ఈ క్రమంలో జారీ చేసినదే. దానిలో 80,000 క్యూసెక్కుల సామర్థ్యం గల కెనాల్ ఉంది. ఇంకా ఇంతకు ముందెన్నడూ ఏ ప్రతిపాదనలో కూడా లేని విధంగా కొత్తగా 797 అడుగుల వద్ద నుండి కూడా ఈ కెనాల్లోకి నీటిని మళ్లించే లిఫ్ట్ స్కీమ్ కూడా ఉంది. ఈ ప్రయత్నాల మధ్య తెలంగాణ ప్రజలను, నాయకత్వాన్ని మభ్య పెట్టేందుకు ఎస్ఎల్బిసి టన్నెల్ స్కీం అని, ఎస్ఎల్బిసి-ఎన్ఎస్పి లిఫ్ట్ స్కీం అని, కల్వకుర్తి లిఫ్ట్ స్కీం అనీ చిన్నచిన్న మళ్లింపు పథకాలను ప్రతిపాదిస్తూ, దశాబ్దాలుగా ఇన్వెస్టిగేషన్ల పేరిట కాలయాపనలు చేస్తూ వచ్చాయి ఆంధ్ర ప్రభుత్వాలు. నేడు తెలంగాణ ప్రాజెక్టులన్నీ కొత్త ప్రాజెక్టులుగా చిత్రీకరించి, వాటి నిర్మాణం నిలుపుదలైనా చేయాలి లేకుంటే ఆంధ్ర ప్రతిపాదించిన ప్రాజెక్టులను అన్నింటినీ తెలంగాణ ప్రాజెక్టులతో సమానంగా అంగీకరించాలి అనే పరిస్థితిని సృష్టించే ప్రయత్నం చేస్తూ ఉన్నది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. అంగీకరిస్తే వాళ్ళకు గల అత్యధిక మళ్లింపు సామర్థ్యం, నిలువ సామర్థ్యంతో మన ప్రాజెక్టులకు భవిష్యత్తులో కనీస నీటి లభ్యతకు కూడా ముప్పు ఏర్పడుతుంది.

* * *

అధ్యాయం-3

# పోతిరెడ్డిపాడు పుట్టుక - పరిణామ క్రమం:

**1973 తరువాతి పరిణామాలు- పోతిరెడ్డిపాడు ఆవిర్భావం:**

- 1973 డిసెంబర్ లో బచావత్ ట్రిబ్యునల్ తన రిపోర్టు ను వెలువరించింది. మే, 1976 లో తన తదుపరి రిపోర్టు ను వెలువరించింది. అయితే తదుపరి రిపోర్టు అనేది కేవలం స్పష్టీకరణలు, ఏవైనా విషయమై మార్గదర్శనం చేయడానికి మాత్రమే ఉద్దేశించి ఉంటుంది. అంటే 1973 నాటికే బచావత్ ట్రిబ్యునల్ ప్రధాన రిపోర్టు వెలువడింది. ఏప్రిల్, 1976 లో డిల్లీలో కేంద్ర మంత్రి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వాలు చెన్నె నగరానికి తాగునీటికై చెరి అయిదు టీఎంసీ లు మొత్తం 15 టీఎంసీ లు ఒక అనువైన ప్రదేశం నుండి తమిళనాడు తీసుకువెళ్లడానికి అంగీకరించాయి. అక్టోబర్, 1977 లో డిల్లీలో కేంద్ర మంత్రి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మూడు రాష్ట్ర ప్రభుత్వాలు ఒక అంగీకారానికి వచ్చాయి. తమిళనాడు ప్రభుత్వం 15 టీఎంసీ ల నీటిని శ్రీశైలం రియర్వాయర్ నుండి ఒక లైనింగ్ చేసిన కెనాల్ ద్వారా తరలించాలి. 1500 క్యూసెక్కులకు మించకుండా శ్రీశైలం నుండి పెన్నా వరకు ఆ పైన మద్రాసు కు చేరే విధంగా కాలువ నిర్మాణం జరగాలి.
- జులై 1, నుండి అక్టోబర్ 31 మధ్యలో నీటిని మద్రాస్‌కు తీసుకుపోవాలి.
- శ్రీశైలం (కృష్ణా) – సోమశిల (పెన్నా) ల మధ్య లైన్డ్ కెనాల్ ను ఎక్కడ మొదలు కావాలనే (offtake point) సాంకేతికాంశాలను ఆంధ్రప్రదేశ్ మరియు తమిళనాడులు గుర్తిస్తాయి,
- ఆ కెనాల్‌ను ఇరిగేషన్ గానీ, మరే ఇతర వినియోగాలకు గాని ఉపయోగించరాదు. కేవలం మద్రాసు తాగునీటి సరఫరాకు మాత్రమే వినియోగించాలి.
- ఆ వాటర్ సప్లై సిస్టం లోనికి 15 టీఎంసీ లకు మించి తీసుకోకుండా పర్యవేక్షణ చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలి.

ఒకవైపు మద్రాసుకు మంచి నీళ్ళు అని పావులు కదిపి శ్రీశైలం జల విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్ నుండే తీసుకోవాలని, ఒక 1500 క్యూసెక్కుల లైన్డ్ కెనాల్ ద్వారా తీసుకోవాలనీ కృష్ణా బేసిన్లోని మొత్తం మూడు రాష్ట్రాలతో ఒప్పందం ద్వారా సాధించుకొన్నది నాటి ఆంధ్రప్రదేశ్. మూడు రాష్ట్రాలు కూడా భాగస్వామ్యం ఉంది కాబట్టి అంతర్రాష్ట్ర సమస్య లేకుండా ఒక కెనాల్ అక్టోబర్, 1977 నాటికి సిద్దమైంది. తెలుగు గంగా ప్రాజెక్టు పరంగా ఎట్లా ఆ కెనాల్ కెపాసిటీ ని పెంచాలి అని ఒకవైపున ప్రయత్నాలు సాగుతున్నాయి.

మరొక వైపున, శ్రీశైలం రిజర్వాయర్ నుండి మరొక కెనాల్ కొరకు కేంద్రం నుండి క్లియరెన్స్ తీసుకొనే ప్రయత్నాలు సాగాయి. అదే శ్రీశైలం కుడి బ్రాంచి కాలువ. బనకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ వద్ద కుడివైపున వెళ్ళే బ్రాంచ్ కెనాల్ కాబట్టి దాన్ని ఎస్ఆర్బిసి అన్నారు. బనకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ వద్ద ఎడమ మరియు కుడి బ్రాంచ్ కెనాల్ ఇరిగేషన్ స్కీమ్ అని ప్లానింగ్ కమిషన్ కు నివేదించారు. ఎడమ బ్రాంచ్ కెనాల్ మద్రాసు వాటర్ సప్లై కొరకు ఉ

ద్దేశించినది తరువాతి కాలంలో దానికి తెలుగు గంగా అని పేరు పెట్టారు. ఇక కుడి వైపున కెనాల్ శ్రీశైలం కుడి బ్రాంచ్ కెనాల్ గానే పిలుస్తున్నారు.

బచావత్ ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం రాష్ట్రాలకు కేటాయింపులు గంపగుత్త (enbloc, mass allocation) కాబట్టి, తనకు కేటాయించిన 811 టీఎంసీల కృష్ణా జలాలలో రి-అడ్జస్ట్ మెంట్ గాని, రి-అలొకేషన్ గానీ చేసుకునే వెసులు బాటు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ కు ఉన్నది. కాబట్టి రాష్ట్రానికి కేటాయించిన 11 టీఎంసీల రిటర్న్ ఫ్లోస్ లో 9 టీఎంసీల ను, మరియు కేసి కెనాల్ ఆధునీకరణ ద్వారా లేదా మరేదైనా పాజెక్టు ఆధునీకరణ వల్ల వచ్చిన సేవింగ్స్ లోని 10 టీఎంసీ లను కలిపి మొత్తం 19 టీఎంసీలను "శ్రీశైలం కుడి బ్రాంచి కాలువ" (SRBC) కు కేటాయించుకొని ప్లానింగ్ కమిషన్ క్లియరెన్స్‌కు పంపింది. ఈ విధంగా నికర జలాలున్న ప్రాజెక్టుగా ఎస్ఆర్‌బిసికి కేంద్ర ప్లానింగ్ కమిషన్ వద్ద క్లియరెన్స్ పొందింది. నిజానికి రిటర్న్ ఫ్లోస్ (పునరుత్పత్తి జలాలు) అనేవి ప్రాజెక్టుల కింద ఆయకట్టు వినియోగించినాక భూఉపరితలం పైన, భూగర్భ జలాల ద్వారా కొంత తిరిగి నదిలోకి చేరే నీరు. అవి దాదాపుగా 10 శాతం ఉండవచ్చు అని ట్రిబ్యునల్ నిర్ధారించి వాటిని కూడా రాష్ట్రాలకు కేటాయింపులు చేసింది. ఆ విధంగా ఆంధ్ర ప్రదేశ్ కు 11 టీఎంసీ ల కేటాయింపు బేసిన్లోని ప్రాజెక్టులన్నీ పూర్తయ్యాక 1998-99 నాటికి లభిస్తాయి. ఈ రిటర్న్ ఫ్లోస్ అనేవి బేసిన్లోని ప్రాజెక్టుల ఆయకట్టు నుండి మాత్రమే నదిలోకి చేరతాయి. బేసిన్లోని ప్రాజెక్టులు తెలంగాణలోనే ఎక్కువగా ఉన్నాయి. ఆంధ్ర ప్రాంత ఆయకట్టు దాదాపుగా అంతా బేసిన్ ఆవలనే ఉంది. కాబట్టి ఆ 11 టీఎంసీల రిటర్న్ ఫ్లోస్ లో దాదాపుగా అంతా తెలంగాణకే చెందాలి. కానీ, వాటిలో 9 టీఎంసీలను ఎస్ఆర్‌బిసి ప్రాజెక్టుకు నికర జలాలుగా చూపించింది నాటి ఆంధ్ర ప్రభుత్వం. కేంద్రం కూడా ఇవి తెలంగాణకు చెందిన జలాలు కదా అని ఆక్షేపించలేదు సరికదా, ఎస్ఆర్‌బిసి కి క్లియరెన్స్ కూడా మే, 1981 లో ఇచ్చింది. ఇక 1994 లో రివైజ్డ్ శాంక్షన్ తెచ్చుకున్నప్పుడు కేసి కెనాల్ ఆధునీకరణ వల్ల వచ్చిన మిగులులో నుంచి 10 నుండి 8 టీఎంసీలుగా తగ్గించి, రిటర్న్ ఫ్లోస్ ను మొత్తం 11 టీఎంసీలను కలిపి 19 టీఎంసీలు ఎస్ఆర్‌బిసి కి కేటాయిస్తూ కేంద్ర అనుమతి పొందింది. కేంద్రం ఉదారంగా, ఈ ప్రాజెక్టు 2000 సంవత్సరం నాటికి పూర్తవుతుంది కాబట్టి, 1998-99 నాటికే రిటర్న్ ఫ్లోస్ మనుగడలోకి వస్తాయి కాబట్టి నీటి లభ్యత క్లియరెన్స్ ఇవ్వవచ్చు అని చెబుతూ క్లియరెన్స్ ఇచ్చింది. ఇవ్వడాన్ని తప్పు బట్టడం లేదు. కానీ 1986 లో తెలంగాణ వైపు ఉన్న ఎస్ఎల్‌బిసి ప్రాజెక్టు కు పోలవరం నుండి గోదావరి జలాల మళ్లింపు వల్ల వచ్చే జలాలలో నుండి ట్రిబ్యూనల్ అవార్డ్ ప్రకారమే నాటి ఆంధ్ర ప్రదేశ్ కు కేటాయించిన నీటిలో నుంచి 30 టీఎంసీలను కేటాయిస్తూ కేంద్రానికి నివేదిస్తే మన ప్రాజెక్టు రిపోర్టును పోలవరం ప్రాజెక్టు క్లియరెన్స్ ఇచ్చాక రండి అని తిప్పి పంపారు. (రిటర్న్ ఫ్లోస్ లో 9 టీఎంసీలు తెలంగాణ కే చెందినవి తమకు కేటాయించాలని ప్రస్తుత ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణ ప్రభుత్వం వాదిస్తున్నది. అయితే సెక్షన్ -89 కింద రెఫర్ చేయబడ్డ ఈ ట్రిబ్యునల్ ఆ విధంగా తీర్పు ఇవ్వగలుగుతుందా అన్నది ప్రశ్నార్థకమే. అయినా ప్రయత్న లోపం లేకుండా తెలంగాణ ప్రయత్నిస్తున్నది. వీటన్నింటిని చూడగల అధికారం ట్రిబ్యునల్ కు సెక్షన్-3 కింద మన కాంప్లెయింట్ ను కేంద్రం రిఫర్ చేసినప్పుడు వస్తుంది. ఇప్పటికి ఆరేళ్లుగా మన కాంప్లెయింట్ కేంద్రం వద్ద పెండింగులో ఉంది). ఈ 19 టిఎంసి లను జులై నుండి నవంబర్ మధ్యలోనే మళ్లిస్తామని చెప్పింది. ప్లానింగ్ కమిషన్ అనుమతించిన ఈ ప్రాజెక్టు లోని భాగాలు:

- శ్రీశైలం రిజర్వాయర్ నుండి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ వరకు 3.4 కిలోమీటర్ల అప్రోచ్ చానెల్
- పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్
- పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుండి బనకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ వరకు మిట్టకొండల రిడ్జ్ ను కట్ చేస్తూ 16.34 కిలో మీటర్ల కెనాల్

- బనక చెర్ల క్రాస్ రెగ్యులేటర్
- కుడి బ్రాంచి కెనాల్ 112.7 కిలోమీటర్లు
- గోరకల్లు డ్యాం దిగువన బై-పాస్ కెనాల్
- గోరకల్లు, అవుకు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు.

ప్లానింగ్ కమీషన్ కు నివేదించిన ఎస్ఆర్బిసి ప్రాజెక్టు రిపోర్టు వర్కింగ్ టేబుల్స్ లో మద్రాస్ వాటర్ సప్లై కి 15 టీఎంసీ లు, ఎస్ఆర్బిసి కి 19 టీఎంసీలు శ్రీశైలం రిజర్వాయర్ నుండి జులై నుండి నవంబర్ అయిదు నెలల్లో తీసుకొంటామని ఉంది. అయిదు నెలల్లో ఎస్ఆర్బిసి కి చెందిన 19 టీఎంసీ లను జులైలో 2 టీఎంసీ లు, ఆగస్ట్‌లో 5 టీఎంసీలు, సెప్టెంబర్‌లో 5 టీఎంసీ లు, అక్టోబర్‌లో 4.5 టీఎంసీలు నవంబర్‌లో 2.5 టీఎంసీలు తీసుకుంటామని, మద్రాసు తాగు నీటిని 15 టీఎంసీ లను జులై నుండి అక్టోబర్ వరకు సమానంగా నెలకు 3.75 టీఎంసీ ల చొప్పున తీసుకొంటామని ఎస్ఆర్బిసి ప్రాజెక్టు రిపోర్టులో పేర్కొన్నారు. అంటే గరిష్టంగా ప్రధాన కెనాల్ లో ఎస్ఆర్బిసి కొరకు 5 టీఎంసీలు, మద్రాసు వాటర్ సప్లై కొరకు 3.75 టీఎంసీలు రెండు నెలలు ఆగస్ట్ సెప్టెంబర్ ల్లో ఉంది. శ్రీశైలం కుడి ప్రధాన కాలువ(SRMC) మొత్తం 34 టీఎంసీ లు (19+15=34) తీసుకువెళ్లడానికి సామర్థ్యం 2,250 క్యూసెక్కులు (750+1500) 854 ఫీట్ల వద్ద మరియు 6,460 క్యూసెక్కులు (4,960+1500) 6,460 వరద సమయాల్లో అంటే 880 ఫీట్ల పైన నీటి మట్టం ఉన్నప్పుడు తీసుకు వెళ్ళే విధంగా ఉండాలి. దాని చివర గల బనక చెర్ల వద్ద క్రాస్ రెగ్యులేటర్ ఒకటి 4,960 క్యూసెక్కులకు, మరొకటి 1,500 క్యూసెక్కులకు ఉంటే సరిపోతుంది. కానీ పోతిరెడ్డిపాడు, SRMC మరియు బనకచెర్ల నిర్మాణం ఎట్లా జరిగిందో మనకు తెలుసు. ఇక మరోవైపు ఇంతకు ముందు చర్చించిన మూడు క్రిష్ణా బేసిన్ రాష్ట్రాల మధ్య జరిగిన మద్రాసు వాటర్ సప్లై అగ్రిమెంటు ఎట్లా ముందుకు పోయిందో చూద్దాం.

జూన్ 1978 లో (హైదరాబాదులో) ఆంధ్ర ప్రదేశ్ మరియు తమిళనాడు ముఖ్యమంత్రుల సమావేశంలో ఈ కింది అంశాలను ఎజెండాగా చేర్చి చర్చించారు.

- శ్రీశైలం రిజర్వాయర్ నుండి ఇరు రాష్ట్రాలు అంగీకరించే పాయింట్, నుండి సోమశిల రిజర్వాయర్ వరకు కెనాల్ అలైన్ మెంట్,
- సోమశిల నుండి తమిళనాడు వరకు ఒక కెనాల్
- తమిళనాడు రాష్ట్రం నెల్లూరు జిల్లాలో కొన్ని ప్రాంతాలకు ఇరిగేషన్ కూడా కల్పిస్తూ ఒక జాయింట్ కెనాల్ ను కావాలని అడిగిన అంశం
- జులై-అక్టోబర్ ల మధ్య నాలుగు నెలలు మాత్రమే తీసుకువెళ్తే తమిళనాడులో సరిపోయే రిజర్వాయర్లు లేవు కాబట్టి ఆంధ్ర ప్రదేశ్ లో అదనపు రిజర్వాయర్ కెపాసిటీ నిర్మించాలి
- మొత్తం ప్రాజెక్టు పూర్తి కావడానికి పదేళ్ళు పడ్తుంది కాబట్టి వెంటనే ఇపుడు రాబోతున్న సోమశిల రిజర్వాయర్ నుండి 5 టీఎంసీ లను ఈ మధ్య కాలంలోనే తమిళనాడుకు విడుదల చేయాలి.

నీళ్ళు ఇచ్చేది ఆంధ్ర ప్రదేశ్ మరియు తీసుకునేది తమిళనాడు అయినప్పుడు, తమిళనాడుతో ఏదైనా ద్వైపాక్షిక ఒప్పందం ఆంధ్రప్రదేశ్ అనుకున్నట్లుగానే జరుగుతుంది కదా. అందుకే 5 టీఎంసీల చొప్పున నీటిని వాటాను ఇచ్చే కర్ణాటక, మహారాష్ట్ర లు లేకుండా జరిగిన ఈ ద్వైపాక్షిక ఒప్పందం ఆంధ్రప్రదేశ్‌కు అనుకూలమైన విధంగానే సాగింది.

**ఏప్రిల్,1983 లో ఆంధ్ర ప్రదేశ్ మరియు తమిళనాడు ముఖ్యమంత్రుల మధ్య మరొక ఒప్పందం జరిగింది.**

- ఒక లైన్డ్ కెనాల్ ను శ్రీశైలం రిజర్వాయర్ నుండి మొదలు పెట్టేందుకు చెన్నముక్కపల్లి వద్ద ఆఫ్-టేక్ పాయింట్ నిర్ణయించారు. (ఆ చెన్నముక్కపల్లి శ్రీశైలం రిజర్వాయర్‌కు దాదాపుగా 150 కిలోమీటర్ల దూరంలో పెన్నా నది ఒడ్డున ఉంది. ఎంత విడ్డూరం!)
- కాలువలో ప్రవాహ నష్టాలు 3 టీఎంసీ లుగా నిర్ణయించారు. (నష్టాలన్నీ కలుపుకొని గరిష్టంగా 15 టిఎంసిలు శ్రీశైలం నుండి విడుదల చేయాలి).
- కండలేరు రిజర్వాయర్ లో 5 టీఎంసీ ల స్టోరేజిని చెన్నై వాటర్ సప్లయికి ఏర్పాటు చేయాలి, షెడ్యూల్-సి లో ఉన్న విధంగా తమిళనాడు బోర్డర్ వద్ద వదలాలి.
- ఒప్పందంలోని అంశాలు తప్ప వేరేగా ఆంధ్రప్రదేశ్ కు ఇరిగేషన్ కు వినియోగించుకునే హక్కు ఉంటుంది.

**ప్రాజెక్టు లోని భాగాలు:**

- శ్రీశైలం రిజర్వాయర్ నుండి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ వరకు అప్రోచ్ చానెల్
- పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్
- పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుండి బనకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ వరకు మిట్టకొండల రిడ్జ్ ను కట్ చేస్తూ లైన్డ్ కెనాల్
- బనక చెర్ల క్రాస్ రెగ్యులేటర్
- బనక చెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుండి ఆఫ్-టేక్ పాయింట్ వరకు మెయిన్ కెనాల్ సిస్టం
- ఆఫ్-టేక్ పాయింట్ నుండి సోమశిల వరకు లైన్డ్ కెనాల్
- సోమశిల రిజర్వాయర్ స్టేజ్-II
- సోమశిల నుండి కండలేయస్త్ర వరకు కెనాల్
- కండలేరు రిజర్వాయర్
- కండలేరు రిజర్వాయర్ నుండి తమిళనాడు బోర్డర్ వరకు కెనాల్.
- షెడ్యూల్-సి ప్రకారం గరిష్టంగా 1000 క్యూసెక్కులకు మించకుండా జూన్ నుండి అక్టోబర్ వరకు, మళ్ళీ జనవరి నుండి ఏప్రిల్ వరకు తమిళనాడు సరిహద్దు వద్ద విడుదల చేయాలి.

ఈ చెన్నముక్కపల్లి దాదాపుగా పెన్నా నది ఒడ్డున ఉంటుంది. అంటే 1977 ఒప్పందంలో శ్రీశైలం రిజర్వాయర్ వద్ద నుండి కెనాల్ ను తమిళనాడు ఆంధ్రప్రదేశ్ ఒప్పుకున్న ఒక ఆఫ్-టేక్ పాయింట్ వద్ద మొదలు పెట్టి పెన్నా నదివరకు ఉండాలని ఉంటే దాన్ని శ్రీశైలం రిజర్వాయర్ నుండి దాదాపు 150 కిలోమీటర్ల ఆవల చెన్నముక్క పల్లి వద్ద అని నిర్ణయించారు. పర్యవసానంగా చెన్నముక్కపల్లి వరకు గల అప్రోచ్ చానెల్ పొడవు దాదాపు 150 కిలోమీటర్లు. అసలు అప్రోచ్ చానెల్ అంటే ఏ రిజర్వాయర్ నుండి అయితే నీటిని తీసుకుంటారో దాని నుండి ఆఫ్-టేక్ పాయింట్ అంటే హెడ్ రెగ్యులేటర్ ఉండే ప్రదేశం వరకు కొన్ని వందల మీటర్లు లేదా ఒకటి, రెండు కిలోమీటర్లు ఉంటుంది.

ఆవసరమైతే మరింత ఎక్కువ. అంతేకాని ప్రపంచంలో ఎక్కడా ఈ విధంగా రిజర్వాయర్ కు 150 కిలోమీటర్ల దూరంలో ఆఫ్ టేక్ పాయింట్ పెట్టరు. కేవలం అగ్రిమెంటును వక్రంగా, తమకు అనుకూలంగా అమలు చేయడానికే ఈ రకమైన ఏర్పాటు జరిగింది. ఆ ఆఫ్ టేక్ పాయింట్ చెన్నముక్క పల్లి నుండి దాదాపు రెండు మూడు కిలోమీటర్లు దాటితే పెన్నా నది వస్తుంది. ఈ రెండు మూడు కిలోమీటర్ల దూరమే అగ్రిమెంట్ లో పేర్కొన్న విధంగా 1500 క్యూసెక్కుల లైన్డ్ కెనాల్ ను ప్రతిపాదించారు. ఇక అంతకు ముందు రిజర్వాయర్ నుండి చెన్నముక్కపల్లి వరకు 150 కిలోమీటర్ల కెనాల్ లో కొంత 11,150 క్యూసెక్కులు, చాలా వరకు 5,000 క్యూసెక్కులుగా ప్రతిపాదించారు.

ఈ విధంగా మూడు కృష్ణా బేసిన్ రాష్ట్రాల ఒప్పందాన్ని వక్రీకరించి తమిళనాడుతో కలిసి చేసుకున్న ఒప్పందం ప్రకారం తెలుగు గంగా ప్రాజెక్టును రూపకల్పన చేసింది నాటి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం. ఈ తెలుగు గంగా ప్రాజెక్టు స్కీమ్ లో క్రిష్ణా నదిలోని మిగులు జలాలను 29 టీఎంసీ లను ఇరిగేషన్ కొరకు కలిపి 1984 లో జిఓ 195 విడుదల చేసింది ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం. తెలుగు గంగా ప్రాజెక్టు రిపోర్టులో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ వరకు గల అప్రోచ్ కెనాల్, పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ సామర్థ్యం మరియు పోతిరెడ్డిపాడు నుండి బనకచెర్ల వరకు గల కెనాల్ (శ్రీశైలం కుడి ప్రధాన కాలువ, SRMC) సామర్థ్యం 880 ఫీట్ల నీటి మట్టం వద్ద 11,150 క్యూసెక్కు లుగా ప్రతిపాదించారు. ఈ అప్రోచ్ చానెల్ మరియు SRMC లైన్డ్ కెనాళ్ళుగా ప్రతిపాదించబడ్డాయి. బనకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ సామర్థ్యం కూడా 11,150 క్యూసెక్కులుగా, బనకచెర్ల వద్ద నుండి వెలుగోడు రిజర్వాయర్ వరకు కూడా ఒక లైన్డ్ కెనాల్ 11,150 క్యూసెక్కులతో ప్రతిపాదించారు.

ఇట్లా శ్రీశైలం నుండి పెన్నా నది వరకు కేవలం మద్రాసు కు తాగునీరు అందివ్వాల్సిన 1500 క్యూసెక్కుల కెనాల్ ఉండాల్సిన చోట 11,150 క్యూసెక్కుల సామర్థ్యం గల ఇరిగేషన్ కెనాల్‌ను ప్రతిపాదించింది నాటి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం.

### దాల్ మే కుచ్ కాలా హై ..

1984 లో పనులు ప్రారంభమై, బనక చెర్ల క్రాస్ రెగ్యులేటర్ వరకు పనులు 1987-88 నాటికి పూర్తయ్యాయి. ఇక్కడ జరిగిన నిర్మాణాలు విస్మయాన్ని కలుగజేస్తాయి.

- పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ లో అన్నీ హెడ్ రెగ్యులేటర్ల వలె కాకుండా ఒక స్టాండ్ బై గేట్ అదనంగా పెట్టి నిర్మించారు. (మనందరికీ తెలిసిన ఉదాహరణ నాగార్జున సాగర్ ఎడమ కాలువ. కాలువకు మూడు గేట్లే ఉ ంటాయి. స్టాండ్ బై గేట్ ఉండదు.)
- శ్రీశైలం రిజర్వాయర్లో +880 అడుగుల నీటి లెవెల్ ఉన్నప్పుడు ఒక్కో గేట్ ద్వారా 5,140 క్యూసెక్కుల నీటి విడుదల సామర్థ్యం ఉంటుంది. అంటే మొత్తం 3 గేట్ల ద్వారా 15,420 క్యూసెక్కుల నీటిని విడుదల చేయవచ్చు. ఇక సాండ్ బై గేట్ ను కలుపుకుంటే మొత్తం 4 గేట్ల ద్వారా 20,560 క్యూసెక్కుల నీటి విడుదల సామర్థ్యం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు ఉంది.
- ఎస్ఆర్ఎంసి కెనాల్ సామర్థ్యం ప్రాజెక్టు రిపోర్టులో ఉన్న దాని ప్రకారం 11,150 క్యూసెక్కులు. అలాంటప్పుడు గేట్ల ద్వారా ఎక్కువ సామర్థ్యం పెట్టి లాభం లేదు. మరి హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం 11,150 క్యూసెక్కులు కాకుండా 20,560 క్యూసెక్కులు ఎందుకు పెట్టారో తెలియదు!
- ఇక కెనాల్ సామర్థ్యం 11,150 క్యూసెక్కులు ఉండాలంటే కాలువ వెడల్పు (Canal bed width) 15.85 మీటర్లు చాలు. తెలుగు గంగా ప్రాజెక్టు రిపోర్టులో కూడా అంతే ఉంది. కానీ 32 మీటర్ల తో నిర్మించారు. అంటే 18,650 క్యూసెక్కుల సామర్థ్యం గల కెనాల్ గా నిర్మించారు.

- ఇక అన్నింటికంటే గమ్మత్తయిన విషయమేమంటే మూడు రాష్ట్రాల మధ్య ఒప్పందంలో కానీ ప్రాజెక్టు రిపోర్టుల్లో కానీ అంతటా లైన్డ్ కెనాల్ అని ప్రతిపాదించి ఉంటే అన్-లైన్డ్ కెనాల్ కట్టారు. అంటే కెనాల్ కు గల గరుకుదనం ('n' value, coefficient of rugosity) గట్టి రాయి ఉన్న ప్రదేశాల్లో అన్-లైన్డ్ కెనాల్ కు 0.035 ఉంటుంది, కెనాల్ చుట్టూ సిమెంట్ కాంక్రీట్ తో లైనింగ్ చేస్తే గరుకుదనం కేవలం 0.018 గా తీసుకుంటారు. కాబట్టి లైన్డ్ కెనాల్ లో ప్రవాహ వేగం పెరిగి నీరు ఎక్కువగా ప్రవహించ గలుగుతుంది. ఒకే కెనాల్ లో లైనింగ్ చేయకుంటే తక్కువ నీరు ప్రవహిస్తుంది, లైనింగ్ చేస్తే ఎక్కువ నీరు ప్రవహిస్తుంది. అంటే ఇక్కడ లైనింగ్ చేయని కెనాల్ గా కట్టినాక లైనింగ్ చేస్తే దాని సామర్థ్యం దాదాపుగా రెట్టింపు అవుతుంది. లైన్డ్ కెనాల్ లో నీరు భూమిలోకి ఇంకవు కాబట్టి ప్రవాహ నష్టాలు కూడా చాలా తగ్గుతాయి. అందుకే లైన్డ్ కెనాల్ అని ప్రాజెక్టు రిపోర్టుల్లో, అగ్రిమెంటుల్లో చూపించి కట్టేప్పుడు అన్-లైన్డ్‌గా కట్టి, తరువాతి కాలంలో ఆ కెనాల్ లైన్డ్ గా మారిస్తే కెనాల్ కెపాసిటీ పెరుగుతుంది. అప్పటికే ఒక వేళ ఎక్కువ కెపాసిటీ గల హెడ్ రెగ్యులేటర్ ఉంటే ఆ పెరిగినంత కెపాసిటీని, కెనాల్ కొలతలు ఏ మాత్రం మార్చకుండానే, ఆ కెనాల్ ద్వారా తీసుకు పోవచ్చు. ఇదీ కెనాల్ ను లైన్డ్ గా చూపించి అనుమతులు పొంది ఆ అనుమతి పొందిన కెపాసిటీకి మొత్తంగా ఆన్-లైన్డ్ కెనాల్ ను నిర్మించి ఆ తరువాత దాన్ని లైన్డ్‌గా మార్చడం వెనుక ఉన్న మతలబు. (ఇదే విధమైన నిర్మాణ "చాతుర్యం" పోతిరెడ్డిపాడు విస్తరణ 2005 లో జరిగినపుడు 44,000 క్యూసెక్కులకు లైన్డ్ కెనాల్ కాకుండా అన్-లైన్డ్ కెనాల్ కట్టినపుడు కనబడుతుంది. అదే కెనాల్‌ను ఇప్పుడు లైనింగ్ చేసి 88,000 క్యూసెక్కులకు పెంచుతున్నారు. ఇక హెచ్.ఎన్.ఎస్.ఎస్. కెనాల్ సామర్థ్యం కూడా ఇట్లాగే ఈ మధ్య పెంచారు).

- అంటే వాస్తవంగా ఉన్న కెనాల్ లో 18,650 క్యూసెక్కు లు అన్-లైన్డ్ కెనాల్ లో వెళ్తాయి కాబట్టి కాంక్రీట్ లైన్డ్ కెనాల్ గా మారిస్తే 18,650 (.035/.018) = 36,300 క్యూసెక్కులు వెళ్ళేవిగా తయారవుతాయి.

- ఇవి అర్థం చేసుకున్నాక, ఇప్పుడు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుండి బనకచెర్ల వరకు గల కెనాల్ ను 11,150 క్యూసెక్కుల (వాస్తవంగా అన్-లైన్డ్ 18,650 క్యూసెక్కులు, లైన్డ్ అవుతే 36,300 క్యూసెక్కుల) సామర్థ్యంతో నిర్మించి, బనకచెర్ల వద్ద మూడు క్రాస్ రెగ్యులేటర్లను ఒక్కొక్కటి 11,150 క్యూసెక్కుల కెపాసిటీ తో ఎందుకు నిర్మించారో అర్థం అవుతుంది. ప్రాజెక్టు రిపోర్టు ప్రకారం ఎస్ఆర్ఎంసి సామర్థ్యం 11,150 క్యూసెక్కులు ఉంటే, బనకచెర్ల వద్ద మూడు క్రాస్స్ రెగ్యులేటర్లు కట్టారెందుకు? ఒకేసారి మూడు విడుదల చేస్తే 33,450 క్యూసెక్కుల ప్రవాహమే ప్రధాన కెనాల్లో లేదు కదా? అనే సందేహాలకు ఇదీ జవాబు.

- వాస్తవంగా 36,300 క్యూసెక్కుల ప్రవాహం సాధ్యమయ్యే కెనాల్ ఉన్నప్పుడు బనక చెర్ల వద్ద ఉన్న మూడు క్రాస్ రెగ్యులేటర్లు ఒకేసారి నీటిని విడుదల చేసినా 11,150 x 3 = 33,450 క్యూసెక్కులు వెళ్ళగలుగుతాయి. అట్లా భవిష్యత్తులో లైన్డ్ కెనాల్ గా మార్చుకుంటామన్న (దుర/దూర) ఆలోచనతోనే ఈ కెనాల్ ను ఎక్కువ కొలతలతో, అన్-లైన్డ్ గా నిర్మించారని అర్థంవుతున్నది. దివంగత ఆర్ విద్యాసాగర్ రావు గారు ఎన్.డబ్ల్యు.డి.ఎ చీఫ్ ఇంజనీర్ గా 1995 లో కేంద్ర జల సంఘం చైర్మన్ ఎం ఎస్ రెడ్డి గారితో బనకచర్ల సందర్శించినప్పుడు ఈ అంశాన్ని గమనించినారు. ఎం ఎస్ రెడ్డి గారితో ప్రస్తావిస్తే మనకెందుకులే అని ఆయన చర్చను మళ్ళించారు. అయితే విద్యాసాగర్ రావు మదిని ఈ అంశం తొలుస్తూనే ఉన్నది. ఉద్యమ సమయంలో 'నీళ్ళు - నిజాలు' పుస్తకంలో ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ "దాల్ మే కుచ్ కాలా హై" అని రాశారు. ఈ విషయం మామూలుగా పైపైన చూస్తే అర్థం కాదు. లోతుగా విశ్లేషిస్తే తెలంగాణ ఇరిగేషన్ అడ్వైజర్ దివంగత ఆర్.విద్యాసాగర్ రావు గారన్నట్లుగా నిజంగానే "దాల్ మే కుచ్ కాలా హై" అనిపిస్తుంది. ఇదీ 2005 వరకున్న పరిస్థితి.

## పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ విస్తరణ : (2005)

ఇట్లా తెలుగు గంగ మరియు ఎస్ఆర్బిసి లకు న్యాయబద్దత కల్పించి 1983 నాటికల్లా తమిళనాడుతో ఒక ఒప్పందం కుదుర్చుకుని పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, ఇతర అన్ని అనుబంధ పనులకు శ్రీకారం చుట్టారు. ప్రతిపాదించిన ఆ పనులను చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. బనకచెర్ల వద్ద గల మూడు క్రాస్ రెగ్యులేటర్లలో ఒకటి ఎస్ఆర్బిసి కి, రెండోది ఎస్కేప్ రెగ్యులేటర్ కు (వాస్తవానికి కేసి కెనాల్ కు నీటిని విడుదల చేసేందుకు దీన్ని ఉపయోగిస్తారు). మూడోది తెలుగు గంగ ప్రాజెక్టు కెనాల్ కై ఉద్దేశించినవి. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ కేవలం 11,150 క్యూసెక్కులుగా ఉంచి, అక్కడి నుంచి వచ్చే నీటిని తరలించే మూడు క్రాస్ రెగ్యులేటర్ ల ద్వారా మొత్తం 33,450 క్యూసెక్కుల సామర్థ్యం (11,150X 3) ఎందుకు అన్న ప్రశ్న జలరంగ నిపుణులను కలిగేది. అయితే, దీనికి సమాధానం 2005 లో దొరికింది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ను, ఎస్ఆర్ఎంసి ని 40,000 క్యూసెక్కులకు పెంచుతున్నట్లు ప్రకటించారు. 2006 లో 44,000కు పెంచుతూ మరో జీవో వచ్చింది.

2006 లో గడిచిన 22 సంవత్సరాల ఆధారంగా వరద వచ్చే రోజులు 30 మాత్రమే అని నిర్ణయించి, శ్రీశైలం డ్యాం ఎగువన అన్ని ప్రాజెక్టుల వినియోగాలను పరిగణన లోనికి తీసుకొని, కర్ణాటకలో ఆల్మట్టి డ్యాం కట్టినాక కూడా 114 టీఎంసీ లు మరల్చవచ్చు అని నిర్ధారించినామని ప్రకటించి నాటి వై ఎస్ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ మరియు శ్రీశైలం కుడి ప్రధాన కాలువ (SRMC) సామర్థ్యాన్ని 44,000 క్యూసెక్కులకు పెంచుతూ నిర్మాణం ప్రారంభించారు. కొన్ని నెలల్లోనే పూర్తి కూడా చేశారు. ఈ 114 టీఎంసీల ద్వారా తెలుగు గంగ ప్రాజెక్టుకు 29 టీఎంసీలు, ఎస్ఆర్బిసి కి 19 టిఎంసిలు, గాలేరు-నగరికి 38 టిఎంసిలు, చెన్నై తాగునీరు కోసం15 టిఎంసిలు, హెచ్ఎల్సికి మళ్లింపు 10 టీఎంసీలు, తాగునీరు తదితరాలు 3 టీఎంసీలు గా పరిగణించారు. అదే సమయంలో తెలంగాణా ప్రాజెక్టులైన నెట్టెంపాడు, కల్వకుర్తి, భీమా, ఎస్ఎల్బి సి ప్రాజెక్టులకు వరద నీరు 90 రోజులు గానే ఉంచడం ఎంత విచిత్రం!! ఒక నదికి కుడి వైపున ఉన్న ప్రాజెక్టులకు వరద వచ్చే దినాలు 30 అట. ఎడమవైపున ఉన్న తెలంగాణా ప్రాజెక్టులకు వరద దినాలు 90 అట. ఇది ఉమ్మడి రాష్ట్రం అనుసరించిన ద్వంద్వ విధానాలకు ఒక మచ్చుతునక.

పోతిరెడ్డిపాడు దిగువన SRMC లో గరిష్ట డిశ్చార్జి 2005 నాటికే ఉన్న కెనాల్ బెడ్ వెడల్పు (32 మీ) వద్ద 18,650 క్యూసెక్కులు. అది లైనింగ్ చేయని కెనాల్ గరిష్ట డిశ్చార్జి కెపాసిటీ. ఒక వేల లైనింగ్ చేస్తే 36,300 క్యూసెక్కులు అదే కెనాల్ గుండా తీసుకు వెళ్లవచ్చు. అది డీప్ కట్ కెనాల్ కాబట్టి, ఫ్రీ బోర్డులోకి కూడా అనుమతిస్తే దాదాపుగా 44,000 క్యూసెక్కులు అదే కెనాల్ గుండా వీలవుతుంది. మరి అలాంటప్పుడు కెనాల్ లైనింగ్ ప్రతిపాదన చేయకుండా, కెనాల్ బెడ్ వెడల్పును 32 మీ నుండి అమాంతంగా 78 మీ కు పెంచి, లైనింగ్ లేకుండా కెనాల్ ను ప్రతిపాదించారు. అంటే ఆ రోజే కెనాల్ ను భవిష్యత్తులో లైనింగు చేస్తే 88,800క్యూసెక్కులు ఉండేట్టుగా ఒక లైనింగ్ లేని కెనాల్ ను ప్రతిపాదించి 78 మీ వెడల్పుతో కట్టారు. ఆ విషయమై మాట్లాడే అవకాశమే నాటి ప్రతిపక్షాలకు ఇవ్వలేదు నాటి ప్రభుత్వం. ఇప్పుడు ఏ విధమైన SRMC కొలతల్లో మార్పు లేకుండా, అదే 78 మీ బెడ్ వెడల్పుతో లైనింగ్ చేయడం వల్ల 88,800 క్యూసెక్కులు తీసుకువెళ్ళేందుకు జీఓ 203 ద్వారా ప్రతిపాదించారు.

తరువాత కాలంలో పోతిరెడ్డిపాడు హెడ్ రేగులేటర్ ను పెంచుకునే ఆలోచనతోనే ముందే ఎస్ఆర్ఎంసి మరియు బనకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ల కెపాసిటీ లు పెంచుకొని కట్టారు అన్న విషయం స్పష్టం అవుతున్నది. ఈ విషయాన్ని అక్టోబర్ 2005 లో అసెంబ్లీలో నాటి ముఖ్యమంత్రి వై యెస్ రాజశేఖర్ రెడ్డి గారు నిర్మొహమాటంగా ఒప్పుకున్నారు. నాడు రాష్ట్ర సాగునీటి మంత్రి వరద దినాలు తగ్గిపోయినందువల్ల పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ కెపాసిటీని పెంచుతున్నామని

ప్రతిపక్ష సభ్యులకు సమాధానమిచ్చే ప్రయత్నం చేస్తూ ఉంటే, ముఖ్యమంత్రి గారు "35 వేల క్యూసెక్కుల బనకచెర్లకు నీళ్లివ్వడానికి అప్రోచ్ చానెల్ పైనున్న పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం 11,150 క్యూసెక్స్ ఉంది. అది చాలదని పోతిరెడ్డిపాడు డిజైన్ చేస్తున్నాం తప్ప మరొకటి కానే కాదు" అని స్పష్టం చేశారు. (అనుబంధం – 13) అట్లా అంచెలంచెలుగా సామర్థ్యాన్ని పెంచుతూ వచ్చాయి నాటి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వాలు. ఈ పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ – ఎస్.ఆర్.ఎమ్.సి. పెంపును ప్రతిఘటిస్తూ నాడు తెలంగాణ రాష్ట్ర సమితి రాష్ట్ర ప్రభుత్వం నుంచి వైదొలిగింది. మంత్రి పదవులకు రాజీనామా చేసింది. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన పి. జనార్ధనరెడ్డి గారు కూడా బలంగా వాదించారు. మిగిలిన తెలంగాణ ప్రతిపక్ష నాయకులు కూడా వ్యతిరేకించారు.

**పోతిరెడ్డిపాడు వాస్తవ సామర్థ్యం :**

88,800 క్యూసెక్కుల సామర్థ్యంతో కెనాల్లో డిశ్చార్జ్ పంపిస్తే రోజుకు 7.67 టీఎంసీల నీటిని తరలించవచ్చు. ఇప్పటికే బనకచెర్ల వద్ద క్రాస్ రెగ్యులేటర్ల కెపాసిటీని 55,000 క్యూసెక్కులకు పెంచిన ఆంధ్ర ప్రదేశ్ ఇకముందు 88,800 క్యూసెక్కుల డిశ్చార్జ్ కు పెంచుకునేందుకు ప్రయత్నిస్తుంది. ఇప్పటికే జి.వో. 388, తేది 15.07.2020 ద్వారా ఆ దిశగా అడుగులు వేసింది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. కేవలం వరద జలాలను మాత్రమే తరలిస్తామని వారు చెపుతున్నప్పటికీ 854 అడుగుల మట్టంలో శ్రీశైలం జలాశయంలో నీరుంటే జలాశయం నుంచి పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తరలించబోరన్న గ్యారంటి ఏమిటి ? దీన్ని నియంత్రించడం సాధ్యమా? ఇప్పుడు మన అనుభవాలను బట్టి చూస్తే అది సాధ్యం కాదనే తెలుస్తున్నది. అందువల్లనే, తెలంగాణ నేడు ట్రిబ్యునల్ ఎదుట పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్‌ను తగురీతిన నియంత్రించాల్సిన అవసరం ఉందని నివేదించింది. ఇట్లా మెల్లమెల్లగా 1,500 క్యూసెక్కుల నుండి 88,800 క్యూసెక్కుల సామర్థ్యానికి చేరిన అంశాన్ని గమనిస్తే, ఈరోజు ఇచ్చిన జీవో 203కు అంకురార్పణ కొన్ని దశాబ్దాల కిందనే అక్రమంగా జరిగింది అనే అంశం మనకు అవగతమవుతున్నది.

**శ్రీశైలం MDDL మార్పు వివాదం:**

శ్రీశైలం జల విద్యుత్ ప్రాజెక్టు రిపోర్టు 1962 లో కనిష్ట నీటి మట్టం (MDDL) ను +854 ఫీట్లుగా పేర్కొన్నారు. అయితే, నికర పవర్ ఉత్పాదన MDDL +854 ఫీట్ల వద్ద 260 MW ఉంటుంది మరియు CoPP (కమిటీ ఆన్ ప్లాన్ ప్రాజెక్ట్స్) సిఫార్సు ప్రకారం MDDL +830 ఫీట్ల వద్ద 337 MW ఉంటుంది అని పేర్కొన్నారు. +854 ఫీట్ల వద్ద మరియు +830 ఫీట్ల వద్ద రెండు విధాలుగా వర్కింగ్ టేబుల్స్ ను ప్రాజెక్టు రిపోర్టు లో పొందు పర్చారు.

1962 రిపోర్టులో జియోలాజికల్ రిపోర్టు ప్రకారం పవర్ హౌస్ ను ఎడమ వైపున ఉండాలని నిర్ణయించారు. ప్లానింగ్ కమిషన్ ఈ రిపోర్టుకు అనుమతి ఇచ్చింది. 1963 లో ప్రాజెక్టు ప్రిలిమినరీ పనులు స్టాఫ్ క్వార్టర్స్ కట్టుకోవటం వంటివి మొదలు పెట్టుకోవటానికి ప్లానింగ్ కమిషన్ అనుమతి ఇచ్చింది. అయితే ప్రాజెక్టు కట్టే సమయానికి, శ్రీశైలం జల విద్యుత్ ప్రాజెక్టు రిపోర్టు, 1965 లో పవర్ హౌస్ ను కుడి వైపునకు, అంటే మహబూబ్ నగర్ జిల్లా నుండి కర్నూల్ జిల్లాకు, మార్చారు. ఆ రిపోర్టులో, MDDL ను (i) గోదావరి నుండి మళ్లింపులు జరగక ముందు +803 ఫీట్లు, (ii) గోదావరి మళ్లింపుల తరువాత (ఎ) +859 ఫీట్లు, (బి) డ్రై సంవత్సరంలో +830 ఫీట్లు గా పేర్కొన్నారు. ఆ తరువాత రెండు దశాబ్దాలకు ఎడమ వైపున కూడా పవర్ హౌజ్ కట్టారు. దానికి పంపుడ్ స్టోరేజి సౌకర్యం కూడా ఉంది.

1977 నాటికి శ్రీశైలం నుండి మద్రాసు తాగునీటి ఒప్పందం, 1981 నాటికి ఎస్ఆర్‌బిసి ప్రాజెక్టుకు

ప్లానింగ్ కమిషన్ నుండి అనుమతి సిద్ధమయ్యాయి. 1981 నాటికి శ్రీశైలం డ్యాం నిర్మాణం పూర్తయ్యింది. 1982-83 నాటికి విద్యుత్ ఉత్పత్తి మొదలై, 1986-87 నాటికి మొత్తం ఏడు యూనిట్లు ఆరంభమయ్యాయి. MDDL +805 ఫీట్లు గా నికర పవర్ ఉత్పాదన 340 MW తో విద్యుత్ ప్రాజెక్టు నడుస్తున్నది. 1984 నాటికి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నిర్మాణ మొదలై 1987-88 నాటికి బనక చెర్ల క్రాస్ రెగ్యులేటర్ల వరకు పనులు పూర్తయ్యాయి.

జూన్, 1996 లో జీఓ 69 ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయడానికి MDDL +834 ఫీట్లుగా నిర్ణయించి, బ్యాడ్ యియర్స్ లో తాగునీటికి మాత్రం అంతకంటే కిందకు వెళ్లడానికి వెసులు బాటు ఇచ్చింది. జీఓ లోని మిగిలిన అంశాలు చూస్తే చాలా వరకు ఆంధ్ర పక్షపాతంతో ప్రాధాన్యతలు ఉంటాయి కాబట్టి దానిలోని మిగిలిన విషయాల జోలికి మేము వెళ్లదల్చుకోలేదు.

శ్రీశైలం నాటి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం 28-09-2004 నాడు జీఓ 107 ద్వారా అప్పటివరకున్న MDDL (Minimum Draw Down Level రిజర్వాయర్లో కనీస నీటి మట్టం.) ను +834 ఫీట్ల నుండి +854 ఫీట్ల కు పెంచింది. ఈ సందర్భంగా ఆర్ విద్యాసాగర్ రావు గారు వెలిబుచ్చిన అభిప్రాయాలు చూద్దాం. ఆయన "క్రిష్ణా నికర జలాలపై రాయలసీమ ప్రాజెక్టుల (ఎస్ఆర్‌బిసి మినహాయించి) కు హక్కు లేదు. కాబట్టి రిజర్వాయర్ కనీస మట్టాన్ని 834 అడుగులే ఉండడం కరెక్ట్. శ్రీశైలం లో అదనపు జలాలు, వరద జలాలు లభించినపుడు మాత్రమే ఆ నీటిని సీమ ప్రాజెక్టులకు తరలించడం సమంజసం. ఇది ప్రస్తుత పరిస్తితి. ఇలా కుదరదు అనుకుంటే క్రిష్ణా జలాలను పునః పంపిణీ చేసి కోస్తా, రాయలసీమ, తెలంగాణ ప్రాంతాలకు వాటాలు నిర్ణయించి, ఆ మేరకు ప్రాజెక్టుల అవసరాలను దృష్టిలో ఉంచుకొనే శ్రీశైలం జలాశయం MDDL నిర్ణయించవలసి ఉంటుంది. ఇవేమీ చేయకుండా నిరంకుశంగా, హేతువిరుద్ధంగా జలాశయంలో MDDL నిర్ణయిస్తే అనవసర అపోహలకు లేనిపోని గొడవలకు దారి తీస్తుంది" అన్నారు. డిసెంబర్, 2005 లో జీఓ 233 ద్వారా శ్రీశైలం వద్ద రిజర్వాయర్ ఆపరేషన్ జీవో 69 మేరకే ఉంటుంది అని చెప్పింది. అంటే అంతకు ముందు ఇచ్చిన జీఓ 107 లోని విధంగా +854 ఫిట్లు కాకుండా +834 ఫీట్లు గానే MDDL ఉంటుంది.

నేడు ట్రిబ్యునల్ ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు చేయాల్సి ఉంది కాబట్టి, ఆ తరువాతే ఎండిడిఎల్ ను నిర్ణయించాల్సి ఉంటుంది. అంతవరకు కేఆర్ఎంబి బచావత్ ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం నీటి వినియోగాలు చూడాల్సి ఉంటుంది. ఇరు రాష్ట్రాల పరస్పర అంగీకారం లేకుండా, ట్రిబ్యునల్ అవార్డు లో లేని విధంగా నీటి విడుదల ఉత్తర్వులు ఇయ్యడం కేఆర్ఎంబి కి సాధ్యం కాదు. ప్రస్తుతం బచావత్ ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం శ్రీశైలం ఒక జల విద్యుత్ ప్రాజెక్టు మాత్రమే. దాని ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసే నీళ్ళు దిగువన నాగార్జునసాగర్ మరియు కృష్ణా డెల్టా ల అవసరాలకై మాత్రమే వినియోగించాలి. ఈ నీటి సంవత్సరం తెలంగాణ రాష్ట్రం నాగార్జునసాగర్ అవసరాలకై అక్కడ నీటిని ఉంచేందుకు తనకు చెందిన ఎడమ వైపు విద్యుత్ కేంద్రం ద్వారా నీటిని విడుదల చేసింది. ఆ నీరు ఇరు రాష్ట్రాలకు నాగార్జునసాగర్ ఎడమ, కుడి కాల్వలకు ఉపయోగపడుతుంది తప్ప కేవలం తెలంగాణకు కాదు. అది కూడా కేడబ్ల్యూడిటి-1 అవార్డు ప్రకారమే తప్ప వేరే కాదు. అయినా ఆంధ్ర ప్రదేశ్ అభ్యంతరం చెప్పడమూ, ఆ కారణంగా కేఆర్ఎంబి మనలను ఆపమని అడగడమూ విజ్ఞత కాదు.

***

అధ్యాయం-4

# జి ఓ 203 పర్యవసానాలు- ప్రభావాలు

ఇక ఇప్పుడు ఆంద్రా ప్రభుత్వం 5.5.2020 న జారీ చేసిన జి ఓ నంబరు 203 సంగతి చూద్దాం. జి ఓ లో ఉన్న ప్రధాన అంశాలు అధ్యాయం-1లో వివరించడం జరిగింది.జి ఓ 203 లో కొత్తగా ప్రతిపాదించిన "రాయలసీమ లిఫ్ట్ స్కీమ్" ఇంతకు ముందే 2017లో ఆరంభించిన ముచ్చుమర్రి లిఫ్ట్ స్కీంకు దగ్గరలోనే ఉంటుంది. ఈ కొత్త ప్రాజెక్టు ద్వారా లిఫ్ట్ చేసిన నీటిని కూడా ఇప్పటికే ఉన్న పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ దిగువన గల శ్రీశైలం కుడి ప్రధాన కాలువ ద్వారానే తీసుకు వెళ్తారు. శ్రీశైలం జలాశయం నీటి మట్టం ఎక్కువగా ఉన్నప్పుడు .. అంటే 841 అడుగులకు పైన ఉన్నప్పుడు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుండి, నీటి మట్టం 841 అడుగులకు దిగువన ఉన్నప్పుడు 797 అడుగుల వరకు రాయలసీమ లిఫ్ట్ స్కీమ్ ఎత్తిపోతల ద్వారా తీసుకు వెళ్తారన్నమాట. 841 ఫీట్ల పైన కూడా ఎక్కువ డిశ్చార్జ్ అవసరమైనప్పుడు పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ తో పాటు రాయలసీమ లిఫ్ట్ కూడా వాడుతారు.

ఆంధ్ర ప్రదేశ్ పునర్విభజన చట్టం, 2014 ప్రకారం కొత్త ప్రాజెక్టులేవీ అపెక్స్ కౌన్సిల్ అనుమతి లేకుండా రెండు రాష్ట్రాలు కట్టరాదు. ఈ నిబంధన రెండు రాష్ట్రాలకు వర్తిస్తుంది. కానీ ఇప్పటికే ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఎలాంటి అనుమతులు పొందకుండా పట్టిసీమ లాంటి కొత్త ప్రాజెక్టులను ఒక వైపు కడ్తూ, మరొక వైపు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే సాంక్షన్ చేసి అమలు చేయకుండా అటకెక్కించిన పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు, ఆర్ విద్యాసాగర్ రావు డిండీ ఎత్తిపోతల ప్రాజెక్టులను ఆపేక్స్ కౌన్సిల్ అనుమతుల్లేకుండా తెలంగాణ చేపట్టిందని ఫిర్యాదులు అనేకం చేసింది. 2007 లో డిండీ, 2009 లో పాలమూరు రంగారెడ్డి ప్రతిపాదించబడ్డాయి. ఇవి కొత్త ప్రాజెక్టులు కావని, రాష్ట్రావతరణకు ముందటి ప్రాజెక్టులే అని అపెక్స్ కౌన్సిల్ వద్ద తెలంగాణ సమర్థవంతంగా నిరూపించింది. ఇంకా చాలా బాధాకరమైన విషయమేమంటే.. తుమ్మిళ్ళ లిఫ్ట్ స్కీంను కూడా అనుమతుల్లేకుండా కడ్తున్న ప్రాజెక్టని, దాన్ని వెంటనే ఆపాలని కృష్ణా బోర్డుకు ఫిర్యాదులు చేసింది. ఆర్డిఎస్ ఆనకట్టను ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ సిఫార్సులకు అనుగుణంగా ఆధునీకరించనీయకుండా మరొక వైపు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అడ్డుపడుతున్నది. ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద నుండి బచావత్ ట్రిబ్యునల్ రాజోలిబండకు కేటాయించిన 15.90 టిఎంసిల నీటిని పొందడం సాధ్యం కావడం లేదు కాబట్టి, అదే తుంగభద్ర నీటిని కింద సుంకేసుల వద్ద నుండి తమ ఆర్డిఎస్ కు కేటాయింపుల్లోంచే వాడుకోవడానికి తుమ్మిళ్ళ లిఫ్ట్ స్కీం కట్టుకుంటే దాన్ని అక్రమ ప్రాజెక్టనడం బాధాకరం. సుంకేసుల బ్యారేజీకి వచ్చే నీళ్ళు ఆర్.డి.ఎస్. ఆనకట్ట దాటుకునే రావాలి. కానీ ఆర్.డి.ఎస్. కెనాల్ ద్వారా 15.9 టిఎం.సి.లకు గాను సరాసరి 5 టిఎంసిలు మాత్రమే వస్తుంటే, దిగువన సుంకేసుల నుండి కె.సి. కెనాల్‌కు 31.9 టిఎంసిలకు గాని సరాసరి 50 టి.ఎం.సి.లకు పైగా వాడుతున్నారు. ఇదీ వాస్తవం.

ఇప్పుడేమో, ఇప్పటి వరకెప్పుడూ ఊహాలో కూడా లేని రాయలసీమ లిఫ్ట్ స్కీం అనే సరికొత్త ప్రాజెక్టును చేపడ్తానని అంటున్నది. దాన్ని కేవలం వరద జలాలను తరలించడానికి మాత్రమే వినియోగిస్తామని ఆంధ్రప్రదేశ్ సాగునీటి మంత్రి చెప్తున్నారు. అయితే వరద జలాలు అంటే ఏమిటీ? స్థూలంగా చెప్పాలంటే 215 టిఎంసిల శ్రీశైలం రిజర్వాయర్ నిండి, శ్రీశైలం దిగువన ఉన్న 312 టిఎంసిల నాగార్జున సాగర్ జలాశయం, ఇంకా దిగువన గల 45 టిఎంసిల పులిచింతల జలాశయం, దాని కింద ఉన్న ప్రకాశం బ్యారేజీ నిండి పొంగి పొర్లుతున్నప్పుడు మాత్రమే కృష్ణా నదిలో వరద జలాలు ఉన్నట్టు లెక్క. ఇవన్నీ పొంగి పొర్లుతున్నప్పుడు, శ్రీశైలం వద్ద పూర్తి నీటి మట్టం (885

అడుగులు) ఉన్నప్పుడు కదా వరద జలాలను తీసుకోవలసింది. అప్పుడు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ గ్రావిటీ ద్వారానే తీసుకు పోవడానికి అవకాశం ఉంది కదా! మరి ఈ రాయలసీమ లిఫ్ట్ స్కీమ్ ద్వారా నీటి మట్టం చాలా దిగువన (797 అడుగుల వద్ద) ఉన్నప్పుడు తీసుకొనడం అంటే అది వరద నీటిని తీసుకోవడం ఎట్లా అవుతుంది? శ్రీశైలం రిజర్వాయర్ లోకి జూన్ జులై నెలల్లో వచ్చే కృష్ణా నది తొలి ప్రవాహాలను మరియు రిజర్వాయర్లో నిలువ ఉన్న నీటిని మొత్తంగా మళ్లించడానికి ఉద్దేశించిందే ఈ కొత్త లిఫ్ట్ స్కీం అని రూఢి అవుతున్నది. అందువల్ల పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని పెంచడం, రాయలసీమ ఎత్తిపోతల పథకం నిర్మాణం తెలంగాణ ప్రాజెక్టులకు గొడ్డలిపెట్టు లాంటిదని చెప్పక తప్పదు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి మా నీటి వాటాను వాడుకోవడానికి మేము ప్రాజెక్టులు కట్టుకుంటే అభ్యంతరం దేనికి అంటున్నారు. పూర్వపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బచావత్ ట్రిబ్యునల్ 811టిఎంసిల నీటిని కేటాయించిన మాట వాస్తవమే. ఈ నీటిలోఆంధ్ర ప్రాంతానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు నాడు పునః కేటాయింపులు చేసిన నీటి వాటా 512టిఎంసిలు. విభజన తర్వాత తెలంగాణా ప్రాజెక్టులకు న్యాయబద్ధంగా రావలసిన వాటా కోసం తెలంగాణా ప్రభుత్వం బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ముందు పోరాటం చేస్తున్నది. కనీసం 575 టీఎంసీలు తమకు న్యాయంగా వస్తాయని ఆశిస్తున్నది. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు వచ్చేవరకు తాత్కాలికంగా నీటిని 299:512 నిష్పత్తిలో పంచుకోవడానికి ఇరు రాష్ట్రాలు అంగీకరించాయి. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు వచ్చేవరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణాలో తమ వాటా 512 టిఎంసిలు అని చెప్పుకోవడానికి వీలు లేదు. కొత్త ప్రాజెక్టులు కట్టి ఈ కేటాయింపులను స్థిరపరచుకుంటామని అనడం న్యాయ విరుద్ధం. రాష్ట విభజన జరిగిన తర్వాత ఇప్పటికీ ఇరు రాష్ట్రాలకు కృష్ణాలో adjudicate అయిన నీటి వాటాలు లేవు అనే సంగతిని విజ్ఞులు గమనించాలి. అందువల్ల మా నీరు మేము వాడుకుంటామన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ప్రకటన ఆమోదయోగ్యం కాదు.

అందుకే, ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా తెలంగాణ ముఖ్యమంత్రి చాలా తీవ్రంగా స్పందించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తెలంగాణా సాగునీటి శాఖ ముఖ్య కార్యదర్శి, కృష్ణా నది యాజమాన్య బోర్డ్ సభ్యుడు అయిన శ్రీ రజత్ కుమార్ గారు బోర్డుకు 12.5.2020 న ఒక ఘాటైన లేఖ రాసిన సంగతి ఎరుకే. ఈ జి ఓ అమలు ప్రక్రియలో ఆంద్రప్రదేశ్ ప్రభుత్వం ముందుకు పోకుండా నిరోధించాలని ఆ లేఖలో బోర్డును కోరినారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ జి.ఓ.ను వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ పౌర సమాజమంతా ముక్తకంఠంతో, రాజకీయాలకు అతీతంగా కోరుతున్నది. తెలంగాణ లేఖకు ప్రతిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ ప్రాజెక్టులు పాలమూరు - రంగారెడ్డి, డిండి లిఫ్ట్ స్కీంలు, మిషన్ భగీరథ, తుమ్మిళ్ళ లిఫ్ట్ స్కీం. కల్వకుర్తి - నెట్టెంపాడు, ఎల్ఎల్బిసి స్కీంల పెంచిన నీటి వినియోగాల ప్రతిపాదనలను వెంటనే అపివేయాలని అవి అన్నీ కొత్త ప్రాజెక్టులని కె.ఆర్.ఎమ్.బికి లేఖ రాసింది. 12వ బోర్డు మీటింగ్లో తెలంగాణ ఆ ప్రాజెక్టులన్నీ 2014కు ముందువేనని సవివరంగా ఆధారాలతో స్పష్టం చేసింది. వీటిలో కల్వకుర్తి, నెట్టెంపాడు, ఎస్.ఎల్.బి.సి. ప్రాజెక్టుల విషయంలో నాటి ఆంధ్రప్రదేశ్ పేరుకు ఆయకట్టును పెంచింది కాని, నీటి కేటాయింపులు పెంచనందునే తాము ఆ పెంచిన ఆయకట్టుకు సరిపోయే నీటిని కేటాయించామని స్పష్టం చేసింది. సమస్య పరిష్కారానికై అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఈ ఆగస్టులో నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఈలోగా తెలంగాణ ప్రభుత్వం రాయలసీమ లిఫ్ట్ స్కీంను ఆపాలని సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

ఇక జి.ఓ. 203 ద్వారా ప్రతిపాదించిన ప్రధాన అంశాల్లో ఒకటి ఎస్ఆర్ఎంసి ద్వారా తీసుకువెళ్ల గలిగే గరిష్ట సామర్థ్యాన్ని కూడా 44,000 క్యూసెక్కుల నుండి 80,000 క్యూసెక్కులకు పెంచాలని నిర్ణయించడం. అయితే లైనింగ్ చేయడం ద్వారా ఎస్ఆర్ఎంసి సామర్థ్యం 88,800 క్యూసెక్కులకు పెంచుకునే ప్రమాదం ఉందని గతంలోనే

తెలంగాణ ట్రిబ్యునల్ కు తెలియపరచడం జరిగింది. అంటే, ఇప్పుడు ఆంధ్ర ప్రదేశ్ లైనింగ్ చేయడం వల్ల ఆ కెనాల్ సామర్థ్యం జీఓ లో చెబుతున్నట్టుగా 80,000 క్యూసెక్కులు కాకుండా 88,800 క్యూసెక్కులు ఉంటుంది. ఈ 203 జీ.ఓ పర్యవసానంగా శ్రీశైలం రిజర్వాయర్ లెవెల్ 880 అడుగుల వద్ద ఉన్నప్పుడు దాదాపుగా రోజుకు 7.67 టీఎంసీలు, లెవెల్ 854 అడుగులు ఉన్నప్పుడు రోజుకు 4.2 టీఎంసీలు, లెవెల్ 797 అడుగులు ఉన్నప్పుడు రోజుకు 3 టీఎంసీలు శ్రీశైలం రిజర్వాయర్ నుండి తీసుకొని వెళ్లగలిగే సామర్థ్యం ఆంధ్రప్రదేశ్ కు వస్తుంది. ఇది కేవలం ఎస్ఆర్ఎంసి ద్వారా తీసుకు పోగలిగే నీటి కెపాసిటీ మాత్రమే. శ్రీశైలం రిజర్వాయర్ లో నుండే ముచ్చుమర్రి వద్ద నిర్మించిన  హంద్రీ నీవా లిఫ్ట్ (4,000 క్యూసెక్కులు), కేసి కెనాల్ లిఫ్ట్ స్కీం(1000 క్యూసెక్కులు), వెలిగొండ సొరంగాలు (11,400 క్యూసెక్కులు) ద్వారా మొత్తం రోజుకు 1.42 టిఎంసిలు అదనంగా తీసుకువెళ్ళవచ్చు. అంటే 880.32 అడుగుల వద్ద మొత్తం రోజుకు 9.09 టిఎంసి చొప్పున 1,05,200 క్యూసెక్కుల తరలింపు సామర్థ్యం ఏర్పడుతుంది. ఇక శ్రీశైలం జలాశయం నుండి తెలంగాణా ప్రాజెక్టుల ద్వారా తరలించే నీరు అన్ని ప్రాజెక్టులు పూర్తయినాక కూడా 30,400 క్యూసెక్కులు మాత్రమే. పాలమూరు, రంగారెడ్డి – డిండి లిఫ్ట్ స్కీంలు రోజుకు 2 టిఎంసిలు, కల్వకుర్తి 0.28 టిఎంసిలు, ఎస్.ఎల్.బి.సి. 0.35 టిఎంసిలు మొత్తం 2.62 టిఎంసిలు మాత్రమే. (అనుబంధం–5)

2005 సంవత్సరంలో పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని11,150 క్యూసెక్కుల నుండి 44,000 క్యూసెక్కులకు పెంచడాన్నే తెలంగాణ ప్రభుత్వం బ్రిజేష్ కుమార్ ట్రిబ్యూనల్ (KWDT-II) ఎదుట తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. నాడు బ్రిజేష్ ట్రిబ్యునల్ ప్రొసీడింగ్స్ నడుస్తున్న కాలంలో 44,000 క్యూసెక్కులతో పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ – ఎస్.ఆర్.ఎమ్.సి. పెంచి నిర్మించిన విషయాన్ని ట్రిబ్యునల్‌ను తెలియజేయలేదు నాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. తెలంగాణ ఈ విషయాన్ని సుప్రీం కోర్టు ఎదుట స్పెషల్ లీవ్ పిటిషన్లో కూడా ప్రస్తావించింది. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఈ అంశాన్ని పరిశీలిస్తున్నది. అంటే పోతిరెడ్డిపాడు సామర్థ్యం పెంపు అంశం ఇప్పుడు కోర్టు పరిధిలో ఉన్న న్యాయపరమైన అంశం. అసలు ప్రస్తుతమున్న పోతిరెడ్డిపాడు మరియు కెనాల్ సామర్థ్యాన్నే వ్యతిరేకిస్తుంటే, ఇంకా కోర్టు తీర్పు రావాల్సి ఉండగానే, ఇప్పుడు ఆ సామర్థ్యాన్ని రెండింతలుగా పెంచడానికి జి.ఓ. జారీ చేయడం విడ్డూరం. న్యాయస్థానాలను బేఖాతరు చెయ్యడమే.

ఈ కొత్త ప్రాజెక్టు మరియు కెనాల్ పెంపు పర్యవసానంగా కృష్ణా బేసిన్లోనే ఉన్న శ్రీశైలం మరియు నాగార్జునసాగర్ జలాశయాలపై ఆధారపడి నిర్మించిన నికరజలాలు మరియు వరద జలాలపై ఆధారపడ్డ ఉన్న తెలంగాణ ప్రాజెక్టులు.. కల్వకుర్తి, ఎస్ఎల్‌బిసి సొరంగం, ఏఎంఆర్‌పి, ఉదయసముద్రం, నాగార్జునసాగర్ ఎడమ కాలువ, నాగార్జునసాగర్ లో లెవెల్ కెనాల్, హైదరాబాదు తాగునీటి సరఫరా స్కీంలు, మిషన్ భగీరథ, నిర్మాణంలో ఉన్న పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ స్కీం, డిండీ లిఫ్ట్ స్కీంలు అన్నీ తీవ్రంగా నష్టపోతాయి. ఇవి కృష్ణా బేసిన్లో ఉన్న కరువు, ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలకు సాగునీరు, తాగునీరు అందించేందుకు ఉద్దేశించినవి. ఒకప్పుడు హైదరాబాదు రాష్ట్రంలో మహబూబ్ నగర్ కై ఉద్దేశించిన 174 టీఎంసీల ప్రాజెక్టులు, 1956 లో జరిగిన రాష్ట్ర పునర్విభజన తరువాత పాలకుల వైఖరి వల్ల మహబూబ్ నగర్ కు దక్కకుండా పోయాయి. నాటి హైదరాబాద్ రాష్ట్రం రూపొందించిన నల్గొండ, ఖమ్మం జిల్లాల ప్రాజెక్టులు పక్షపాతానికి గురయ్యాయి. నేడు తెలంగాణ రాష్ట్రం వచ్చాక అయినా కొంత సాగునీటిని సమకూర్చుకుందాం అంటే, నీటి లభ్యతే లేకుండా అవుతుందేమో అని క్షామ పీడిత, ఫ్లోరైడ్ పీడిత మహబూబ్ నగర్, నల్గొండ, రంగారెడ్డి తదితర జిల్లాల ప్రజలు భయపడుతున్నారు. పోతిరెడ్డిపాడు ద్వారా తరలించే నీరంతా కృష్ణా బేసిన్ ఆవల ఉండే ప్రాంతాలకు పోతుంది. ఒకవైపు వంద శాతం  బేసిన్లోనే ఉన్న ప్రాంతాలకు నీరు దక్కని స్థితి ఉమ్మడి రాష్ట్రంలో ఉండేది. తెలంగాణా రాష్ట్రం ఈ దుర్భిక్ష ప్రాంతాలకు సాగునీరు, తాగునీరు ఇచ్చేందుకు సాగునీటి

ప్రాజెక్టులను నిర్మించుకుంటున్నది. ఉమ్మడి రాష్ట్రంలో పొందలేని న్యాయమైన నీటి వాటాను పొందడానికి న్యాయపోరాటం చేస్తున్నది. ఈ స్థితిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏకపక్షంగా, విభజన చట్టానికి విరుద్ధంగా కృష్ణా నదినే మళ్ళించుకుపోయే జి ఓ 203 ను జారీ చేస్తే అది తెలంగాణా ప్రయోజనాలకు, బేసిన్లో ఉండే హక్కుదారులైన మహబూబ్ నగర్, నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్, ఖమ్మం జిల్లాల ప్రజానీకానికి గొడ్డలి పెట్టు కాక మరేమవుతుంది? కాబట్టి తెలంగాణా సమాజమంతా రాజకీయాలకు అతీతంగా ఈ పోరాటంలో ప్రభుత్వంతో కలసి రావాల్సిన సందర్భం ఇది. మరొక వైపు ముఖ్యమంత్రి కె సి ఆర్ సఖ్యతతో, ఇచ్చి పుచ్చుకునే వైఖరితో పొరుగు రాష్ట్రాలకు స్నేహ హస్తం చాచినారు. మహారాష్ట్ర, కర్నాటక ప్రభుత్వాలు ముఖ్యమంత్రి స్నేహ హస్తాన్ని స్వీకరించి కలిసి ముందుకు నడుస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాత్రం పూర్వపు ఘర్షణాత్మక వైఖరిని ప్రదర్శిస్తున్నట్టు కనిపిస్తున్నది. అందుకు నిదర్శనం ఏకపక్షంగా, చట్టవిరుద్ధంగా జారీ చేసిన జి ఓ నంబరు 203. ఈ జి ఓ అమలుపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ , చెన్నై బెంచ్ స్టే విధించడం ఒక తాత్కాలిక ఊరట. అయితే టెండర్ల ప్రక్రియ జరుపుకోవచ్చు అనే వెసులుబాటు ఇచ్చింది. ట్రిబ్యునల్ ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ తన నివేదికను అసంబద్ధంగా ఏకపక్షంగా తయారు చేసింది కాబట్టి అది చెల్లదని తెలంగాణ ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది. ఎన్.జి.టి.లో విచారణ పూర్తి అయినది. తీర్పు వెలువడాల్సి ఉంది.

తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్ కూడా ఇంకా విచారణకు రావలసి ఉంది. అయితే పోరాటం కొనసాగవలసి ఉన్నది. ఇప్పుడు బంతి కేంద్రంలోనూ, కోర్టులోనూ ఉన్నది. కేంద్ర సంస్థలు నిష్పక్షపాతంగా పనిచేసి తెలంగాణకు న్యాయం చేయాలి. బేసిన్లోని కరువు పీడిత, ఫ్లోరైడ్ బాధిత ప్రాంతాలకు తెలంగాణ ప్రతిపాదిత ప్రాజెక్టుల ద్వారా జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల నుండి నికర జలాలను మళ్లించడంలో సహాయపడాల్సిన బాధ్యత జలవనరుల మంత్రిత్వ శాఖ, ఈ శాఖ పరిధిలో ఉన్న సి డబ్ల్యు సి, కె ఆర్ ఎం బి లాంటి సంస్థలపై ఉంది

***

## అధ్యాయం-5

# కృష్ణా నదీ జలాల కేటాయింపులు

బచావత్ ట్రిబ్యునల్ ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రానికి 811 టిఎంసి ల నికర జలాలను గంపగుత్తగా (enbloc or mass allocation) 1976లో కేటాయించింది. ఈ నీటిలో 68% పరివాహక ప్రాంతం కలిగిన తెలంగాణా ప్రాజెక్టులకు ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించిన నీరు 299 టిఎంసి లు(36.86 %). 32% పరివాహకప్రాంతం కలిగిన ఆంధ్ర ప్రాంతం పొందిన నీటి వాటా 512 టిఎంసి లు(63.14 %). ఇది ఉమ్మడి రాష్ట్రంలో కృష్ణా జలాల్లో తెలంగాణాకు జరిగిన అన్యాయం. ఇది ఎవరికైనా చూడగానే కనబడే అన్యాయం. ఇక మరికొంత లోతుగా చూస్తే కొన్ని ఆశ్చర్యకర విషయాలు కనిపిస్తాయి.

ఎక్కువ నీటి కేటాయింపులు జరుపుకోవడమే కాదు విశ్వసనీయ జలాల్లో తమకు ప్రధాన నదిలో విశ్వసనీయత ఎక్కువగా గల నీటిపై వాటా స్థిర పరుచుకొనే ప్రయత్నం చేసింది నాటి ఆంధ్ర ప్రదేశ్, అది కూడా అత్యధికంగా బేసిన్ ఆవలి వినియోగాలకు. తెలంగాణ ప్రాంతం దాదాపుగా 70 శాతం పరీవాహక ప్రాంతం కలిగినా, పున:కేటాయింపులు చేసింది 299 టీఎంసీలు (37%) మాత్రమే. వాటిలో 124 టీఎంసీలు ఇక్కడ పడే వర్షం పైనా, ఇక్కడి వర్షాభావ మరియు ఋతుపవన వర్షపాత మార్పులపైనా ఆధారపడేవే. ఒక విధంగా చెప్పాలంటే, ఎక్కువ పరీవాహక ప్రాంతం కలిగి ఉండడం నిజానికి ఒక వరం కానీ దాన్ని ఒక శాపంలా మార్చారు నాటి పాలకులు.

దేశంలోనే అత్యధిక వర్షపాతం (3,000 మిమీ నుండి 1,000మిమీ) గలిగిన పశ్చిమ కనుమలు కృష్ణా నది పరీవాహక ప్రాంతానికి పశ్చిమ హద్దుగా దాదాపుగా 710 కిలోమీటర్ల పొడవు ఉండి, ఆ వర్షపు నీటిని చిన్నా పెద్దా ఉపనదులు, వాగులు వంకలు కృష్ణా ప్రధాన నదిలోకి తెస్తాయి. ఆ తరువాత దిగువన ఉండే మహబూబ్ నగర్ తదితర ప్రాంతాల్లో వర్షపాతం తక్కువగా ఉండి ఈ ప్రదేశాల నుండి కృష్ణా నదిలోకి నీరు ఎక్కువగా రాదు. ఇక బచావత్ ట్రిబ్యునల్ వద్ద ఉంచిన డిమాండ్లు, ప్రాధాన్యతలు, ఆ తరువాతి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ చేసిన పునఃకేటాయింపులన్నింటి తర్వాత నికర జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలు, ఆంధ్రకు 512 టీఎంసీలు పంపకాలు ఉంటాయి. తెలంగాణకు పంపకం చేసింది కేవలం 299 టీఎంసీలయితే, వాటిలో చిన్న నీటి పారుదల మధ్య తరహా ప్రాజెక్టులకు కలిపి మొత్తం 124 టీఎంసీలు. ఇవి తెలంగాణలో పడే వర్షపాతం పైనే ఆధారపడి ఉంటాయి. సహజంగానే, ఇంతకు ముందు చెప్పినట్లుగా ఇక్కడ వర్షపాతం తక్కువ. ఋతుపవన వర్షపాతానికి సహజంగానే ఇక్కడ అనిశ్చితి ఎక్కువ. ఇక ఆంధ్ర ప్రాంతానికి కేటాయించిన నీరు 512 టీఎంసీల్లో 480 టీఎంసీలు అంటే 94% ప్రాజెక్టులు ప్రధాన కృష్ణా నది మరియు తుంగభద్రా నది పైననే ఉంటాయి. ఈ రెండూ పశ్చిమ కనుమల నుండి బయలుదేరేవే.

ఫలితంగా ఆంధ్ర ప్రాంత ప్రాజెక్టులకు నీటి లభ్యత నికరంగా ఉంటే, తెలంగాణ ప్రాజెక్టులకు విశ్వసనీయత తక్కువ. మహబూబ్ నగర్ లో వలస బాట పట్టిన రైతులు, రైతు కూలీల విషయం మనందరికీ తెలిసిందే. గమనించాల్సిన విషయమేమంటే, ఈ ప్రాజెక్టుల్లో 73% కేటాయింపులు క్రిష్ణా బేసిన్ నుండి బేసిన్ ఆవలకు పెన్నా, గుండ్లకమ్మ తదితర బేసిన్లకు మళ్లించేవే. ఇక ఈ వినియోగాల డిమాండ్సు కు పైన ఇంకా ఏవైనా ఆంధ్ర ప్రదేశ్

చేస్తున్నది అంటే అవి నిస్సందేహంగా 100% బేసిన్ ఆవలకు మళ్లించేవే కదా. అని బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఎదుట ఉంచిన ఆంధ్ర ప్రాంత డిమాండ్లు గానీ, ఆ తరువాత పెంచుకుంటున్న వినియోగాలు, డిమాండ్లు అన్నీ బేసిన్ ఆవలకు మళ్లించేవే. వాటన్నింటి కొరకు మాకు క్రిష్ణా జలాలు మళ్లించుకునే హక్కుంది అని అంటున్నది ఆంధ్ర ప్రదేశ్. (తెలంగాణకు గల హక్కుల గురించి 7వ అధ్యాయంలో విపులీకరించాం) ఇక పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుండి బేసిన్ అవలకు మళ్లించుకునే సామర్థ్యం ఇప్పటికే రోజుకు 4 టీఎంసీలుంటే దాన్ని నేడు 8 టీఎంసీలు చేసుకునేందుకు జీఓ ఇచ్చింది ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం. అది ఎంత వరకు సమంజసం?

### 1950వ దశకంలో తెలంగాణ పరిస్థితి :

1952 నాటికే హైదరాబాదు రాష్ట్రం ప్రతిపాదించి మొదటి పంచవర్ష ప్రణాళికలో కట్టేందుకు సన్నద్ధమైన నందికొండ ప్రాజెక్టుకు, ఆంధ్ర ప్రాంతానికి నీటిని (అధిక భాగం బేసిన్ ఆవలకు) మళ్లించే కుడికాలువను కొత్తగా చేర్చారు.[1] ఈ కుడికాలువ ఆయకట్టు దాదాపుగా 1951 నాటి కృష్ణా పెన్నార్ ప్రాజెక్టు ఆయకట్టే. ఇది ఖోస్లా కమిటీ (1953) సిఫార్సు ఆధారంగా జరిగింది. ఈ కృష్ణా పెన్నా ప్రాజెక్టు ఆయకట్టు దాదాపుగా అంతా నందికొండ ప్రాజెక్టుకు మార్చినాక కృష్ణా పెన్నా లింక్ కెనాల్ ఇక అక్కర లేదు అని సిఫార్సు చేసింది ఖోస్లా కమిటీ. అందువల్లనే శ్రీశైలం ప్రాజెక్టును కేవలం జల విధ్యుత్ ప్రాజెక్టుగా చూపి ప్లానింగ్ కమిషన్ అనుమతి సంపాదించింది నాటి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం. అయితే ఆ తరువాత బచావత్ ట్రిబ్యునల్ వద్ద క్రిష్ణా పెన్నా లింక్ కెనాల్ సిస్టమ్ నే సంగమేశ్వరం కెనాల్స్ పేరుతో అంతకుముందు కృష్ణా పెన్నార్ ప్రాజెక్టులో లేని ఆయకట్టును కూడా చాలా ఎక్కువ మొత్తంలో అదనంగా చేర్చి డిమాండ్సు ఉంచారు. బచావత్ ట్రిబ్యునల్ శ్రీశైలం నుండి ఏ విధమైన కెనాళ్లను అనుమతించలేదు. కానీ, ఈ కృష్ణా పెన్నార్ లింక్ సిస్టమ్‌ను కూడా ఏదో ఒక విధంగా సాధించుకోవాలన్న ఆంధ్ర ప్రభుత్వాల తాపత్రయం నిరంతరంగా కొనసాగి నేడు జీఓ 203 కు చేరుకుంది. పోతిరెడ్డిపాడు సిస్టం పరిణామక్రమం గురించి ముందటి అధ్యాయంలో విపులీకరించే ప్రయత్నం చేశాం.

హైదరాబాదు రాష్ట్రంలో ప్రధాన కృష్ణా నది, మరియు పశ్చిమ కనుమల్లోనే పుట్టిన భీమా, తుంగభద్ర నదులపై భారీ నీటి పారుదల ప్రాజెక్టులను ప్రతిపాదించుకొన్న తెలంగాణ ప్రాంతం, 1956 తరువాత ఆంధ్ర ప్రభుత్వాల నిరాసక్తత వల్ల ఆ ప్రాజెక్టులను కోల్పోయింది. తెలంగాణ ఇక్కడే పడే అనిశ్చిత వర్షపాతంపై ఆధార పడాల్సి వచ్చింది. ఈ పరిస్థితులను ముందే ఊహించిన మన పెద్దలు ఫజల్ అలీ కమిషన్ (1955) ముందు చెప్పిన విషయాన్ని "తెలంగాణ తనకు ప్రస్తుతమున్న ఒక రాష్ట్రంగా క్రిష్ణా గోదావరి జలాల వినియోగంపై గల స్వతంత్ర హక్కులను వదులుకోదల్చుకోలేదు." అని పేర్కొన్నది. అట్లాగే ఆంధ్ర రాష్ట్రం నాడు విశాలాంధ్ర ఏర్పాటు చేయాలని కోరుతూ "ఒకవేళ తెలంగాణ కు గల స్వతంత్ర రాజకీయ అధికార పరిధి నుండి లేకుండా చేస్తే" క్రిష్ణా గోదావరి నదులపై తూర్పున ప్రాజెక్టులను కట్టుకోగలుగుతామని ఆశిస్తున్నారని పేర్కొన్నది. ఆ కమిషన్ తెలంగాణ ను ఆంధ్ర రాష్టంతో విలీనం చేయవద్దని సిఫార్సు చేయడమూ, అయినా కేంద్రం ఆంధ్ర ప్రదేశ్ ను 1956 లో ఏర్పాటు చేయడమూ జరిగిపోయాయి.

---

1. ఈ కారణం చేతనే బచావత్ ట్రిబ్యునల్ ఎదుట కుడికాలువతోపాటు ఎడమ కాలువకు కూడా నీళ్ళు ఇవ్వాలని అడగక తప్పని పరిస్థితి ఆంధ్రప్రదేశ్‌కు ఉండింది. ఆ విధంగా తెలంగాణకు ప్రధాన కృష్ణా నదిపై నాగార్జునసాగర్ ఎడమ కాలువ రూపాన కొంత నీళ్ళ కేటాయింపు జరిగింది.

ప్రాజెక్టుల హెడ్ వర్క్స్ కర్నాటకలో ఉండిపొయ్యాయి, ఆయకట్టు తెలంగాణలో ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు కేంద్రాన్ని ఆ విషయమై పట్టు పట్టలేదు. పర్యవసానంగా, తెలంగాణ ఆయకట్టు హైదారాబాదు రాష్ట్రం ప్రతిపాదించిన మేజర్ ప్రాజెక్టుల కింద సాగునీటి సదుపాయం కొల్పోయింది. బచావత్ ట్రిబ్యునల్ ఎదుట ఆంధ్ర ప్రాంత ప్రయోజనాలే పరమావధిగా వాదించాయి ప్రభుత్వాలు. ట్రిబ్యునల్ చారిత్రక తదితర రక్షణల కింద మూడు రాష్ట్రాలు అంగీకారానికి వచ్చిన ప్రాజెక్టులను పరిగణలోకి తీసుకుంటూ కేటాయించినాక, మిగిలిన నీటిని 1973 లో సమన్యాయ సూత్రాల ప్రకారం (equitable apportionament) చేయాలని సంకల్పించింది. అప్పుడు కూడా నాటి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఆంధ్ర ప్రాంతాల ప్రాజెక్టులకే ప్రాధాన్యతనిస్తూ డిమాండ్లు ట్రిబ్యునల్ ముందుంచింది. ఆ సందర్భంలో బచావత్ ట్రిబ్యునల్ సానుభూతితో జూరాల ప్రాజెక్టుకు 17.84 టీఎంసీలు కేటాయిస్తూ చేసిన ఈ వ్యాఖలు చూద్దాం "The State of Andhra Pradesh, no doubt, has been allocated enough water for historical reasons, but still Telangana part of the State of Andhra Pradesh stands in need of irrigation. The area which we are considering for irrigation formed part of Hyderabad State and had there been no division of that State there were better chances for the residents of this area to get irrigation facilities in Mahboobnagar District. We are of the opinion that this area should not be deprived of the benefit of irrigation on account of the reorganisation of States". ఇక బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఎదుట జరిగిన వాదనలు పరిశీలిస్తే, నిజానికి ఈ ట్రిబ్యునల్ కూడా నాటి ఆంధ్ర ప్రదేశ్ వాదనల వల్ల కాదు, కేవలం సానుభూతితోనే జూరాల ప్రాజెక్టుకు అదనంగా 9 టీఎంసీల నీటిని కేటాయించిందనడంలో సందేహం అవసరం లేదు.

### మిగులు జలాలపై ప్రాజెక్టులు :

నేడు అమలులో ఉన్న ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం ఎగువ రాష్ట్రాలకు 75% డిపెండబిలిటీ వద్ద కేటాయించిన నికర జలాలు వాడుకున్నాక దిగువకు వచ్చే నీళ్ళను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వాడుకునే వెసులుబాటు ఉంది. కానీ వాటిపై హక్కు మాత్రం ఉండదు. ఆ వెసులుబాటు (liberty) కూడా భవిష్యత్తులో ఏర్పాటయ్యే ట్రిబ్యునల్ పునఃపంపిణీ (రివ్యూ) చేసి మార్చవచ్చు. ఈ వెసులుబాటు ఆధారంగానే ఉమ్మడి రాష్ట్రంలో పలు ప్రాజెక్టులను నాటి రాయలసీమ, తెలంగాణ ప్రాంతాల్లో ప్రతిపాదించడానికి ఆస్కారం లభించింది. తెలంగాణలో కల్వకుర్తి లిఫ్ట్ స్కీం (MGKLIS), నెట్టెంపాడు లిఫ్ట్ స్కీం (NKLIS), శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (SLBC) టన్నెల్ స్కీం, పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ స్కీం, డిండి లిఫ్ట్ స్కీం, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో హంద్రీ-నీవా సుజల స్రవంతి (HNSS), గాలేరు - నగరి సుజల స్రవంతి (GNSS), వెలిగొండ టన్నెల్ స్కీం మరియు తెలుగుగంగ ప్రాజెక్టు (TGP) లు. ఇవి కాకుండా శ్రీశైలం కుడి బ్రాంచి కాలువ (SRBC) అనే బేసిన్ ఆవలి ప్రాజెక్టుకు నికర జలాలు దొడ్డిదారిన కేటాయించి ప్లానింగ్ కమిషన్ అనుమతి పొందింది నాటి ప్రభుత్వం. వీటిలో నెట్టెంపాడు తప్ప మిగిలినవన్నీ శ్రీశైలం రిజర్వాయర్ నుండి నీటిని మళ్లించేవే. ఈ అయిదు ఆంధ్ర ప్రాజెక్టులలో SRBC, GNSS మరియు TGP లు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ మరియు ఎస్ఆర్ఎంసి ద్వారా నీటిని మళ్లించుకుంటాయి. ఈ కేటగిరీలో లేని తుంగభద్ర నదిపైనున్న సుంకేసుల వద్ద నుండి బయలుదేరే కేసి కెనాల్ ను కూడా మెల్ల మెల్ల గా శ్రీశైలం ప్రాజెక్టు కింది ప్రాజెక్టుగా మారుస్తూ, చాలావరకు పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ కిందకు చేర్చి కూడా నీటిని వాడుతున్నారు.

కృష్ణా బేసిన్ లో ఉన్న పరివాహక ప్రాంత రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రాజెక్టుల డిమాండ్స్ లలో సరియైనవిగా భావించిన (worth consideration) వాటిని పరిగణలోకి తీసుకొని వాటన్నింటినీ

రాష్ట్రాల పరంగా కలిపి ఆ మొత్తాలను గంపగుత్తగా (enbloc or mass allocation) రాష్ట్రాలకు కేటాయించడం జరిగింది. ఈ కేటాయింపులు ఏ ప్రాజెక్టులకు ముడిపెట్టి ఇవ్వ లేదు. రాష్ట్రాలు తమకు కేటాయించిన మొత్తానికి మించకుండా నీటిని ఎక్కడైనా ఎట్లైనా వాడుకోవచ్చు అని ట్రిబ్యునల్ స్పష్టం చేసింది. అందువల్లనే, రాష్ట్ర విభజన తరువాత ఆ గంపగుత్త కేటాయింపును, ప్రాజెక్టుల వారీగా, రెండు తెలుగు రాష్ట్రాలకు కేటాయింపులు చేయాలని ప్రస్తుత కృష్ణా ట్రిబ్యునల్–II (బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్) కు రిఫర్ చేయడం జరిగింది. అయితే ఆ తరువాత జరిగే కేటాయింపులను కూడా తెలంగాణ మరియు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలు తమ తమ రాష్ట్రాల్లో తమకు కేటాయించిన మొత్తం మించకుండా ఎక్కడైనా ఎట్లైనా వాడుకునే వెసులు బాటు ఉండక తప్పదు. రాష్ట్ర విభజన వల్ల ఏర్పడ్డ కృష్ణా బోర్డు వద్ద ఇరు రాష్ట్రాల మధ్య ఒక తాత్కాలిక అవగాహన అవసరాన్ని గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చేసిన ప్రాజెక్టుల పరమైన తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాలకు కేటాయించిన 299 మరియు 512 టీఎంసీలు (మొత్తం రెండు రాష్ట్రాలకు కలిపి 811 టీఎంసీలు) అదే నిష్పత్తిలో వాడుకోవాలన్న ఆలోచనను అంగీకరించింది. పర్యవసానంగా ఏర్పడిన తాత్కాలిక ఒప్పందం ద్వారానే నేడు 299 మరియు 512 లకు మించకుండా తెలంగాణ మరియు ఆంధ్ర ప్రదేశ్ లు ఆయా ప్రాజెక్టుల వద్ద వాడుకుంటున్నాయి. అందువల్లనే నేడు ఆంధ్ర ప్రదేశ్, నాగార్జునసాగర్, ప్రకాశం బ్యారేజీల వద్ద కాకుండా పోతిరెడ్డిపాడు, హెచ్ఎన్ఎస్ఎస్ తదితరాల వద్ద నుండి వాడుకోగలుగుతున్నది. అట్లాగే, తెలంగాణ తన ప్రాజెక్టుల వాటాలోంచి కల్వకుర్తి, నెట్టెంపాడు, ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు తదితరాల వద్ద వాడుకోగలుగుతున్నది. ఈ నిష్పత్తిలో ఇరు రాష్ట్రాలు వాడుకోవడం తాత్కాలికం. ప్రస్తుత ట్రిబ్యునల్ తన తీర్పు ఇచ్చేవరకు మాత్రమే అని గమనించాలి. అయితే ఈ వెసులుబాటును, తనకు గల ఇతర కృష్ణా జలాలకు సంబంధించి చేసుకున్న పునఃకేటాయింపులను తనకు శాశ్వత ప్రాతిపదికన నికర జలాల కేటాయింపులు చేసుకొనే ప్రయత్నంలో భాగంగానే ఈ జీఓ 203 ఆంధ్ర ప్రదేశ్ ఇచ్చింది అని అర్థమవుతున్నది.

***

అధ్యాయం-6

# నదీ జలాల పంపిణీ : జాతీయ, అంతర్జాతీయ న్యాయ సూత్రాలు

1966 హెల్సింకి రూల్స్ నుండి మొదలుకొని నేడు అమలులో ఉన్న యునైటెడ్ నేషన్స్ వాటర్ కోర్సెస్ కన్వెన్షన్ (UNWC),1997 వరకు నీటి వినియోగాల్లో బేసిన్లోని ప్రాంతాలకు సమన్యాయం మరియు సహేతుకత (equitable and reasonable utilisations) ఆధారంగా నీటి కేటాయింపులు ఉండాలని నిర్దేశిస్తున్నాయి. కానీ, కృష్ణా నదీజలాలను ఏ విధమైన సహజ న్యాయసూత్రాలు గానీ, అంతర్జాతీయ న్యాయ సూత్రాలు గానీ పట్టించుకోకుండా, భిన్న వాదాలతో కేవలం ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల ప్రయోజనాలే ప్రాధాన్యంగా పరిగణించి నాటి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వాలు తెలంగాణ ప్రాజెక్టుల విషయంలో తీవ్ర వివక్ష చూపించాయి.

తెలంగాణ రెండు రకాలైన సమస్యలు ఎదుర్కొంటున్నది. ఒకటి, ఇప్పటికే ఉన్న వినియోగాలు అట్లాగే ఉంచాలనే వాదన. మరొకటి, బేసిన్ ఆవలకు మరల్చుకొనేందుకు తమకు బేసిన్ లోని ఆయకట్టుతో సమాన ప్రతిపత్తి ఉంది అనే వాదన. ఈ రెండింటిని జాతీయ అంతర్జాతీయ న్యాయ సూత్రాల పరంగా, నెలకొన్న పరిస్థితుల పరంగా విశ్లేషించే ప్రయత్నం చేద్దాము.

**వినియోగాల రక్షణలు (Protection of existing uses) :**

తెలంగాణ పరంగా చూస్తే, 1948 లో హైదరాబాదు రాజ్యం భారత దేశంలో విలీనమై 1956 లో రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా హైదరాబాదు రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేసి తెలంగాణను ఆంధ్ర రాష్ట్రంతో విలీనం చేయడం తెలంగాణకు ఒక దురదృష్టకర పరిణామం. 1956 లో అంతర్రాష్ట్ర నదీ జలాలకు సంబంధించి పార్లమెంటు చేసిన రెండు చట్టాల్లో, రివర్ బోర్డుల చట్టం కంటే అంతర్రాష్ట నదీ జల వివాదాల చట్టానికి ఎక్కువ ప్రాధాన్యత ఈయడం వలన నదులకున్న సహజమైన హైడ్రోలాజికల్ నదీ బేసిన్ ఏకత్వం దెబ్బ తిన్నది. అంతర్రాష్ట నదీ జల వివాదాల చట్టం, 1956 ప్రకారం కేవలం రాష్ట్రాలే జల వివాదాలను కేంద్రానికి ఫిర్యాదు చేయగలవు తప్ప, రాష్ట్రాల్లోని ప్రాంతాలు గానీ, ప్రజా సమూహాలు గానీ చేయలేవు. సుప్రీం కోర్టు కూడా అంతర్రాష్ట్ర జల వివాదాలను మొదటగా స్వీకరించదు. అంతర్రాష్ట నదీ జల వివాదాల చట్టం, 1956 ప్రకారం కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాల ఫిర్యాదుపై ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి పరిష్కరించాల్సిన అంశాలను నివేదిస్తుంది.

ఒక నది బేసిన్ అనేది ఒక నిర్ధిష్టమైన ఎల్లలు గలిగి ఆ బేసిన్ (పరివాహక ప్రాంతం) లో పడిన వర్షపాతం భూ ఉపరితలంపై పారుతూ ఆ నదిని నేరుగా గాని, ఉపనదుల ద్వారా గానీ చేరుతుంది. రాజ్యాల, రాష్ట్రాల సరిహద్దులు మారవచ్చు గాని నది బేసిన్ సరిహద్దులు ఎప్పుడూ మారవు. అందుకే, నది బేసిన్ల పరంగా దేశంలో యూనిట్లు ఏర్పడి ఉంటే ఒక ఇంటిగ్రేటెడ్ అభివృద్ధి నమూనా తయారీ, అమలు సరిగా సాధ్యమయ్యేది. అయితే, దేశంలో భిన్న చారిత్రక, రాజకీయ, భాషా సాంస్కృతిక కారణాల వల్ల రాష్ట్రాల సరిహద్దులేర్పడ్డాయి. ఆ సరిహద్దులు అనేక కారణాల వల్ల మార్పులు చేర్పులకు లోనయ్యాయి. నదీ బేసిన్ అథారిటీ లను ఏర్పాటు చేయాలని 1950

వ దశకం నుండి ప్రయత్నాలు జరుగుతున్నా సాధ్యం కాలేదు. ఇప్పుడు భాషా ప్రయుక్త రాష్ట్రాలేర్పడి, బేసిన్ల ప్రాతిపదికన కాకుండా రాష్ట్రాల ప్రాతిపదికన నది జల వివాదాల ట్రిబ్యునల్ళు ఏర్పడి నది జలాల కేటాయింపులు జరిపినాక నేడు నదీ బేసిన్ అథారిటీలు తెస్తే కూడా తెలంగాణ లాంటి రాష్ట్రాలకు ఒనగూడేదేమీ లేదు. ఏ అథారిటీలయినా ట్రిబ్యునల్ల కేటాయింపులకు లోబడే నడుచుకోవాల్సి వస్తుంది.

తెలంగాణ ఒక ప్రాంతంగా, కేవలం 33 శాతం జనాభా (1956లో) కలిగిన రాజకీయంగా ఒక మైనారిటీ ప్రాంతంగా తనకు నది జలాల పరంగా జరుగుతున్న అన్యాయాలను సరిదిద్దుకోలేని పరిస్థితి ఉండింది. కేంద్ర ప్రభుత్వాలు, ప్లానింగ్ కమిషన్ వంటి సంస్థలు కూడా రాష్ట్రంలోని ప్రాంతాలకు జరుగుతున్న వివక్షను పట్టించుకోలేదు. అవి రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని ప్రాంతాలను సమానంగా చూస్తాయనే భావించాయి.

ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం కృష్ణా నది బేసిన్ లోని తెలంగాణ అవసరాలకంటే బేసిన్ ఆవలి ఆంధ్ర ప్రాంత అవసరాలకు అధిక ప్రాధాన్యమీయడానికి నాడు దేశంలో ఉన్న ఆర్థిక రాజకీయ పరిస్థితులు, రాష్ట్రానికి కేంద్రానికి మధ్య ఉన్న రాజకీయ సంబంధాలు తదితర అంశాలు ప్రభావాన్ని చూపాయి.

**నీటి వినియోగంలో సమన్యాయ భావన** :

నదీజలాల వినియోగంలో సమన్యాయం కావాలనే ఒక ప్రధాన డిమాండ్ తో ఆరు దశాబ్దాల నిరంతర పోరాటం తరువాత తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు 2014 లో జరిగింది. ఆంధ్ర ప్రదేశ్ పునర్విభజన బిల్, 2014 ను పార్లమెంటులో ప్రవేశపెట్టిన Statement of Objects and Reasons"లో The creation of a separate State of Telangana for the betterment of the social, economic, political and other aspirations of the people of that region has been a long standing demand" అని పేర్కొన్నది. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు ప్రధానంగా కృష్ణా, గోదావరి జలాల వినియోగంతో ముడిపడి ఉన్నాయి. ఈ సందర్భంగా... "సమన్యాయ వాటా ప్రకారం ఒకసారి కేటాయించినవి తరువాతి కాలంలో సమన్యాయ వాటాగా ఉండవు, ఉండాల్సిన అవసరం లేదు" అని ఇండస్ కమిషన్ 1942 లో స్పష్టం చేసిన మాటలు గుర్తుకు తెచ్చుకోవాలి. మారిన పరిస్థితుల్లో ఒక ప్రాజెక్టులో అంతవరకు వినియోగించిన నీళ్ళు సర్వకాల సర్వావస్థల్లో అట్లాగే వినియోగించడం సాధ్యం కాదని కృష్ణా ట్రిబ్యునళ్ళు (బచావత్ & బ్రిజేష్ కుమార్) కూడా అభిప్రాయాలు వ్యక్తం చేశాయి. బచావత్ ట్రిబ్యునల్ ప్రస్తుతమున్న వినియోగాలకు 'రక్షణ' (protections) ఇవ్వడాన్ని గురించి అభిప్రాయం వ్యక్తం చేస్తూ, ప్రస్తుత వినియోగాలకు రక్షణలు అట్లాగే కొనసాగించాలని గానీ, భవిష్యత్తులో మార్చకూడదన్నది గానీ మా ఉద్దేశ్యం కాదు అని స్పష్టం చేసింది.

బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ పేజీ 181 లో వెలిబుచ్చిన అభిప్రాయాలు చాలా స్పష్టంగా ఉన్నాయి. "..In determining the equitable share of the States, all the factors which create equities in favour of one State or the other have to be weighed as at the date when the current controversy is mooted. But population, engineering, economics, irrigation and other conditions constantly change and with changing conditions new demands for water continually arise. **A water allocation may become inequitable when the circumstances, conditions and water needs upon which it was based are substantially altered**". (Emphasis suppliedby KWDT-II). Thus KWDT-I found it prudent to make a provision for review after a lapse of certain given time i.e. after 31st May, 2000."

నేడున్న ఆంధ్ర ప్రదేశ్ ఇప్పటివరకు తాము వాడుతున్నట్లుగానే ఇక ముందు కూడా కృష్ణా నది నీటిని వినియోగించుకుంటామని, వాటిలో ఏ మార్పు చేయరాదని, ఇంకా నిర్మాణంలో ఉన్న తమ ప్రాజెక్టులకు నీటి అవసరాలకు ఏ విధమైన భంగం వాటిల్ల రాదని, ఇంకా తాము ఇబ్బడి ముబ్బడిగా పెంచుకుంటున్న వినియోగాలన్నింటికీ ప్రాధాన్యత ఇవ్వాల్సిందే అని వాదిస్తున్నది. ఇట్లా ఇప్పటికే ప్రాజెక్టులు కట్టుకొని, ఇంకా ప్రాజెక్టులు కట్టుకుంటున్న రాష్ట్రం వాటికి నీటి లభ్యత అలాగే కొనసాగాలని, కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రం ఏవైనా ప్రాజెక్టులు చేపడితే మా నీటి లభ్యతకు భంగం వాటిల్ల రాదని వాదించడం సరికాదని అంతర్జాతీయ నదీజలాల న్యాయ సూత్రాలపై జరిగిన చర్చలు స్పష్టం చేస్తున్నాయి. లేకుంటే, ఇప్పటికే వినియోగాలేర్పరుచుకున్న రాష్ట్రం (early developers), ఒక కొత్త రాష్ట్రాన్ని (late developers) ఎప్పటికీ కొత్తగా ప్రాజెక్టులను కట్టుకోనివ్వదు.

## బేసిన్ రాష్ట్రాల నీటి వినియోగ హక్కులు:

అంతర్జాతీయ న్యాయసూత్రాల్లోని మొదట వినియోగదారులకు వాళ్లకు రక్షణ అనే అంశాలను మార్చాలని అంతర్జాతీయ జలాల న్యాయ నిపుణులు కయి వేగేన్ రిచ్ మరియు ఆలివర్ ఒల్సోన్ లు తమ Late developers and the inequity of 'equitable utilization' and the harm of 'do no harm"(2010) అనే వ్యాసంలో స్పష్టం చేశారు. లేనట్లైతే మొదటి వినియోగదారులు ఎల్లప్పుడూ అసమర్థంగా వ్యర్థంగా వినియోగిస్తున్నప్పటికీ అది కొనసాగుతూనే ఉంటుంది అని నిరసించారు. "Protecting the first developer within the international rules institutionalizes the inequity between riparian states, and therefore the rules are hindering late developing states from utilizing water resources and at the same time allowing the first developers to continue using the water resources (even in an ineffiient or wasteful manner). Hence today, late developers have even less incentive to subscribe to these international rules. Given the international agenda on poverty reduction, the Millennium Development Goals, it is arguable that the existing recommendation on the sharing of international rivers should be revised so as not to favour the early developers but to have a more holistic perspective."

1961 లో ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ, పాకిస్తాన్ ప్రెసిడెంట్ అయూబ్ ఖాన్‌కు రాసిన లేఖల్లో గంగానది విషయమై (అప్పటికింకా బంగ్లాదేశ్ పాకిస్తాన్ లో అంతర్భాగమే) చారిత్రక వినియోగాలను సాకుగా చూపిస్తూ రైపేరియన్ హక్కులున్నాయని ఏకపక్షంగా ప్రాజెక్టు వినియోగాలను పెంచుకుంటూ పోయి మా రైపేరియన్ హక్కులను పరిగణించకుండా మా అభివృద్ధిని, వినియోగాలను పూర్తిగా నిరోధిస్తామంటే అది మేము ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించం అని స్పష్ట పరిచారు. అట్లా రైపేరియన్ హక్కుల మాటున భవిష్యత్తులో మరో రైపేరియన్ దేశం ఏ విధమైన వినియోగాలు చేపట్టకుండా నిరోధించడాన్ని ఆనాడే నెహ్రూ గారు గుర్తించారని ప్రపంచ బ్యాంకు అంతర్జాతీయ నదీ జలాల న్యాయ సలహాదారు ఎంఏ సల్మాన్ తన "ది కాన్సెప్ట్ ఆఫ్ ఫోర్ క్లోజర్ ఆఫ్ ఫ్యూచర్ యుజెస్"(2010) అనే సిద్ధాంత వ్యాసంలో పేర్కొన్నారు. ఆ వ్యాసంలో ఆయన హెల్సింకి న్యాయసూత్రాల వలెనే యునైటెడ్ నేషన్స్ వాటర్ కోర్సెస్ కన్వెన్షన్,1997 లో కూడా సమన్యాయం మరియు సహేతుకత అనేది మూలాధార సూత్రంగా ఉండి, అదే అంతర్జాతీయ జల న్యాయంగా ఏర్పడింది అని స్పష్టం చేశారు. "similar to the Helsinki Rules, the principle of equitable and reasonable utilization is the fundamental and guiding principle of the UN Water

courses Convention, and consequently, of international water law."

అంతర్జాతీయ జలాల న్యాయ కోవిదుడు, ప్రొఫెసర్ చార్లెస్ బౌర్న్ అదే విషయాన్ని చెపుతూ, ప్రస్తుతమున్న వినియోగాలు అనేది అనేక నది జలాల కేటాయింపులో పరిగణలోకి తీసుకోవాల్సిన అంశాల్లో ఒక అంశం మాత్రమే అని స్పష్టం చేశారు. "a state is always entitled to 'a reasonable and equitable share in the beneficial uses of the waters of an international drainage basin', and 'the past utilizations of the waters of the basin, including in particular existing utilization' is only one of the many other factors to be taken into account in the determination of its share"

అంతర్జాతీయ జలాల న్యాయ నిపుణుడు మరియు యునైటెడ్ నేషన్స్ అంతర్జాతీయ లా కమిషన్ మెంబర్ గా పనిచేసిన ప్రొఫెసర్ ఎల్. కాఫ్లిష్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ, ఒకవేళ సమన్యాయం మరియు సహేతుకత (equitable and reasonable utilisations) అనేది నదీజలాల వినియోగాల్లో పాటించక పోతే, కొత్త ఆర్థిక మరియు సామాజిక అభివృద్ధి చేయాలనుకొనే వారు ఎప్పటికీ చేయలేరు, ఎల్లప్పుడూ ముందుగా వినియోగాలను చేపట్టిన వారి పక్షానే వినియోగాలుంటాయి అన్నారు. "if the no-harm rule were to prevail over the principle of equitable and reasonable utilization, it would heavily advantage lower riparians and disadvantage upstream states, and "the economic and social growth of any newcomer, in particular upstream countries, would be stunted".

నాటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వాలు. మొదట ఏదో విధంగా ప్రాజెక్టులను కట్టి వేసి ఆ తరువాత వాటి వినియోగాలను కొన్ని సంవత్సరాల తర్వాత ఇప్పటికే వాడుకలో ఉన్న(historical), స్థిర పడ్డ వినియోగాలు (established utilisations) గా హక్కులు అడగడం ఒక వ్యూహంగా ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టుల పర్వం సాగింది. సామాన్య ప్రజానీకం ఎవరైనా అమాయకంగా, అరే! ఇన్ని సంవత్సరాలనుండి వాడుతున్న వాళ్ళను ఎట్లా కాదంటారు, వాళ్ళకు నీటి కేటాయింపులు చేయడం సమంజసమే కదా అంటారు. కానీ కృష్ణా నది బేసిన్లోనే ఉన్న, తెలంగాణ ప్రాంతాలకు నీరందించే ప్రాజెక్టులను కుదించి వేసి, కావాలని అసలు మొదలే పెట్టక, మొదలు పెట్టినా ఏదో ఒక సాకుతో సాగదీస్తూ, నాన్చుతూ పూర్తి చేయకపోవడం వల్ల ఎప్పటికీ ఆ ప్రాజెక్టులకింద ఆయకట్టు వినియోగంలోకి రాక స్థిరపడ్డ వినియోగాలుగా చెప్పలేని పరిస్థితి ఏర్పడిందనే విషయం ప్రజలకు వెంటనే అర్థంకాదు.

**బేసిన్ ఆవలికి మళ్లింపులు (Outside basin transfers) :**

కృష్ణా బేసిన్ నీటి కొరత గల బేసిన్. ఈ బేసిన్ నుంచి మరొక బేసిన్ నీటిని మళ్లించడం ఏ విధంగానూ సమర్థనీయం కాదు. "ఒకవేళ నీటి అవసరాలకు కొరత ఉన్నట్లైతే నది బేసిన్ పరిధి ఒక ఖచ్చితమైన ప్రదేశాన్నిస్తుంది, ఆ పరిధిలో నీటిని నిర్ణీత పద్ధతిలో కేటాయింపులు చేసుకోవాలి. లేకుంటే ఆ కొరత గల నీటి గురించిన డిమాండ్స్ కు ఒక అంతం ఉండదు." అని ప్రముఖ ఇంజనీర్, క్రిష్ణా-గోదావరి కమిషన్ ఛైర్మన్, ఎన్.డి. గుల్హాటీ స్పష్టం చేశారు. "In case of scarcity of water in relation to requirements, the watershed boundary provides a definite area within which to ration the waters; otherwise there would be no end to the claims that may be made on the scarce resource."

ఆంధ్ర ప్రదేశ్ బేసిన్ ఆవలికి మళ్లించే డిమాండ్సు ను పరిగణలోకి తీసుకోవద్దని కర్ణాటక, మహారాష్ట్రలు గట్టిగా కోరాయి. బచావత్ ట్రిబ్యునల్ జాతీయ అంతర్జాతీయ న్యాయ సూత్రాలను, న్యాయకోవిదుల అభిప్రాయాలను విస్తృతంగా, క్షుణ్ణంగా పరిశీలించినాక "బేసిన్ లోని ప్రాంతాలు బేసిన్ ఆవలి ప్రాంతాలకంటే ఆ నీటిపై ఎక్కువగా ఆధార పడి ఉంటాయి. బేసిన్లోని ప్రాంతాల అత్యంత ఆవశ్యక అవసరాలను పట్టించుకోకుండా వేరెక్కడో అభివృద్ధిని అనుమతిస్తే గరిష్ట ఆర్థిక ప్రయోజనం సాధ్యం కాదు" అని స్పష్టం చేసింది. అయితే, ఇప్పటికే బేసిన్ ఆవలి ప్రాంతాలకు నీటిని తరలిస్తూ ఉంటే, వాటిపై ఆధారపడ్డ ఆర్థిక వ్యవస్థ ను తేలికగా భగ్నపరచవద్దు అని అభిప్రాయపడింది.

ఇట్లా బేసిన్ ఆవల ఇప్పటికే ఎన్నో సంవత్సరాలుగా ఉన్న వినియోగాల దృష్ట్యా, అంతర్రాష్ట్ర జలవివాదాల చట్టం లోని సెక్షన్-3 ప్రకారం రాష్ట్రాన్ని ఒక యూనిట్ గా పరిగణించడం మరియు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వాల భాధ్యత లాంటి విషయాలన్నింటిని బేరీజు వేసిన బచావత్ ట్రిబ్యునల్ తుదకు తన నిర్ణయంలో, బేసిన్ ఆవలికి నీటిని తరలించడం చట్ట పరంగా సమ్మతమే అని పేర్కొంది. కానీ, ఈ విధంగా బేసిన్ ఆవలికి చేసే కేటాయింపులు చట్టసమతమైనా, భవిష్యత్తు వినియోగాలకు న్యాయమైన కేటాయింపులు (equitable allocation) చేస్తున్నప్పుడు అధిక ప్రాధాన్యత బేసిన్లోని వినియోగాలకు ఇవ్వాలి అని స్పష్టం చేసింది (పేజీ 128, బచావత్ రిపోర్టు).

బచావత్ ట్రిబ్యునల్ వెలుబుచ్చిన ఈ అభిప్రాయం ప్రకారం, ఆనాడు చారిత్రకంగా వాడుతున్న కృష్ణా డెల్టా సిస్టం అని చెప్పబడే ప్రకాశం బ్యారేజీ ఆయకట్టు, కేసి కెనాల్ ఆయకట్టుల వాస్తవ వినియోగాలు మాత్రమే ప్రధాన కృష్ణా నదిపై నాడున్న వినియోగాలుగా రక్షణకు అర్హమవుతాయి. మిగిలినవన్నీ, బేసిన్లోని ప్రాజెక్టులకు ప్రాధాన్యతనిచ్చి న్యాయమైన కేటాయింపులకు అర్హమౌతాయి. కానీ, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ వాదనలు ప్రధాన కృష్ణా నది నుండి బేసిన్ ఆవలి ఆయకట్టుకు ఎక్కువ కేటాయిపులుండే విధంగా సాగింది. తెలంగాణకు తీరని నష్టం జరిగింది.

బచావత్ ట్రిబ్యునల్ తన రిపోర్టులో పరిగణలోకి తీసుకొన్న కొన్ని ప్రముఖ అభిప్రాయాలు చూద్దాం. ప్రముఖ అంతర్జాతీయ జలాల న్యాయ నిపుణుడు ఎల్.ఏ. టెక్లాఫ్, 1973లో, UN ఇంటర్-రీజనల్ సెమినార్ ఆన్ కరెంట్ ఇష్యూస్ ఆఫ్ వాటర్ రిసోర్సెస్ లో "బేసిన్ లోని భవిష్యత్ అవసరాలకు బేసిన్ ఆవలి ప్రస్తుత వినియోగాలకంటే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది" అని బలంగా వాదించారు.

ప్రముఖ ఇంజనీర్ ఎన్.డి. గుల్హాటి, తన అంతర్రాష్ట్ర నదుల అభివృద్ధి, లా అండ్ ప్రాక్టీస్ అనే పుస్తకం (పేజీ 93) లో "నది బేసిన్ లోని ప్రాంతాలకు ఆ నది జలాలపై మొదటి యాజమాన్య హక్కు ఉంటుంది. బేసిన్ ఆవలి ప్రాంతాలు ఒక వేళ ఈ జలాలను మళ్లించుకోవాలంటే బేసిన్లోని ప్రాంతాల అవసరాలు పూర్తిగా తీరిన తర్వాత ఆ పైన లభించే జలాలను మాత్రమే" అంటూ, "ఏ సాగునీటి అవసరమైనా బేసిన్ అవసరాలను కాదని, బేసిన్ ఆవలికి పరిగణిస్తే, ఇప్పుడైనా ముందు ముందైనా అవాంఛనీయ ఉపద్రవాలకు దారితీయవచ్చు" అని హెచ్చరించారు. (పేజీ 127, KWDT-I Report)

ఖోస్లా కమిటీ (1952), గోదావరి నుండి క్రిష్ణా నదికి జలాల మళ్లింపుపై తన అభిప్రాయం వ్యక్తం చేస్తూ, గోదావరి జాలాల పై గోదావరి బేసిన్ ప్రాంతాలకే మొదటి యాజమాన్య హక్కులుంటాయి, గోదావరి బేసిన్ అవసరాలు కంటే ఎక్కువున్న నీళ్ళను మాత్రమే క్రిష్ణా బేసిన్ కు మళ్లించడానికి అనుమతించాలి అని పేర్కొన్నారు (పేజీ 127, KWDT-I Report).

ఇవన్నీ పరిశీలించిన బచావత్ ట్రిబ్యునల్ బేసిన్లోని అవసరాలు తీరినాకనే బేసిన్ అవలకు నీటిని మళ్లించాలని అధికతర అభిప్రాయం ఉంది అని పేర్కొంది.

కృష్ణా ట్రిబ్యునల్లు బేసిన్ ఆవలి మరియు బేసిన్ లోపలి వినియోగాలను ఒకే విధంగా పరిగణించాయి అని కొన్ని విశ్లేషణలు చెప్పుతున్నది సరికాదు. "ఈ ట్రిబ్యునల్ ఏ ప్రాంతానికైతే వినియోగం ఉద్దేశించబడిందో అది బేసిన్ ఆవల ఉందా బేసిన్ లోపల ఉందా అన్న అంశం" పరిగణలోకి తీసుకున్నది అని బ్రిజేష్ కుమార్ స్పష్టంగా తెలియజేశారు.

బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ కూడా తన రిపోర్టులో పలుమార్లు బేసిన్ ఆవలికి తరలించేవి కాబట్టి ఆ ప్రాజెక్టులకు కేటాయింపులు చేయలేమని ఖరాఖండిగా చెప్పింది. "బేసిన్ ఆవలికి కేటాయింపులు చేయడంపై నిషేదం లేదు కానీ, బేసిన్ లోపలి అవసరాలను పట్టించుకోకుండా ఒక పరిమితిని మించి చేయడం సరికాదు" అని స్పష్టం చేసింది. కేసి కెనాల్ కు అదనంగా 29.57 టీఎంసీలు కేటాయించాలి అని నాటి ఆంధ్ర ప్రదేశ్ కోరినప్పుడు, వినియోగించాల్సిన ఆయకట్టు పెన్నా బేసిన్లో ఉన్నది కాబట్టి, ఇప్పటికే కేసి కెనాల్ కు బేసిన్ ఆవలి వినియోగాలకు కేటాయించబడి ఉన్నాయి కాబట్టి, ఇంకా బేసిన్ ఆవలి అవసరాలకు కేటాయించలేము అని తోసిపుచ్చింది. అట్లాగే, పెన్నా అహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కు 10 టీఎంసీ లు కేటాయించాలని ఆంధ్ర ప్రదేశ్ కోరినప్పుడు అది క్రిష్ణా బేసిన్ ఆవలికి పెన్నా బేసిన్ కు తరలించేందుకు కాబట్టి ఆ డిమాండును సమ్మతించడంలేదు అని స్పష్టం చేసింది.

ఇప్పటికే ఉన్న వినియోగాలను సాధ్యమైనంత వరకు మార్చరాదు అని నాడున్న చారిత్రక వినియోగాల పరంగా చెప్పిన బచావత్ ట్రిబ్యునల్ పరిశీలనను ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మరొక రకంగా ఉపయోగించుకుంది. మిగులు జలాలపై ఇచ్చిన స్వేచ్ఛ ఆధారంగా బేసిన్ ఆవలి ప్రాజెక్టులన్నీ సాధ్యమైనంత తొందరగా పూర్తి చేసుకుని మే 2000 తర్వాత ఏర్పడబోయే ట్రిబ్యునల్ వద్ద "ఇప్పటికే ఉన్న వినియోగాలు" కాబట్టి తమ ప్రాజెక్టులకు కేటాయింపుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరేందుకు రంగం సిద్దం చేసుకుంది. ఆ సందర్భంలోనే తెలంగాణ బేసిన్లోని ప్రాజెక్టులు పూర్తి చేయకుండా ఏదో ఒక కారణంతో వాయిదా వేస్తూ, బేసిన్ ఆవలి ఆంధ్ర ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు, వినియోగాలను పెంచుకునేందుకు ప్రయత్నించింది. అదే విధంగా 2004-2013 వరకున్న బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఎదుట వాదించింది. అందువల్లనే, బేసిన్లోని పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ స్కీం, దిండి లిఫ్ట్ స్కీం, కల్వకుర్తి లిఫ్ట్ స్కీం, నెట్టెంపాడు లిఫ్ట్ స్కీం, ఎస్ఎల్బిసి స్కీం లను ప్రక్కకు పెట్టి బేసిన్ ఆవలి తెలుగుగంగ, ఎస్ఆర్బిసి, హెచ్ఎన్ఎస్ఎస్, జిఎన్ఎస్ఎస్ లను ఉరికించింది నాటి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం. తెలుగుగంగకు కేటాయింపులు చేసుకోగలిగింది. కానీ, ఒకవేళ బేసిన్లోని ప్రాజెక్టులను పూర్తి చేసి ఉంటే బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తప్పనిసరిగా వాటికి ప్రాధాన్యత ఇచ్చి నీటిని కేటాయించేది అనేది వాస్తవం.

ఈ సందర్భంగా క్రిష్ణా బోర్డు, అపెక్స్ కౌన్సిల్ ల వద్ద ఆంధ్ర ప్రదేశ్ చేస్తున్న ఫిర్యాదులు చూస్తే నాటి ఆంధ్ర ప్రదేశ్ ధోరణి ఎట్లా ఉండిందో, ఇప్పుడు దాన్ని ఎట్లా కొనసాగిస్తున్నదో తెలుస్తుంది. కల్వకుర్తి, నెట్టెంపాడు, మరియు ఎస్ఎల్బిసి, ఈ మూడు ప్రాజెక్టుల నీటి వినియోగాలను తెలంగాణ పెంచుకుంది, వాటిని బోర్డు అనుమతికి పంపలేదు అని ఫిర్యాదు చేసింది ఆంధ్ర ప్రదేశ్. నిజానికి ఈ ప్రాజెక్టులకు ఆయకట్టును మాత్రమే పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది నాటి ఉమ్మడి ప్రభుత్వం. నీటి వినియోగాలు పెంచలేదు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక ఆ పెంచిన ఆయకట్టుకు సరిపోను నీటిని కేటాయించింది. కొత్తగా నీటి వినియోగం పెంచింది కాబట్టి ప్రాజెక్టు స్కోప్ మారింది, మా ప్రాజెక్టుల వినియోగాలకు భంగం వాటిల్లుతుంది కాబట్టి వాటిని ఆపివేయాలని కోరుతూ బోర్డుకు

ఫిర్యాదు చేసింది నేటి ఆంధ్ర ప్రదేశ్. ఇదీ కొనసాగుతున్న ధోరణి.

### ప్రాజెక్టులపై తొండి వివాదం:

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ నాటి నుండి కొత్త ప్రాజెక్టులు పాత ప్రాజెక్టులు అనే విభజన ఒకటి ఆంధ్ర ప్రదేశ్ పునర్విభజన చట్టం, 2014 ఆధారంగా ముందుకు వచ్చింది. 2014 నాటికి తెలంగాణ ప్రాజెక్టులను కట్టుకోవాల్సిన అవసరం ఉంది, మొదలుపెట్టిన వాటిని రీ-ఇంజనీరింగ్ చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఇక అదే సమయానికి, ఆంధ్ర ప్రదేశ్ తనకు న్యాయమైన వాటా (equitable share) కంటే చాలా ఎక్కువ నీటిని మళ్లించుకునే ప్రాజెక్టులు కట్టుకుంది, కొన్ని పూర్తయ్యే దశలో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో తెలంగాణను ఆంధ్ర ప్రదేశ్ ను ఒకే గాటన కట్టి, కొత్త ప్రాజెక్టులను కట్టాలంటే బోర్డు అనుమతి తప్పనిసరి అన్నట్లయితే ఎవరికి నష్టం? ఎవరికి లాభం? అసలు తెలంగాణ ప్రాజెక్టులను బోర్డులో అపెక్స్ కౌన్సిల్‌లో ఆంధ్ర ప్రదేశ్ ఒప్పుకుంటుందా? బేసిన్లోని తెలంగాణ ప్రాజెక్టులకు నికర జలాల నీటి లభ్యత అనేది ఇప్పుడున్న ట్రిబ్యునల్ తీర్పు రాకుండా సాధ్యమవుతుందా? అసలు ఇప్పుడు నివేదించిన రిఫరెన్సుల ద్వారా ఇప్పుడున్న ట్రిబ్యునల్ తెలంగాణ కు న్యాయం చేయగలుగుతుందా? ఇవన్నీ సగటు తెలంగాణ నాగరికునిలో మెదుల్తున్న ప్రశ్నలు.

ఇప్పటికే క్రిష్ణా బోర్డు, కేంద్ర ప్రభుత్వం, సుప్రీం కోర్టు, అపెక్సు కౌన్సిల్ లలో బేసిన్లోని తెలంగాణ ప్రాజెక్టులైన పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ స్కీం, డిండి లిఫ్ట్ స్కీం లను ఆపాలని ప్రయత్నించిన ఆంధ్ర ప్రదేశ్, ఇప్పుడు మరొక కొత్త వ్యూహంతో రాయలసీమ లిఫ్ట్ స్కీం ప్రతిపాదనతో ముందుకు వచ్చింది అనిపిస్తుంది.

ఈ సంవత్సరం జనవరిలో కేంద్ర ప్రభుత్వం కేంద్ర జల సంఘం అనుమతి లేని ప్రాజెక్టులన్నీ కొత్త ప్రాజెక్టులని మరొక నిర్వచనం ఇచ్చింది. ఇక దాని ప్రకారం బేసిన్లోని తెలంగాణ ప్రాజెక్టులు, బేసిన్ ఆవలి ఆంధ్ర ప్రాజెక్టులన్నీ ఒకే గాటన చేరాయి. దానికి తోడు ఇంతకు ముందున్నదీ ప్రతిపాదనలో లేని "రాయలసీమ లిఫ్ట్ స్కీం -పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ -ఎస్ఆర్ఎంసి -బనకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ల" వ్యవస్థ ఒకటి రోజుకు 6 నుండి 8 టీఎంసీలు శ్రీశైలం రిజర్వాయర్ నుండి మళ్లించేది ఆంధ్ర ప్రదేశ్ మే 2020 లో మొదలుపెట్టింది కదా, అది కూడా జనవరిలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిర్వచనం ప్రకారం బేసిన్లోని తెలంగాణకు చెందిన పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ స్కీమ్, దిండి లిఫ్ట్ స్కీం లు ఒకే గాటన చేరాయి.

అసలు కృష్ణా బేసిన్ కు చెందిన ప్రాజెక్టులన్నీ కృష్ణా ట్రిబ్యునల్ల అవార్డుల ప్రకారం ఉండాలి. నేడు ట్రిబ్యునల్ కేటాయింపులు ఇంకా జరుగలేదు, వాదనలు నడుస్తున్నాయి. తమకు కృష్ణా నది జలాల్లో బేసిన్లోని తమ ప్రాజెక్టులకు న్యాయమైన వాటా కేటాయింపుల (equitable apportionment) కొరకు తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సెక్షన్-3 ఫిర్యాదు కేంద్రం వద్ద ఆరేళ్ళుగా పెండింగులో ఉంది. మరి నీటి కేటాయింపులపై స్పష్టత లేకుండా ప్రాజెక్టుల నీటి కేటాయింపులను వినియోగాలను కేంద్ర జల సంఘం ఎట్లా పరిశీలించి అనుమతులిస్తుందో ఎవరికీ అర్థం కావడం లేదు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ చారిత్రక నేపథ్యం, ప్రస్తుతమున్న సాగునీటి సౌకర్యాలు, కృష్ణా తుంగభద్రా నదులపై ఉన్న ఉమ్మడి ప్రాజెక్టులకు కుడి వైపు మరియు ఎడమ వైపున్న నీటిని మళ్లించే కెపాసిటీలలో వ్యత్యాసం, రాష్ట్రం ఏర్పడే నాటికి ప్రాజెక్టుల ప్రతిపాదనలు ఎట్లా జరిగాయి లాంటి విషయాలన్నీ నేడు కేంద్ర ప్రభుత్వం మరియు కేంద్ర ప్రభుత్వ సంస్థలు పరిగణలోకి తీసుకోవాలి. వాటి ఆధారంగా తెలంగాణ – ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల ప్రాజెక్టులను ప్రత్యేకంగా

నిర్వచించి పరిశీలించాలి. మే, 5 న జరిగిన 12వ క్రిష్ణా రివర్ మేనేజ్ మెంట్ బోర్డు మీటింగులో తెలంగాణ రాష్ట్రం ఈ విషయాలన్నీ ఏకరువు పెట్టింది. తెలంగాణ ప్రత్యేక పరిస్థితులను పరిగణలోకి తీసుకోవాలని కోరింది. కొత్త నిర్వచనం ఇవ్వాల్సిన అవసరం ఉంది అని నొక్కి చెప్పింది.

**నీటి వినియోగాలలో మార్పు - పున: పంపిణి:**

ఈనాడు ప్రపంచంలో సాంకేతిక పురోభివృద్ధి వల్ల వందలాది మీటర్ల ఎత్తుకు నదీజలాలను ఎత్తిపోయడం సాధ్యం అవుతున్నది. సాగునీటి ప్రాజెక్టుల ఆధునీకీకరణ, నూతన నీటి సరఫరా, యాజమాన్య విధానాల అమలు, తక్కువ పంట కాలం ఉండే ఆధునిక వంగడాల వినియోగం, నీరు ఎక్కువ అవసరమయ్యే వరి, చెరుకు వంటి పంటల నుంచి తక్కువ నీరు అవసరమయ్యే కూరగాయలు, పండ్ల తోటలు, పూల తోటలు, ఉద్యాన వన పంటలు, తృణ ధాన్యాలు, ఇతర ఆరుతడి పంటలకు మళ్లడం...తదితరాల వల్ల నదీజలాల్లో వినియోగంలో మిగులు (Savings) సాధ్యం అవుతున్నది. ఈ మారిన పరిస్థితుల్లో తప్పనిసరిగా ప్రాజెక్టుల నీటి వినియోగాల్లో కూడా మార్పు చేయాల్సిన అవసరం ఉంది. బేసిన్లోని వ్యవసాయానికి అనుకూలమైన భూమి ఒక పంటకు సాగునీటికై అలమటిస్తుంటే, బేసిన్ ఆవల భూముల్లో రెండో పంటకు, మూడో పంటకు సాగునీరివ్వాలనడం, ఎక్కడో అయిదారు వందల కిలో మీటర్ల దూరంలో ఉన్న భూములకు నీళ్ళివ్వాలనడం సరికాదు. ఈ విషయాలన్నీ స్పురణలో ఉంచుకొని ప్రకాశం బ్యారేజీ వినియోగాలైనా, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా వినియోగాలైనా చూడాలి. అప్పుడు మాత్రమే బేసిన్ లో ఉండే ప్రాంతాలకు నీటి కేటాయింపులు చేయడం సాధ్యం అవుతుంది.

జాతీయ జల విధానం కూడా నది బేసిన్ ప్రాతిపదికగా, బేసిన్లోని అవసరాలు మరియు నీటి లభ్యతను బట్టి పంపకాలు చేసుకోవాలి అని పేర్కొంది అని గమనించాలి.

శ్రీబాగ్ ఒప్పందం (1937) రాయలసీమ మరియు ఆంధ్ర నాయకుల మధ్య జరిగింది. ఆ తరువాత కాలంలో ఏ విధమైన జల విధానాలు ఆంధ్ర నాయకులు, జల నిపుణులు అవలంబించారో, వాటివల్ల రాయలసీమ వారికేమైనా అన్యాయం జరిగిందనిపిస్తే, ఆ విధానాల వలన లాభపడింది ఆంధ్ర ప్రాంతం కాబట్టి, ఆంధ్ర ప్రాంతం వారిని ఆ నష్టాన్ని మరే విధంగానైనా భర్తీ చేయమని అడగాలి తప్ప పూర్తిగా కృష్ణా బేసిన్లోనే ఉండి, కరువు పీడిత ప్రాంతాలకు నీళ్లిచ్చే తెలంగాణ ప్రాజెక్టుల న్యాయమైన వాటాను మళ్లించుకుపోతామంటే సరికాదు.

ఇక్కడ బచావత్ ట్రిబ్యునల్ వ్యక్తం చేసిన మరొక స్పష్టమైన అభిప్రాయం "భవిష్యత్తు వినియోగాలకు న్యాయమైన కేటాయింపులు (equitable allocation) చేస్తున్నప్పుడు అధిక ప్రాధాన్యత బేసిన్లోని వినియోగాలకు ఇవ్వాలి" అని తుది నిర్ణయంలో చెప్పిన అంశం గుర్తుంచుకుంటే, భవిషత్తులో ఏ వినియోగమైనా శ్రీశైలం ప్రాజెక్టు నుండి సాగునీటికి జరిగితే, తెలంగాణ బేసిన్లోని ప్రాజెక్టులకు మొదటి హక్కు ఉందని స్పష్టమవుతుంది.

* * * * *

అధ్యాయం-7

# బచావత్ ట్రిబ్యునల్ మూల సూత్రాలు: కృష్ణ జలాలపై తెలంగాణకు హక్కులు

ఈ మధ్య తరుచుగా ఆంధ్ర ప్రదేశ్ నాయకుల నుండి వినబడుతున్న మాట: కృష్ణా నదీజలాలు మా హక్కు. మేము మా ఇష్టం వచ్చిన విధంగా వాడుకుంటాం. తెలంగాణ రాష్ట్రం అక్రమంగా పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ స్కీమ్, డిండి లిఫ్ట్ స్కీమ్, కల్వకుర్తి లిఫ్ట్ స్కీమ్ లు కట్టడం వల్ల మాకు రావాలసిన నీళ్ళను అక్రమంగా తరలిస్తుంది. దానికి తోడు వరద రోజులు తగ్గిపొయ్యాయి. అందువల్ల మేము పోతిరెడ్డిపాడు ద్వారా మా వాటాను వాడుకోవడానికి జిఓ 203 ద్వారా పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచుతున్నాం అంటున్నారు.

గత అధ్యాయంలో, బచావత్ ట్రిబ్యునల్ మూల సూత్రాలపై కొంత సమాచారం ఇచ్చాం. వాటి ఆధారంగా తెలంగాణకు హక్కు ఎలా ఉంది, ఆంధ్ర ప్రదేశ్ కు ఎందుకు లేదు అనే విషయం స్పష్టం చేసే ప్రయత్నం, చర్చ ఈ అధ్యాయంలో చేశాం. కృష్ణా జలాలపై తెలంగాణకు గల హక్కుల గురించి తెలంగాణ ప్రజలందరికీ అవగాహన ఉండవలసిన అవసరం ఎంతైనా ఉంది.

బచావత్ ట్రిబ్యునల్ సెప్టెంబర్ 1960 నాటికి పరీవాహక ప్రాంత రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక మరియు అప్పటి ఆంధ్ర ప్రదేశ్ లకు నాడు ఉనికిలో ఉన్న (in operation) మరియు నిర్మాణంలోఉన్న (under construction) ప్రాజెక్టుల వినియోగాలకు రక్షణ (protection) కల్పించింది. ఆ సందర్భంలో బచావత్ ట్రిబ్యునల్ తమ ఉద్దేశ్యం ఈ రక్షణలు ఇట్లాగే కొనసాగాలని కానీ, భవిష్యత్తులో మార్చవద్దని ఎక్కడా చెప్పలేదు. వారు ఈ విధంగా స్పష్టం చేశారు.

"In fixing the equitable shares of the States, the claims of such existing uses should be allowed before claims for future uses are taken up for consideration. It is not intended that the existing uses must continue or that they should not be changed in future" (పేజీ 98, KWDT-I రిపోర్టు).

అట్లాగే, కృష్ణా బేసిన్ ఆవలకు మళ్లింపులపై విస్తృతంగా అధ్యయనమూ, చర్చా చేసినాక, భవిష్యత్తులో సమన్యాయ కేటాయింపులు చేయాల్సి వచ్చినపుడు బేసిన్ లోపలి వినియోగాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుందని ట్రిబ్యునల్ తన నిర్ణయం తెలియజేసింది.

"In equitable allocation, future uses requiring diversion of water outside the basin are relevant, but more weight may be given to uses requiring diversion of water inside the basin." (పేజీ 128, KWDT-I రిపోర్టు).

కృష్ణా డెల్టా, కేసి కెనాల్‌ల వినియోగాలను బచావత్ ట్రిబ్యునల్ కేవలం చారిత్రక వినియోగాల కారణంగానే రక్షణలు కల్పించింది. ఎప్పుడైతే ఆ ప్రాజెక్టులలో ఏవైనా మిగులు జలాలు ఉంటే వాటిని బేసిన్లోని ప్రాజెక్టులకు ప్రథమ ప్రాధాన్యతనిస్తూ పున: కేటాయింపులు చెయ్యాలి తప్ప బేసిన్ ఆవలి ప్రాజెక్టులకు తరలిస్తాం, వాటిపై మాకు హక్కు ఉన్నదని ఆంధ్ర ప్రదేశ్ అంటే అది బచావత్ ట్రిబ్యునల్ ప్రాథమిక సిద్దాంతాలకు, మూల సూత్రాలకే విరుద్దం. కేవలం కృష్ణా బేసిన్లోనే ఉన్న తెలంగాణ ప్రాజెక్టులకు మాత్రమే ప్రథమ హక్కు ఆ జలాలపై ఉంటుంది.

**ప్రస్తుత పరిస్థితి :**

2014 లో రాష్ట్రం ఏర్పడగానే, ఒకవైపు బ్రిజేష్ ట్రిబ్యునల్ (KWDT-II) ను ప్రాజెక్టుల వారీగా తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ ల మధ్య కృష్ణా నది జలాలను కేటాయించడానికి పొడిగించారు, మరొకవైపు రెండు రాష్ట్రాల మధ్య నీటి వినియోగాలు సక్రమంగా జరగడాన్ని పర్యవేక్షించేందుకు కృష్ణా నది మేనేజ్ మెంట్ బోర్డు (KRMB) ని నియమించారు. KRMB విధి ప్రాథమికంగా ట్రిబ్యునల్ అవార్డుల ప్రకారంగా నీటి వినియోగాలు జరిగేట్టు చూడటం. అయితే, ట్రిబ్యునల్ ప్రాజెక్టుల వారీ కేటాయింపులు చేసే వరకు ఇరు రాష్ట్రాలు తమ మధ్య నీటి పంపకాలకై తగువులాట ఉండకుండా సజావుగా ఉండేందుకు 2015 జూన్ లో ఒక తాత్కాలిక అవగాహనకు వచ్చారు. దాదాపుగా అదే ప్రాతిపదికగా ఇప్పటి వరకూ కొనసాగుతున్నది. ఆ అవగాహన ప్రకారం కృష్ణా నదిలో ఉమ్మడి రాష్ట్రం పరిధిలోకి వచ్చిన నీళ్ళను తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలు 299:512 నిష్పత్తిలో పంచుకోవాలి. ఎవరికి కేటాయించబడ్డ నీళ్ళను వాళ్ళు తమ రాష్ట్రంలో ఎక్కడైనా వాడుకోవచ్చనే ఒక ప్రాథమిక అవగాహన కూడా ఆచరణలో ఉంది. బచావత్ ట్రిబ్యునల్‌లో ఉన్న ఈ వెసులుబాటు ఆధారంగా ప్రాజెక్టుల వద్ద కూడా నీటి వినియోగాలు ఇరు రాష్ట్రాలు చేస్తూ వచ్చాయి. ఈ క్రమంలోనే కృష్ణా డెల్టా సిస్టం, నాగార్జునసాగర్ కుడి కాలువ తదితర వినియోగాలకు బదులుగా పోతిరెడ్డిపాడు వద్ద నుండి కొంత ఎక్కువ నీటిని మళ్లించడం జరిగింది.

పట్టిసీమ (పోలవరం) ప్రాజెక్టు 2015 లో ఉనికిలోకి వచ్చి గోదావరి నది జలాలను కృష్ణా డెల్టాకి మళ్లించడం మొదలయ్యింది. మెల్ల మెల్లగాపెరిగి సంవత్సరానికి 100 టీఎంసీలకు పైగా కూడా ఈ మళ్లింపులు జరిగాయి. అట్లాగే పులిచింతల డ్యాం నిర్మాణం పూర్తికావడం తదితర కారణాల వల్ల కృష్ణా డెల్టా సిస్టంకు కృష్ణా జలాలను శ్రీశైలం– నాగార్జునసాగర్ల ద్వారా విడుదల చేయాల్సిన అవసరం ఇంకా తగ్గిపోయింది. అట్లా మిగిలిన ఆ జలాలని పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ వ్యవస్థ ద్వారా మళ్లించుకోవడం ఎక్కువైంది. ఆ మళ్లింపులను తమ హక్కుగా భావిస్తున్నారు, అపోహ పడుతున్నారు ఆంధ్రప్రదేశ్ నాయకులు. ఆ అపోహ కారణంగానే పోతిరెడ్డిపాడు వ్యవస్థ సామర్థ్యాన్ని 80 వేల క్యూసెక్కుల విస్తరణకు, రోజుకు 3 టి ఏం సి లు ఎత్తిపోసే రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని శాంక్షన్ చేస్తూ జిఓ 203 జారీ చేశారు.

**తెలంగాణ వాదనలు :**

వాస్తవమేమంటే, పోతిరెడ్డిపాడు వ్యవస్థ నుండి చెన్నయ్ తాగునీటి సరఫరాకు15 టీఎంసీలు, SRBC కి 19 టీఎంసీలు మొత్తం 34 టీఎంసీలు తప్ప మరే ఇతర మళ్ళింపులు చేయడానికి ఆంధ్రప్రదేశ్ కు హక్కు లేదు. అవి కూడా వానాకాలంలోనే చేయాలి. ఇక GNSS, TGP (15 టీఎంసీలు కాకుండా), కేసి కెనాల్లకు ఈ పోతిరెడ్డిపాడు వ్యవస్థ నుండి నీటిని మళ్లిస్తున్నారు కానీ, వీటికి అసలు ఏ విధమైన కేటాయింపులు శ్రీశైలం రిజర్వాయర్ నుండి

బచావత్ ట్రిబ్యునల్ చేయలేదు. ఇవన్నీ కృష్ణా బేసిన్ ఆవల ఆయకట్టుకు నీటిని మళ్లించే ప్రాజెక్టులు SRBC కి ప్లానింగ్ కమిషన్ ద్వారా పొందిన అనుమతి కూడా బచావత్ ట్రిబ్యునల్ తీర్పును ఖాతరు చేయకుండా ఇవ్వబడిందని బ్రిజేష్ ట్రిబ్యునల్ ముందు తెలంగాణ ప్రభుత్వం వాదిస్తున్నది.

ఎప్పుడైతే, కృష్ణా డెల్టా సిస్టమ్ మరియు కేసి కెనాల్ లకు బచావత్ ట్రిబ్యునల్ చారిత్రక వినియోగాల ఆధారంగా పరిగణించిన రక్షణల అవసరం లేదో వాటిని ఏ విధమైన ఇతర వినియోగాలకు వాడడానికి వీలు లేదు. నాడు ఆ రక్షణలు ఇవ్వడం వల్ల బేసిన్లోని తమ అవసరాలకు నీరు లేకుండా పోయిందని కర్ణాటక, మహారాష్ట్రలు గట్టిగా వ్యతిరేకించినా చారిత్రక వినియోగాలను మార్చరాదని బచావత్ ట్రిబ్యునల్ భావించి ఆంధ్రప్రదేశ్ కు ఎక్కువ నీటి కేటాయింపులు చేసింది. అట్లాంటి కేటాయింపులను మార్చాలంటే అది తప్పనిసరిగా ఒక ట్రిబ్యునల్ పునః కేటాయింపుల ద్వారా మాత్రమే చేయ్యాలి. అట్లా చేసేప్పుడు కృష్ణా బేసిన్లోని ప్రాజెక్టులకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ సమన్యాయ కేటాయింపులు (equitable apportionment) జరపాలి. అంతే గాని, బేసిన్ ఆవలకు నీటిని మళ్లించే ప్రాజెక్టులు, వాటికై బేసిన్ ఆవల వందలాది టీఎంసీల స్టోరేజీలు, కెనాల్-రెగ్యులేటర్ వ్యవస్థలు కట్టడమూ, వాటిని ఇంకా ఇంకా పెంచుకోవడమూ, వాటిపై మాకే హక్కు ఉన్నది అని ఆంధ్ర ప్రదేశ్ అనడం అర్థరహితం. బచావత్ ట్రిబ్యునల్ పరిగణలోకి తీసుకున్న సమ న్యాయ సూత్రాలకు విరుద్ధం. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా నీటిని మళ్లింపు చేసేది అన్నీ బేసిన్ ఆవలి ప్రాజెక్టులకే కాబట్టి సమన్యాయ కేటాయింపులు జరిపి బేసిన్లోని తెలంగాణ ప్రాజెక్టులకు తప్పనిసరిగా ప్రాధాన్యత ఇచ్చి కేటాయింపులు చెయ్యాల్సిన అవసరం ఉంది. అందుకొరకై వెంటనే తెలంగాణ ప్రభుత్వం కేంద్ర జల వివాదాల చట్టం, 1956 సెక్షన్-3 ప్రకారం చేసిన ఫిర్యాదును కేంద్ర ప్రభుత్వం ట్రిబ్యునల్ కు రిఫర్ చేయాలి. ఆ ట్రిబ్యునల్ కేటాయింపులు చేసే వరకు ఆంధ్ర ప్రదేశ్ ఏ విధమైన కొత్త ప్రాజెక్టుల నిర్మాణాలు పోతిరెడ్డిపాడు వ్యవస్థలో గానీ, మరే ఇతర బేసిన్ ఆవలకు మళ్లించే ప్రాజెక్టులు గానీ చేపట్టకుండా నియంత్రించవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిది.

పోతిరెడ్డిపాడు వ్యవస్థలోని ప్రాజెక్టులకు నికర జలాల కేటాయింపులు కావాలని ప్రస్తుతమున్న బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ముందు ఆంధ్ర ప్రదేశ్ అడుగలేదు కూడా. అంటే వరద జలాల ప్రాతిపదికపై అదీ బేసిన్ ఆవలకు మళ్లించేందుకు కట్టే ప్రాజెక్టులకు కృష్ణా జలాలపై హక్కు ఉందని ఆంధ్ర ప్రదేశ్ అంటోంది. అది హాస్యాస్పదం. అదే సమయంలో తెలంగాణ రాష్ట్రం శ్రీశైలం రిజర్వాయర్ వద్ద బేసిన్లోనే ఉన్న తన మూడు లిఫ్ట్ స్కీమ్ లు కల్వకుర్తి, పాలమూరు-రంగారెడ్డి మరియు డిండి, మరియు శ్రీశైలం ఎడమ కాలువకు నికర జలాల కేటాయింపు కావాలని బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ను అభ్యర్థించింది.

* * *

**అధ్యాయం-8**

**చర్చ**

# కృష్ణా జలవివాదాలు : ఘనీభవించిన మూస భావనలు

19 డిసెంబరు, 2018 ఆంధ్రజ్యోతి పత్రికలో "జల రాజకీయాలు" శీర్షికన కెవి సుబ్బారావుగారు రాసిన వ్యాసంలో అబద్దాలు,అపోహలు సృష్టించే అంశాలు చోటు చేసుకున్నాయి.కొన్ని ముఖ్యమైన అంశాలను మరుగున పరిచారు. వాటిపై పాఠకులకు వివరణలు ఇవ్వవలసిన అవసరం ఉంది. ఆయన వ్యాసం చివరలో ప్రస్తావించిన రాజకీయ అంశాల జోలికి పోకుండా కృష్ణా జలాల వివాదాలకు సంబందించిన అంశాలనే ఈ వ్యాసంలో ప్రస్తావించదలచాము.

ఉమ్మడి రాష్ట్రంలోనే కృష్ణా జలాల పంపిణీ సుదీర్ఘ న్యాయ విచారణ ద్వారా మూడు రాష్ట్రాల మధ్య జరిగింది. ఇంకా పంచడానికి నీళ్ళే లేవు. విడిపోయిన తెలంగాణకి వాటా పెంపు ఎట్లా జరుగుతుంది? అనేది సుబ్బారావుగారి వ్యాసంలో కీలకమైన అంశం. తెలంగాణా విడిపోక ముందే మూడు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపకం జరిగిన మాట వాస్తవం. అందులో తెలంగాణా భాగస్వామి అని పేర్కొనడం అబద్ధం. నదీ జలాల ట్రిబ్యునల్ ముందు తమ వాదనలను వినిపించే అధికారం కేవలం బేసిన్ రాష్ట్రాలకు మాత్రమే ఉంటుంది. తెలంగాణా ఒక రాష్ట్రంగా లేదు కనుక బచావత్ ట్రిబ్యునల్ ముందుగాని, బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ముందుగాని తెలంగాణా తన వాదనలని వినిపించడం చట్టపరంగా సాధ్యం కాదు.అయితే,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టంలోనే ఇప్పటికే ఉన్న బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ను పొడిగించినప్పటికీ దానికి నివేదించిన అంశాల పరిధి చాలా సంకుచితంగా ఉంది. అందువల్ల, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే కృష్ణా నదిలో తెలంగాణకు న్యాయబద్ధమైన నీటి వాటా నిర్ణయించడానికి అంతర్రాష్ట్ర నది జల వివాదాల చట్టం, 1956 లోని సెక్షన్–3 ప్రకారం ఇప్పుడున్న ట్రిబ్యునల్ కు నివేదించడమో లేదా కొత్త ట్రిబ్యునల్ ను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఆ ఫిర్యాదు ఆరేళ్ళుగా పెండింగులో ఉంది. ఈ విషయాలన్నీ సుబ్బారావు గారికి తెలియనివి కావు.బచావత్ ట్రిబ్యునల్,బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ముందు అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృష్ణా బేసిన్ ఆవల ఉండే  కోస్తా, రాయలసీమ ప్రాంత అవసరాలకు ప్రాధాన్యతనిచ్చి వాదనలు వినిపించిందే తప్ప తెలంగాణా అవసరాలను ట్రిబ్యునల్ ముందు పెట్టలేదు. ఈ విషయాలను బచావత్ ట్రిబ్యునల్ కూడా తన నివేదికలో ఎత్తి చూపించింది.మొత్తం ఆయకట్టు బేసిన్ ఆవలనే గల తెలుగుగంగ ప్రాజెక్టుకు కేటాయింపులు చేయాలని పట్టుబట్టిన ఆంధ్ర ప్రదేశ్, బేసిన్లోని కరువు ప్రాంతాలకు నీళ్లిచ్చే కల్వకుర్తి, నెట్టెంపాడు, SLBC ప్రాజెక్టులకు పట్టుబట్టలేదు అని కూడా బ్రిజేష్ కుమార్  ట్రిబ్యునల్ పేర్కొన్నది.తెలంగాణా అవసరాలను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ట్రిబ్యునల్ ముందు పెట్టకపోవడం చేత బేసిన్ లోపల ఉండే మహబూబ్ నగర్, నల్లగొండ జిల్లాల ప్రాజెక్టులకు నికర జలాల కేటాయింపులు జరగలేదు.కృష్ణా బేసిన్ ఆవల ఉండే కృష్ణ డెల్టా ఆయకట్టు, నాగార్జునసాగర్ కుడి కాలువ ఆయకట్టు, కేసి కాలువ ఆయకట్టు ప్రాంతాలు ముందు నుంచి నీటిని

వినియోగిస్తున్నారన్న సిదాంతం మీద వాటికి రక్షణలు కల్పించుకున్నారు. ఈ రక్షణల కారణంగా బేసిన్లో ఉన్న ప్రాంతాలు నికర జలాల కేటాయింపుల్లో తీవ్రంగా నష్టపోయినాయి. కాబట్టి ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణా ఉన్నప్పటికీ సుబ్బారావుగారు పేర్కొన్నట్టు ట్రిబ్యునల్ ప్రక్రియలో తెలంగాణా భాగస్వామి కాదు.

ఇకపోతే కృష్ణాలో పంచడానికి నీళ్ళే లేవు అని సుబ్బారావుగారు పేర్కొనడం ఒక అపోహ మాత్రమే. ఇటువంటి అభిప్రాయాలనే డిసెంబరు 5 న కోదాడ ఎన్నికల ప్రచార సభలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు కూడా వ్యక్తం చేసినారు. అదే రోజు సాయంత్రం గజ్వేల్ లో జరిగిన సభలో తెలంగాణా ముఖ్యమంత్రి కెసిఆర్ గారు ఈ అభిప్రాయాన్ని తీవ్రంగా ఖండించినారు. కృష్ణా బేసిన్ ఒక డెఫిసిట్ బేసిన్, కృష్ణా బేసిన్ లో నీళ్ళు లేవు అన్నది దశాబ్దాలుగా ఆంధ్రా లాబీలు,మీడియా,పౌర సంఘాలు, నాయకులు విస్తృతంగా ప్రచారం చేసిన ఒక అపోహ. తెలంగాణా ఇంజనీర్లు,మేధావులు కూడా ఇదే నిజమని నమ్మే స్థితిలోకి నెట్టివేయబడినారు. అసలు వాస్తవం క్రిష్ణా నది లోటు బేసిన్ కాదు. క్రిష్ణా బేసిన్ లోని తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ కు చెందిన సాగుకు అనువైన భూములకు సరిపోయేంత పరిమాణంలో నీళ్ళు ఉన్నాయి. కానీ బేసిన్ ఆవల ఉన్న ప్రాంతాల అవసరాలకు, బేసిన్లో ఉన్న ప్రాంతాల అవసరాల కంటే పెద్ద పీట వేసి చూసినప్పుడు అది లోటు బేసిన్ గానే కనబడుతుంది. ఆంధ్రప్రదేశ్ బేసిన్ ఆవలకు తరలించే నీటి పరిమాణం వల్లే క్రిష్ణా బేసిన్లో లోటు ఏర్పడిందని బచావత్ ట్రిబ్యునల్ ముందు కర్ణాటక, మహారాష్ట్రలు స్పష్టం చేశాయి. రెండో పంట, మూడో పంటలకు నీళ్ళు వినియోగించడాన్ని ఎత్తి చూపాయి. నిజానికి వరి పండించడానికి కూడా 130 టీఎంసీలు కృష్ణా డెల్టాకు సరిపోతాయి. (కృష్ణా బేసిన్లోని ఆయకట్టుకు 8.5 టీఎంసీలు, బేసిన్ ఆవల ఆయకట్టుకు 121.5 టీఎంసీలు). అవి భూగర్భ జలాలు, మంచి వర్షపాతం ఉన్న ప్రాంతాలు కూడా. కానీ, ప్రతి సంవత్సరం 200 నుండి 300 టీఎంసీలకు పైగా నీటిని ఆ ఆయకట్టుకు మళ్లించారు. అట్లాగే కేసి కెనాల్, నాగార్జునసాగర్ కుడి కాలువల కింద వినియోగాలు కూడా అత్యధికశాతం బేసిన్ ఆవలనే ఉన్నాయి. ఇట్లా తాము బేసిన్ అవల ఉన్న ప్రాంతాలకు మళ్లించడం వల్లనే కృష్ణాలో లోటు ఏర్పడిందన్న విషయాన్ని మరుగు పర్చి కృష్ణా బేసిన్లో నీళ్లు లేవు, అది లోటు బేసిన్ అని ప్రచారంలోకి తెచ్చారు. శ్రీశైలం రిజర్వాయర్ వద్ద మామూలు సంవత్సరాల్లో చూస్తే 400 టీఎంసీలకు తక్కువగాకుండా, వర్షపాతం మెరుగ్గా ఉన్న సంవత్సరాల్లో కనీసం 700 టీఎంసీల నీటి లభ్యత ఉంటుంది. కానీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు వంద శాతం కృష్ణా బేసిన్లోనే ఉన్న మహబూబ్ నగర్, నల్గొండ జిల్లాలలోని ప్రాంతాలకు నీటి కేటాయింపులు చేయలేదు. అదే సమయంలో కృష్ణా బేసిన్ అవల వందల కిలోమీటర్ల దూరాలలో ఉన్న ఆంధ్ర ప్రాంతాలకు నీటి కేటాయింపులు జరిగాయి. బేసిన్ ఆవలకు నికర జలాల కేటాయింపులే 350 టీఎంసీలు పైగా జరిగాయి. ఈ వాస్తవాన్ని ఆంధ్రప్రదేశ్ తరపున ట్రిబ్యునల్ ముందు సాక్షిగా పాల్గొన్న సుబ్బారావుగారు కూడా అంగీకరించారు. ఈ కేటాయింపులు ఎట్లా జరిగినాయి?

బచావత్ ట్రిబ్యునల్ ఎదుట నాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం క్రిష్ణా డెల్టా,కెసి కెనాల్, నాగార్జునసాగర్ కుడి కాలువలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి, వాటికి కేటాయింపులు చేసిన తర్వాతనే జూరాల ప్రాజెక్టు, ఎస్ఎల్బిసి ప్రాజెక్టులకు కేటాయించాలని లిఖిత పూర్వకంగా నివేదించింది. అట్లా కేటాయింపులకై డిమాండ్లు తమ ప్రాంత ప్రాజెక్టులకై ప్రథమ ప్రాధాన్యతతో అడిగినప్పటికీ, బచావత్ ట్రిబ్యునల్ ముందుచూపుతో రాష్ట్రాలకు చేసిన కేటాయింపులు గంపగుత్త(enbloc) కేటాయింపులని స్పష్టం చేశారు. అంటే,నాటి ఆంధ్రప్రదేశ్ కు చేసిన కేటాయింపులు 811 టీఎంసీలు ఆయా ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ ఉంచిన డిమాండ్ల ప్రకారంగా కాకుండా, రాష్టంలో అవసరాన్ని బట్టి ఏ ప్రాజెక్టు వద్ద అయినా వాడుకునే వెసులుబాటు ఉంది. బచావత్ గంపగుత్తగా కేటాయించిన 811 టీఎంసీలను

నాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీఓ ల ద్వారా తెలంగాణ ప్రాంత ప్రాజెక్టులకు 299 టీఎంసీలు, ఆంధ్ర ప్రాంత ప్రాజెక్టులకు 512 టీఎంసీలు కేటాయింపులు చేసింది. తెలంగాణ మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు కేటాయించిన 90 టీఎంసీలలో సరాసరి 30 టీఎంసీలు కూడా రావడంలేదు. ఇట్లా పలు విధాలుగా తెలంగాణ వినియోగాలను అన్యాయంగా కట్టడి చేసింది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. అవే వినియోగాలు కొనసాగాలని నేడు బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ వద్ద వాదిస్తున్నది విడిపోయిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. కృష్ణా నదిలో పంచడానికి నికర జలాలు లేవు అనడం అంటే తెలంగాణాకు దక్కవలసిన న్యాయమైన వాటాను నిరాకరించడమే.

ఈ రోజు పాత మహబూబ్ నగర్ జిల్లాలో కృష్ణా జలాల ఆధారంగా(నికర+ మిగులు) 142 టిఎంసిల వినియోగానికి సుమారు 10 లక్షల ఎకరాల సాగుకి ప్రాజెక్టులు పూర్తి అయినాయి లేక పూర్తి కాబడుతున్నాయి. అలాగే పాత నల్గొండ జిల్లాలో 135 టిఎంసిల కృష్ణా జలాల వినియోగానికి 8 లక్షల ఎకరాల సాగుకి ప్రాజెక్టులు ఉన్నాయి. ఇవన్నీ ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభించినవే అని పేర్కొంటూ ఇక అన్యాయం జరిగిది ఎక్కడ? అని ప్రశ్నిస్తున్నారు సుబ్బారావుగారు. మహబూబ్ నగర్, నల్లగొండ జిల్లాలు వంద శాతం కృష్ణా బేసిన్ లో ఉన్న జిల్లాలు. ఈ జిల్లాల్లో ఉన్న ప్రాజెక్టులలో నికర జలాల కేటాయింపులు ఉన్నవి ఏవి? మిగులు జలాల కేటాయింపులు ఉన్నవి ఏవీ? ఈ వింగడింపు చేసి మాట్లాడితే న్యాయంగా ఉంటుంది. మహబూబ్ నగర్ జిల్లాలో నికర జలాల కేటాయింపులు ఉన్న ప్రాజెక్టులు జూరాల(17.84 టిఎంసి), రాజోలిబండ(15.9 టిఎంసి), భీమా(20 టిఎంసి) మాత్రమే. కల్వకుర్తి, నెట్టెంపాడు, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులకు నికర జలాల కేటాయింపులు లేవు. రాజోలిబండ కింద అందుతున్న నీరు సగటున 6 టి.ఎం.సి.లకు మించడం లేదని రికార్డులు చెపుతున్నాయి. ఇక నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్ ఎడమ కాలువకు(105టిఎంసి), మూసి ప్రాజెక్టు(9.40టిఎంసి) లకు మాత్రమే నికర జలాల కేటాయింపులున్నాయి. నల్లగొండ జిల్లాలో చేపట్టిన ఎస్.ఎల్.బి.సి., డిండీకి నికర జాలాల కేటాయింపులు లేవు. ఇవి బేసిన్ లో ఉన్న ప్రాజెక్టులు కాబట్టి తెలంగాణా ప్రభుత్వం ఈ ప్రాజెక్టులకు నికర జలాల కేటాయింపులు జరగాలని పోరాడుతున్నది.

పాలమూరు రంగారెడ్డి, డిండీ, సీతారామా ప్రాజెక్టులు కొత్తవి కావు. ఇవి ఉమ్మడి ప్రభుత్వం అనుమతించిన ప్రాజెక్టులే అన్నది అబద్ధమా? ఉమ్మడి రాష్ట్రం అనుమతించిన ప్రాజెక్టులు విభజన చట్టంలో పేర్కొన్న నిబంధనల పరిధిలోకి రావు. వీటిని నదీ యాజమాన్య బోర్డులకు నివేదించనక్కెర లేదు. అపెక్స్ కౌన్సిల్ అనుమతి పొందనక్కెర లేదు. అయితే పాలమూరు, డిండీ ప్రాజెక్టులను ఉమ్మడి ప్రభుత్వం అనుమతించినప్పటికీ వాటిని అటకెక్కించినారు. తెలంగాణా రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం వీటి దుమ్ము దులిపి నిర్మాణం ప్రారంభించింది. ఈ రెండు ప్రాజెక్టులు కూడా వంద శాతం కృష్ణా బేసిన్లో ఉన్నాయి కాబట్టి తెలంగాణా ప్రభుత్వం వీటికి కూడా నికరజలాల కేటాయింపులు జరగాలని కోరుతున్నది. నికర జలాలు ఎక్కడ నుంచి వస్తాయి అన్నది కీలకమైన ప్రశ్న. వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన పరిశోధనల ఫలితంగా వరిలో 120 రోజుల పంటకాలం ఉన్న కొత్త వంగడాలు వచ్చాయి. వరి పంటకు నిలువ నీరు అవసరంలేదు. ఆరుతడి పంటగా కూడా వరిని సాగు చేసే పద్ధతులు అభివృద్ధి అయినాయి. ఆరుతడి పద్ధతిలో వరి సాగు వలన దిగుబడి కూడా గణనీయంగా పెరిగినట్టు నాగార్జునసాగర్ ఎడమకాలువ, శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ఆయకట్టులో గత మూడేండ్లుగా సాగిన ప్రయోగాలు నిరూపించినాయి. పంట దిగుబడి పెరగడమే కాదు ఒక టిఎంసి 13 వేల ఎకరాల వరి సాగుబడి అయ్యింది. కాబట్టి కృష్ణా డెల్టా రైతులు, నాగార్జునసాగర్ కుడికాలువ రైతులు, కె సి కాలువ రైతులు ఆరుతడి సాగు పద్ధతికి మారక తప్పదు. కృష్ణా డెల్టా ఆయకట్టుకు పోలవరం

ద్వారా, పట్టిసీమ ద్వారా గోదావరి నీటిని సరఫరా చేసే వ్యవస్థ ఏర్పడింది. ఏటా 100 టిఎంసి లకు పైగా డెల్టా ఆయకట్టుకు గోదావరి నీటిని సరఫరా జరుగున్నది. కాబట్టి కృష్ణా డెల్టాకు కేటాయించిన 152 టిఎంసి ల నీటిని ఎగువన తెలంగాణ ప్రాజెక్టులకు కేటాయించవచ్చు. నాగార్జునసాగర్ కుడి కాలువ ఆయకట్టుకు కూడా గోదావరి నుంచి నీటిని సరఫరా చేసే అవకాశంఉన్నది. ఈ వాస్తవాలను కూడా సుబ్బారావుగారు ట్రిబ్యునల్ ముందు సాక్ష్యం ఇస్తూ అంగీకరించినారు.మొత్తం మీద ఆంధ్రా ప్రాంత అవసరాలకు ఎటువంటి భంగం వాటిల్లకుండానే తెలంగాణాకు మరో 200 టి.ఎం.సి.ల నికర జలాల కేటాయింపులు జరపడానికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. వచ్చిన చిక్కు ఏమిటంటే కృష్ణాలో పంచడానికి నీళ్ళే లేవు అనే ఘనీభవించిన మూస భావన నుంచి ఆంధ్రా పాలకవర్గాలు,మేధావులు బయటపడకపోవడం,1960 వ దశకంలో భారత్ సహా ప్రపంచ దేశాలు ఆమోదించిన హెల్సింకి రూల్స్ లో ఉన్న న్యాయ భావనలను నిరాకరించడం.

సుబ్బారావు గారు గోదావరి బేసిన్ లో తెలంగాణా ప్రాజెక్టుల వినియోగాలు 1100 టిఎంసి లని పేర్కొన్నారు. గోదావరి జలాల్లో తెలంగాణాకు ఉన్న 967.94 టిఎంసి ల నికర జలాల కేటాయింపులకు లోబడే ప్రభుత్వం గోదావరిపై కాళేశ్వరం, తుపాకులగూడెం, సీతారామా ప్రాజెక్టులను నిర్మిస్తున్నది. సి.డబ్ల్యు.సి. కూడా ఈ ప్రాజెక్టులకు హైడ్రాలజి అనుమతులు మంజూరు చేసేటప్పుడు దిగువన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనుమతులు పొంది చేపట్టిన పోలవరం తదితర ప్రాజెక్టుల అవసరాలను దృష్టిలో పెట్టుకుంటుంది. కాబట్టి సుబ్బారావుగారు పేర్కొన్నట్టు గోదావరిలో ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులకు నీటి కొరత ఏర్పడే అవకాశమే లేదు. ప్రజల్లో లేనిపోని అపోహలు సృష్టించడం అనుభవజ్ఞులు, విజ్ఞులు అయిన సుబ్బారావు గారికి తగదు.

* * * * *

**అధ్యాయం-9**

**చర్చ**

# కృష్ణా జలాల పున:పంపిణీ సదస్సు అమరావతిలో జరగాలి

19 నవంబరు , 2017 ఆదివారం రోజున పాలమూరు అధ్యయన వేదిక వారు హైదరాబాద్ లో "ఎగువ ప్రాంత బాధిత రైతాంగ భవిష్యత్తు కోసం కృష్ణా నదీ జలాల పున:పంపిణీ అత్యవసరం అనివార్యం" అన్న అంశం పై ఒక సదస్సు జరిపినారు. కృష్ణా జలాల పున: పంపిణీ అంశం ఉద్యమ కాలంలో విస్తృతంగా చర్చనీయాంశంగా ఉండేది. బచావత్ ట్రిబ్యునల్ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి గంపగుత్తగా కేటాయించిన జలాలు 811 టిఎంసిలు. ఈ నీటిని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆంధ్ర రాయలసీమ ప్రాజెక్టులకు 512టిఎంసిలు (63%) కేటాయిస్తే , తెలంగాణా ప్రాజెక్టులకు కేటాయించినవి 299టిఎంసి (37%).కేటాయించిన నీటిని అంతర్గతంగా ఎట్లానైనా వాడుకోవడానికి బచావత్ ట్రిబ్యునల్ రాష్ట్రాలకు స్వేచ్ఛనిచ్చిన మాట వాస్తవమే. ఉమ్మడి రాష్ట్రంలో కృష్ణా నదీ జలాల వాటాలో తెలంగాణాకు అన్యాయం జరిగిందని మనం విస్తృతంగా చర్చించుకున్నాము. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో 68% తెలంగాణాలో ఉన్నది. 32% మాత్రమే ఆంధ్రలో ఉన్నది. ఇతరత్రా అంతర్జాతీయంగా ఏ ప్రమాణాలతో చూసినా కూడా తెలంగాణాకు జరిపిన నీటి కేటాయింపులలో తెలంగాణాకు అన్యాయం జరిగింది. ఈ సంగతి మనందరికి తెలిసిన పాత సంగతే.కృష్ణా జలాల పంపిణీకి సంబందించి అందరికీ తెలిసిన విషయం ముందు నుంచి నీటిని వినియోగించుకుంటున్నవారి హక్కులను కాపాడే ప్రాతిపదికన ట్రిబ్యునల్ నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్ణాటక, మహారాష్ట్రతో పోల్చినప్పుడు ఎక్కువ నీటి వాటాను రాబట్టుకోగలిగింది.కృష్ణా డెల్టాలో పంట నిడివి కాలం ఎక్కువగా చూపించడం, పర్కోలేషన్ నష్టాలు ఎక్కువగా చూపించడం, క్రాప్ వాటర్ రిక్వైర్ మెంట్ కు కావల్సిన నీటిని ఎక్కువగా చూపించడం ద్వారా బచావత్ ట్రిబ్యూనల్ ముందు చాలా ఎక్కువ డిమాండు చేసి కృష్ణా డెల్టాకు 181.2 టీఎంసీలు కేటాయింపులు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ పొందింది. దరిమిలా బచావత్ ట్రిబ్యునల్ కృష్ణా బేసిన్లోనే ఉన్న తెలంగాణ ప్రాజెక్టులకు కేటాయింపులు చేయలేని పరిస్థితి ఏర్పడింది. అందువల్లనే ఆనాడు మహబూబ్ నగర్ జిల్లా రాష్ట్రాల పునర్విభజన వల్ల చాలా నష్టపోయిందని బాధను వ్యక్తం చేస్తూ కూడా బచావత్ ట్రిబ్యునల్ 17.84 టీఎంసీల కంటే ఎక్కువ కేటాయించలేక పోయింది. అయితే బచావత్,75% విశ్వసనీయత ఆధారంగా కృష్ణా నది జలాలను గంపగుత్తగా (enbloc) కేటాయింపులు చేస్తున్నానని చెపుతూ పునః పంపిణీకి అవకాశం కల్పించినా ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణకు పునఃకేటాయింపులు చేయలేదు. 1956 లో రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ వల్ల మహబూబ్ నగర్ జిల్లా 174.3 టీఎంసీలను కోల్పోతే ఆంధ్ర పాలకులు కంటి తుడుపుగా కేవలం 20 టీఎంసీలు భీమా ఎత్తి పోతల పథకానికి పునఃకేటాయించారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యూనల్ వద్ద గట్టిగా డిమాండ్ చేసి బేసిన్ ఆవల గల తెలుగు గంగకు 25 టీఎంసీలు కేటాయింపులు చేయించుకున్న ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్, బేసిన్లోని తెలంగాణకు చెందిన మహబూబ్ నగర్ నల్గొండ జిల్లాలకు చెందిన కల్వకుర్తి, నెట్టెంపాడు, SLBC ప్రాజెక్టులను పట్టించుకోలేదు.

ఇకపోతే చాలామందికి తెలియని విషయం ఏమిటంటే ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రాజెక్టులకు కేటాయించిన 512 టిఎంసిల్లో కృష్ణా జలాల్లో 350 టిఎంసిలకు పైబడి , అంటే 68 % పైబడి నీరు కృష్ణా బేసిన బయట ఉన్న

ప్రాంతాలకు వెళుతున్నది. కృష్ణా డెల్టా ఆయకట్టులో అత్యధిక భాగం బేసిన్ బయటి ప్రాంతమే. పోతిరెడ్డిపాడు ద్వారా రాయలసీమకు తరలివేళుతున్న నీరు పెన్నా బేసిన్ ప్రాంతంలో నిర్మాణం అయిన జలాశయాలను నింపడానికి. 68 శాతం పరివాహక ప్రాంతం, వెనుకబాటు తనం , వలసలు , ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలు,తక్కువ వర్షపాతం .. ఇట్లా ఏ ప్రమాణాల రీత్యా చూసిన కృష్ణా జలాల్లో తెలంగాణా వాటా 550టిఎంసి దక్కవలసి ఉండే. అయితే ఉమ్మడి పాలకుల వివక్షాపూరిత విధానాల కారణంగా దక్కినవి 299 లు మాత్రమే.

ఇక అసలు విషయంలోనికి వస్తే పాలమూరు అధ్యయన వేదిక వారు ఈ సదస్సు కోసం ప్రచురించిన కరపత్రం ద్వారా ముందుకు తీసుకు వస్తున్న అంశాలు రెండున్నాయని తెలుస్తున్నది.

1) తెలంగాణా రాష్ట్రంలో ఇది వరకే కేటాయించిన కృష్ణా జలాల పున: పంపిణీ వెంటనే జరగాలి

2) బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ద్వారా సాధించే అదనపు జలాలను రాష్ట్రం లోపల పంపిణీ చేసుకోవడం అంతకన్నా ఎక్కువ అవసరం.

కృష్ణా నదీ జలాలను ఆయా రాష్ట్రాలు తమకు కేటాయించిన నీటిని భూమి, జనాభా,వర్షపాతం, భూగర్భ మట్టం పడిపోతున్న తీవ్రత , భూమిలో తేమశాతం , వెనుకబాటు తనం ప్రాతిపదికన అన్ని జిల్లాలకు పున:పంపిణీ చేయాలి. తెలంగాణా రాష్ట్రంలో పున:పంపిణీ వెంటనే చేపట్టాలన్న వారి డిమాండ్ తెలంగాణ విభజన నేపథ్యంలో యాంత్రికమైనదని చెప్పక తప్పదు. ఆ అంశాలనే విశ్లేషించడానికి ప్రయత్నం చేస్తాము. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కేటాయించిన 299 టిఎంసిల నికర జలాలు ఎక్కడ పారుతున్నాయి ? పారకపోతే ఎటు పోతున్నాయి ? అన్నది వారి ప్రశ్న. 299 టిఎంసిల నికర జలాల్లో ప్రాజెక్టుల వారీ కేటాయింపులు ఇట్లా ఉన్నాయి.

| క్రసం. | ప్రాజెక్టు | కేటాయింపులు (టిఎంసి) |
|---|---|---|
| 1. | కోటిపల్లి వాగు | 2.00 |
| 2. | కోయిల్ సాగర్ | 3.90 |
| 3. | ఊకచెట్టివాగు | 1.90 |
| 4. | డిండీ | 3.50 |
| 5. | జూరాల | 17.84 |
| 6. | నాగార్జున సాగర్ | 105.70 |
| 7. | రాజీవ్ భీమా ఎత్తిపోతల పథకం | 20.00 |
| 8. | రాజోలిబండ | 15.90 |
| 9. | మూసీ | 9.40 |
| 10. | హైదరాబాద్ జంట నగరాలకు తాగు నీరు | 5.70 |
| 11. | పాలేరు | 4.00 |

| | | |
|---|---|---|
| 12. | పాఖాల | 2.60 |
| 13. | వైరా | 3.70 |
| 14. | లంకాసాగర్ | 1.00 |
| 15. | మైనర్ ఇర్రిగేషన్ | 89.15 |
| 16. | చెన్నై నగరానికి తాగునీరు | 1.67 |
| 17. | శ్రీశైలం జలాశయం నుంచి ఆవిరి నష్టాలు | 11.00 |
| | మొత్తం | 299.00 |

జిల్లాల వారీ కేటాయింపులు చూసినప్పుడు నల్లగొండ జిల్లా ప్రాజెక్టులకు 78.60 టిఎంసిలు (నాగార్జున సాగర్ కలుపుకొని), మహబూబ్ నగర్ జిల్లా ప్రాజెక్టులకు 59.54 టిఎంసిలు, ఖమ్మం జిల్లా ప్రాజెక్టులకు 48.70 టిఎంసిలు (నాగార్జునసాగర్ కలుపుకొని), వరంగల్ జిల్లాకు 2.60 టిఎంసిలు, రంగారెడ్డి జిల్లాకు 2 టిఎంసిలు, హైదరాబాద్ నగరానికి 5.70 టిఎంసిలు, చెన్నై నగరానికి 1.67 టిఎంసిలు, శ్రీశైలం ఆవిరి నష్టాలు 11 టిఎంసిలు. ఇక వివాదాస్పదమైన అంశం మైనర్ ఇర్రిగేషన్ కు కేటాయించిన 89.17 టిఎంసిలు(కృష్ణా బేసిన్ లో ఉండే అన్ని జిల్లాలకు). ఇవిగాక ఉమ్మడి రాష్ట్రంలోనే ప్రారంభమైన ప్రాజెక్టులకు అదనపు జలాల నీటి కేటాయింపులు ఇవి .

1. శ్రీశైలం ఎడమ గట్టు కాలువ–30 టిఎంసిలు (నల్లగొండ)
2. ఉదయసముద్రం–10 టిఎంసిలు (నల్లగొండ)
3. కల్వకుర్తి – 40 టిఎంసిలు (మహబూబ్ నగర్)
4. నెట్టెంపాడు – 22 టిఎంసిలు (మహబూబ్ నగర్)
5. కోయిల్ సాగర్ ఎత్తిపోతల పథకం – 3.90 లు (మహబూబ్ నగర్)
5. పాలమూరు రంగారెడ్డి –90 టిఎంసిలు (పాలమూరు–51.20 , రంగారెడ్డి–36.50, నల్లగొండ–2.30)
6. డిండి ఎత్తిపోతల పథకం – 30 టిఎంసిలు (నల్లగొండ)
7. గట్టు ఎత్తిపోతల పథకం – 2.80 టిఎంసిలు (మహబూబ్ నగర్)

మొత్తం అదనపు జలాల కేటాయింపులు – 228.70

పాలమూరు రంగారెడ్డి, డిండి, గట్టు ఎత్తిపోతల పథకం తప్ప అన్ని ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభమైనవే.అదనపు జలాల కేటాయింపులని జిల్లాల వారీగా చూసినప్పుడు మహబూబ్ నగర్ జిల్లాకు 154.80 టిఎంసిలు, నల్లగొండ జిల్లాకు 72.30 టిఎంసిలు. రంగారెడ్డి జిల్లాకు 36.50 టిఎంసిలు.

నికర జలాలు, అదనపు జలాల పరిస్థితి ఈ విధంగా ఉన్నది. నికరజలాల పున: పంపిణీ ప్రాజెక్టుల వారీగా, జిల్లాల వారీగా చూసినప్పుడు బొటాబొటిగా ఉన్నాయి తప్ప వాటి కేటాయింపులు తగ్గించి మరొక ప్రాజెక్టుకు లేదా

జిల్లాకు కేటాయించే స్థితి ఉన్నదా? మైనర్ ఇర్రిగేషన్ కు కేటాయించిన 89 టిఎంసిల్లో అసలు వాడకంలో ఉన్నవి మహా ఉంటె 25 టిఎంసిలకు మించవని కె ఆర్ ఎం బి లో తెలంగాణా ప్రభుత్వం వాదిస్తూనే ఉన్నది. ప్రతీసారీ ఆంధ్ర ప్రభుత్వం మైనర్ ఇర్రిగేషన్ లో మీరు మొత్తం నీటిని వాడుకుంటున్నారు కనుక కృష్ణా మెయిన్ ట్రంక్ లో నుంచి 89 టి ఎం సి లను మినహాయించి పంపిణీ నిష్పత్తిని లెక్క గట్టాలని వాదిస్తున్నది. అప్పుడు తాత్కాలిక పంపిణీ నిష్పత్తి 490 : 210 కి పడిపోతుంది. అంటే ఆంధ్ర , తెలంగాణ పంపిణీ నిష్పత్తి 70 : 30 అవుతుందన్న మాట. తెలంగాణా ప్రభుత్వం కె అర్ ఎం బి సమావేశంలో చేసిన పోరాటం ఫలితంగా కృష్ణా మెయిన్ ట్రంక్ అంటే జూరాల నుంచి పులిచింతల దాకా లభించే నీటిని 66 : 34 నిష్పత్తిలో ఈ సంవత్సరం పంచుకోడానికి అంగీకారం కుదిరింది. కృష్ణా మెయిన్ ట్రంక్ లోనికి నీరు రావడమే గగనమైపోయిన పరిస్థితిని మనం చూస్తూనే ఉన్నాం. మహారాష్ట్రా, కర్నాటక ప్రాజెక్టులు నిండితే తప్ప కిందకు నీరు వచ్చే అవకాశాలు లేవు. ఈ పరిస్థితిలో తెలంగాణా రాష్ట్రానికి ఉన్న 299 టిఎంసిల నికర జలాలను సాధ్యమయినంత బేసిన్ లో ఉండే నల్లగొండ, మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ నగరానికి న్యాయబద్దంగా,సమ తూకంతో పంచె ప్రయత్నం చేస్తున్నది. జూరాల, రాజోలిబండ, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్ ఎత్తిపోతల, తుమ్మిళ్ళ పథకాల ద్వారా సాధ్యమైనంత నీటిని ఎత్తిపోసి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా రైతాంగానికి నీరు అందిస్తున్నది. 2019-20 సంవత్సరంలో మహబూబ్ నగర్ ప్రాజెక్టుల ద్వారా నీటి సరఫరా వివరాలు ఈ కింది పట్టికలో చూడవచ్చు.

| క్రసం | ప్రాజెక్టు | వానా కాలం ఆయకట్టు (ఎ) | యాసంగి ఆయకట్టు(ఎ) | మొత్తం ఆయకట్టు (ఎ) | నీటి వినియోగం TMC |
|---|---|---|---|---|---|
| 1 | కల్వకుర్తి | 2,11,300 | 2,37,622 | 4,48,922 | 45.18 |
| 2 | భీమా | 1,04,534 | 21,650 | 1,26,183 | 13.92 |
| 3 | కోయిల్ సాగర్ | 19,800 | 11,200 | 31,000 | 5.21 |
| 4 | నెట్టెంపాడు | 93,504 | 30,467 | 1,23,971 | 12.00 |
| 5 | రాజోలిబండ+ తుమ్మిళ్ళ | 41,897 | 17,988 | 59,885 | 6.91 |
| 6 | జూరాల | 86,345 | 40,500 | 1,26,845 | 19.54 |
| | మొత్తం | 5,57,380 | 3,59,427 | 9,16,807 | 102.76 |

ఇవన్నీ గంపగుత్త కేటాయింపుల కారణంగా,రాష్ట్రాలు తమకు జరిపిన కేటాయింపులను రాష్ట్రంలో ఎక్కడైనా వినియోగించుకునే వెసులుబాటు ఉన్నందువల్ల సాధ్యమయ్యింది. గతంలో నిర్ణయాధికారం ఆంధ్రా పాలకుల చేతుల్లో ఉన్నందున నీరు పల్లానికి ప్రవహించింది. ఇప్పుడు తెలంగాణాకు నిర్ణయాధికారం ఉన్నది కనుక ఒక్క చుక్క నీటిని వదులుకునే ప్రసక్తి లేదు. మైనర్ ఇర్రిగేషన్ లో, నాగార్జునసాగర్లో,ఆర్డిఎస్ లో మనం వాడుకోలేని నీటిని ఇతరత్రా వాడుకోవాడానికి అవకాశాలను వెతుకుతున్నది ప్రభుత్వం.

కాబట్టి తెలంగాణాకు నికర జలాల కేటాయింపులే తక్కువగా ఉన్నప్పుడు పున:పంపిణీ కోసం డిమాండ్ చెయ్యడం యాంత్రికమైన డిమాండ్ అవుతుంది. నిజానికి ఈ సదస్సుని ఏర్పాటు చేయ్యవలసింది తెలంగాణలో,

హైదరాబాద్ లో కాదు. ఇది అమరావతిలో ఏర్పాటు కావాలి. ఎందుకంటే హక్కుకి మించి నీటి కేటాయింపులు పొంది అనుభవిస్తున్న ప్రాంతం కనుక త్యాగం చెయ్యవలసింది వారు మాత్రమే. ఆంధ్ర ప్రాంతంలో ఉన్న మేధావులను, విశ్వవిద్యాలయాల అధ్యాపకుల్ని, ప్రగతిశీల రచయితలను, ప్రగతిశీల ఎన్‌జిఓలను, సీనియర్ పాత్రికేయులను, ప్రజాస్వామికవాదులను కూడగట్టి కృష్ణా జలాల పున: పంపిణీకి సంబంధించి మద్దత్తు పొందే ప్రయత్నం జరగాలి. ఆది బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ లో, సుప్రీం కోర్టులో తెలంగాణా ప్రభుత్వం సాగిస్తున్న ప్రయత్నాలకు దోహదం చేస్తుంది. అక్కడి ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచితే తెలంగాణాకు న్యాయబద్దంగా రావలసిన వాటాను పొందడానికి అనుకూల వాతావరణం ఏర్పరుస్తుంది. థిజోరీని ఉంచుకున్న వారి దగ్గర త్యాగం చెయ్యమని అడగడానికి బదులు చిల్లర పైసలున్న వారిని పంచండి అంటే న్యాయమా?

ఇక సందర్భం కనుక బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ముందు తెలంగాణా ప్రభుత్వం చేస్తున్న కృషిని సంక్షిప్తంగా తెలుసుకుందా తెలంగాణా రాష్ట్రం ఏర్పడిన వెంటనే అంతర రాష్ట్ర నదీ జలాల వివాద చట్టం సెక్షన్ 3 ప్రకారం కృష్ణా జలాల పున:పంపిణీ జరపాలని తెలంగాణా ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి నివేదించింది. గత రెండు ట్రిబ్యునల్ల కేటాయింపుల్లో తెలంగాణాకు జరిగిన అన్యాయాన్ని వివరించింది. నిర్దేశించిన సంవత్సరం లోపల కేంద్ర నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో సుప్రీం కోర్టులో సెక్షన్ 3 ప్రకారం కృష్ణా జలాల పున:పంపిణీ కోసం ట్రిబ్యునల్ ఏర్పాటుకు ఆదేశాలు ఇవ్వాలని  పిటిషన్ దాఖలు చేసింది. ఆ కేసు విచారణ కొనసాగుతున్నది. ఈ లోపున కేంద్రం ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం సెక్షన్ 89 ప్రకారం రెండు రాష్ట్రాల మధ్య కృష్ణా జాలాల పంపిణీ జరపాలని  బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ కు నివేదించింది. ట్రిబ్యునల్ లో కూడా విచారణ కొనసాగుతున్నది. మొదటి దఫా విచారణలో పున:పంపిణీ బేసిన్ లో ఉండే నాలుగు రాష్ట్రాల మధ్య జరగాలా లేదా విడిపోయిన ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల మధ్య జరగాలా అన్న అంశాన్ని ట్రిబ్యూనల్ పరిష్కరించింది. మహారాష్ట్రా, కర్నాటక రాష్ట్రాలు సహజంగానే నాలుగు రాష్ట్రాల మధ్య పున:పంపిణీని వ్యతిరేకించాయి. కేంద్ర ప్రభుత్వం కూడా పున:పంపిణీ రెండు రాష్ట్రాల మధ్యనే జరగాలని అఫిడవిట్ ట్రిబ్యూనల్ కు సమర్పించింది. ట్రిబ్యూనల్ పున:పంపిణీ రెండు రాష్ట్రాల మధ్యనే జరగాలని తీర్పునిచ్చింది. ఇప్పుడు రెండు రాష్ట్రాల మధ్య  పంపిణీకి సంబందించి విచారణ కొనసాగుతున్నది.  కృష్ణా జలాల్లో రాష్ట్రానికి సహజ న్యాయ  సూత్రాల ప్రకారం 500 నుంచి 575 టిఎంసి ల నీటిని పొందడానికి ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తున్నది. అది సాకారం అయితే  పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల ప్రాజెక్టులకు నికర జలాలను కేటాయించుకోవడం సాధ్యపడుతుంది. అప్పుడు మాత్రమే రాష్ట్రంలో అంతర్గతంగా కృష్ణా జలాల పున:పంపిణీ అంశానికి ప్రాసంగికత ఏర్పడుతుంది.

ఈ పరిస్థితుల్లో తెలంగాణా మేధావులు ప్రభుత్వ కృషికి మద్దతునివ్వాలి. ఆంధ్రప్రదేశ్ లో ప్రజాస్వామికవాదుల మద్దతుని కూడగట్టాలి. కేసులు వేసి ప్రాజెక్టులను అడ్డుకుంటున్న వారి కుట్రలను తిప్పి కొట్టాలి. పాలమూరు రంగారెడ్డి పథకం సాగునీటి పనులపై జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ లో కేసు వేసి  స్టే తెచ్చి ఆటంకాలు సృష్టిస్తున్న వారిపై జిల్లా మేధావులు ఒక్కరూ ఎందుకు మాట్లాడరు? ఆ కేసు కారణంగా మహబూబ్ నగర్ జిల్లాలో కాలువల పనులు, రంగారెడ్డి జిల్లాకు సాగు నీరు అందించే లక్ష్మిదేవిపల్లి జలాశయం పనులు ప్రారంభించలేకపోతున్నది ప్రభుత్వం.

కృష్ణా జలాల పున:పంపిణీ సదస్సు లక్ష్యం మంచిదే. కానీ ఎవరిని, ఎక్కడ, ఎప్పుడు  ప్రశ్నించాలో అన్న దానిపై సదస్సు నిర్వాహకులకు స్పష్టత లోపించిందని చెప్పడానికి సంకోచించే అవసరం లేదు.

* * *

# అనుబంధాల పట్టిక


| వరుస సంఖ్య | వివరాలు | పేజీ సంఖ్య |
|---|---|---|
| అనుబంధం-1 | ముఖ్యమైన కృష్ణా నది బేసిన్ ఫ్యాక్టర్స్ | 61 |
| అనుబంధం-2 | శ్రీశైలం కుడి ప్రధాన కాలువ సెక్షన్, కాలువ సామర్థ్యాలు | 62-63 |
| అనుబంధం-3 | పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ ద్వారా 16 సంవత్సరాల నీటి విడుదల పట్టిక | 64 |
| అనుబంధం-4 | కృష్ణా బేసిన్ ఆవల ఆంధ్ర ప్రదేశ్ నిలువ సామర్థ్యాలు | 65 |
| అనుబంధం-5 | శ్రీశైలం వద్ద ఆంధ్ర ప్రదేశ్ మళ్లింపు సామర్థ్యం | 66 |
| అనుబంధం-6 | అక్టోబర్ 5, 2005 నాటి ఆంధ్ర ప్రదేశ్ అసెంబ్లీ డిబేట్స్ లోని పేజీలు | 67-69 |
| అనుబంధం-7 | ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ జీ.ఓ.లు 107, 170, 233, 3 మరియు 196 | 70-78 |
| అనుబంధం-8 | ఖోస్లా కమిటీ రిపోర్టులో పొందుపరచిన ప్రాజెక్టుల పటాలు | 79-80 |
| అనుబంధం-9 | శ్రీశైలం రిజర్వాయర్ వద్ద గల ప్రాజెక్టుల స్కీమాటిక్ పటం | 81-82 |
| అనుబంధం-10 | ఆంధ్ర ప్రదేశ్ జీ.ఓ. లు 203 మరియు 388 | 83-86 |

**అనుబంధం - 1**

# IMPORTANT BASIN FACTORS OF KRISHNA BASIN

| S. No | Factors | A. P. | Telangana | Remarks |
|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 |
| **1** | **Krishna Basin Area** | | | |
| a | Extent of Catchment Area in Krishna basin (**Hactares**) | 24,01,800 | 52,22,900 | |
| b | Percentage of Catchment Area | 31.5% | 68.5% | |
| **2** | **Aggregate Share of two States** | | | |
